AR
314

# NANNAYA JAYANTI

## SEMINAR PAPERS

Editor
**Prof. G. APPA RAO**
Head of the Department

DEPARTMENT OF TELUGU
UNIVERSITY OF MADRAS
MADRAS-600 005

Acc. 24447. Tel. 1808

Office of the Curator
Govt. Oriental Manuscripts Library
14 FEB 1995
Madras-600 005

Tel. 1808

# NANNAYA JAYANTI

## SEMINAR PAPERS

Editor
**Prof. G. APPA RAO**
Head of the Department

Office of the Curator
14 FEB 1995
Madras-600 005
Govt. Oriental Manuscripts Library

DEPARTMENT OF TELUGU
UNIVERSITY OF MADRAS
MADRAS-600 005

© University of Madras — 1986

Price Rs. 30/-

Printed at the Rathnam Press, Madras-600 001.

Acc. 24447. Tel. 1808

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| I. స్వాగత వచనాలు | — ఆచార్య గంధం అప్పారావు ... | 1 |
| II. ప్రారంభోత్సవం | — ఆచార్య యమ్. శాంతప్ప ... | 4 |
| 1. నన్నయభట్టు వైదిక ధర్మ నిష్ఠ | — ఆచార్య సాళ్వ కృష్ణమూర్తి ... | 9 |
| 2. Translation-Nannaya Bhatta's Methodology | — ఆచార్య ఆర్. యన్. సంపత్ ... | 25 |
| 3. ప్రాఙ్నన్నయ యుగపు తెలుగు భాష | — ఆచార్య కోరాడ మహాదేవ శాస్త్రి ... | 31 |
| 4. నన్నయ్య రాజరాజనరేంద్రులనాటి చరిత్ర | — వేదము వేంకటరాయ శాస్త్రి ... | 40 |
| 5. నన్నయ - పంపలు, తులనాత్మక పరిశీలనము | — తీర్థం శ్రీధరమూర్తి ... | 63 |
| 6. నన్నయ వాగనుశాసనుడు | — డా. జి. లలిత ... | 76 |
| 7. నన్నయభట్టారకులవారి కవిత్వ తత్త్వము | — తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు ... | 94 |
| 8. నన్నయ నుడులు | — బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు ... | 115 |
| 9. నన్నయ భారత రచన - లోకజ్ఞత | — డా. కొండవీటి వేంకటకవి ... | 125 |
| 10. నన్నయ భాష | — డా. యల్. బి. శంకరరావు ... | 137 |


—o—

# స్వాగత వచనాలు

గౌరవనీయులైన విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య శాంతప్పగారికి, సభ నలంకరించిన పండితులకు, తదితర పెద్దలకు సుస్వాగతం.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమువారు ఈ సంవత్సరాన్ని (1988) నన్నయ్య సంవత్సరమని ప్రకటనచేశారు. దీన్ని అవకాశంగా తీసుకొని నన్నయ్యభట్టు జీవితాన్ని గురించి, ఆతని కావ్య సృష్టిని గురించి, ఆతని వైదిక ధర్మనిష్ఠ మొదలైన వాటిని గురించి దేశమంతటా చర్చాగోష్ఠులు జరుగుతున్నాయి. సాహిత్యలోకంలో నన్నయ్య జయంతి ఒక విధమైన సంచలనం కలిగించింది.

మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు విభాగం కూడా మీ అందరి సద్భావ, సహకారాలతో నన్నయ జయంత్యుత్సవం జరుపుతున్నది. సహృదయులు, సుహృదయులు, ప్రజ్ఞానిధులైన పండితులతోనూ, చరిత్రపరిశోధకులతోనూ ఈ నిండు సభ వికసితపద్మాకరంవలె కన్నుల పండుగ చేస్తున్నది.

మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య శాంతప్ప గారితో "మేము నన్నయ జయంతి చెయ్యాలనుకుంటున్నామండీ!' అని చెప్పగనే వారు ఎంతో సంతోషంతో "తప్పకుండా చేయండి. విశ్వవిద్యాలయం మీ కన్నివిధాల సహాయపడుతుంది. మద్రాసు నగరంలోగల ఆంధ్ర పండితుల్ని అందర్నీ ఆహ్వానించి మంచి సెమినార్ నడిపించండి" - అని అన్నారు. ఈ మాటల్నిబట్టి వీరి మాతృభాషాభిమానం వ్యక్తమగుతున్నది.

"మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్"—అని రామరాజ భూషణుడు చెప్పినట్లు నన్నయ ఆంధ్రుల ఆదికవి. శాతవాహ

నాది ఆంధ్రరాజులకు ప్రజల భాష అయిన తెలుగుపై ఆదరాభిమానాలు లేకపోవడం వలన సాహిత్య సృష్టిలో తక్కిన సోదరభాషలయిన తమిళ, కన్నడముల కన్న కొంచెం వెనుక బడ్డాం. వెనుకబడినా మహానుభావులైన తూర్పు చాళుక్యుల ప్రోత్సాహంతో విశుద్ధమానసుడైన నన్నయభట్టుచే కావ్య సృష్టి గావింపడింది. అది ఆంధ్రుల అదృష్టః

ఎఱ్ఱన చెప్పినట్లు.

ఉ॥ భాసుర భారతార్థముల భంగుల నిక్కమెరుంగ నేరమిఁ
గానట బీసటే చదివి గాథలు త్రవ్వ తెనుంగు వారికిఁ
వ్యాసముని ప్రణీత పరమార్థము తెల్లము జేసినట్టి య
జ్ఞాసనకల్పులందలఁతు నాద్యుల నన్నయ తిక్కనార్యులన్.

నన్నయకు పూర్వం తెలుగువారు గానట బీసటగా చదివి గాథలు త్రవ్వేవారని స్పష్టమగుచున్నది.

కావ్య సృష్టికై నన్నయ అనేకకష్టాలు పడ్డాడు. ఆనాటి పండితులంతా సంస్కృత భాషాభిమానులు. వారికి సంతృప్తి కలిగించిన విధంగా కావ్య నిర్మాణం జరగాలి. మహాసముద్రములాంటి వ్యాసభారతాన్ని తెలుగులో చెప్పడం సామాన్యమైన పనికాదు. రాజరాజు ఆంధ్రీకరించమని కోరాడు. అతని కోర్కె తీర్చాలి. ఆనాటి తెలుగుభాషలో వాక్యరచనాపద్ధతి పెంపొందలేదు. తెలుగు ఛందస్సు కూడా విరివిగా నూతన వృత్తాలతో వెలయలేదు. సంస్కృత భాషలో ఉన్నట్లు కావ్య రచనకు కావలసిన సామగ్రి ఏదీలేదు. ఆనాటి తెలుగుభాషకు ఒక లక్షణం, ప్రామాణికమార్గం లేదు. వాటిని సంపాదించుకోడానికి నన్నయభట్టు ఎంతో శ్రమపడ్డాడు. నన్నయ భాషా వాఙ్మయాలు రెండూ సృష్టించుకోవలసివచ్చింది. సహాధ్యాయి ప్రియమిత్రుడు వాఙ్మయ ధురంధరుడు నారాయణభట్టు సహాయంతో వ్యాసభారతాన్ని తెలుగుసేయ నమకట్టాడు.

Tel. 1808



" పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా
రాయణునట్లు వాసిగ ధరామరవంశ విభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుడు దన కిష్టుడుఁ సహా
ధ్యాయుడునైన వా డభిమత స్థితి దోడయి నిర్వహింపగన్ "

ఈతని ధైర్య స్థైర్యాలు, త్రికరణశుద్ధి మెచ్చుకోతగ్గవి. తన్ను గూర్చి చెప్పుకొన్న అవిరళ జపహోమతత్పరు—విపుల శబ్దశాసను—లోకజ్ఞు, ఉభయభాషా కావ్యరచనాభిశోభితు—నిత్యసత్యవచను — పరమధర్మ నిరతున్— ఈ మాటలన్నీ భారతమున ఆయాసందర్భాల్లో మనకు కనిపిస్తాయి. జీవిత ప్రతిబింబమే కదా కావ్యము.

వ్యాసభారతాన్ని తన మూసలో పోసుకొని కావ్యసృష్టిచేశాడు. ఈతని కవితలోని ప్రసన్న కథాకలితార్థయుక్తి, అక్షర రమ్యత, నాన రుచిరార్థ సూక్తులు, ధారాశుద్ధి, గాంభీర్యము, సందర్భోచిత పద్య రచన తరువాతి కవులందరికీ ఆదర్శాలైనాయి.

ఉ॥ " సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తి లో
నారసి మేలు నా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుఁ డయ్యె జగద్ధితంబుగాన్."

ఇప్పుడిక్కడ సమావేశమై ఉన్న పండితులు నన్నయ కవితలోని గుణ విశేషాల్ని వివరిస్తారు. ఆతని నిజరూపాన్ని ఆవిష్కరిస్తారు. వీరి ఎదుట నేను ఇంకా ఎక్కువగా మాట్లాడడం ఉచితం కాదు. మీ అందరికీ మరొక్కసారి స్వాగతం చెబుతూ ఆచార్య శాంతప్పగారిని ప్రారంభోత్సవం చేయమని కోరుతున్నాను.

# ప్రారంభోత్సవం

ఆచార్య యమ్. శాంతప్ప

సభను అలకరించిన రసజ్ఞులయిన పండితులకు సోదర సోదరీమణులకు నా నమస్కారాలు.

ఇటువంటి పండిత సభలో మాట్లాడే అవకాశం కలిగినందుకు నేనెంతో ఆనందాన్ని పొందుతున్నాను.

'మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్'

అని రామరాజభూషణుడు చెప్పినట్టు ఆంధ్ర వాఙ్మయ ప్రపంచానికి సృష్టికర్త నన్నయ. ఈ రోజున ఆ మహాపురుషుని జయంతి ఉత్సవం జరుపుకొంటున్నాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు ఈ సంవత్సరాన్ని నన్నయ సంవత్సరమని ప్రకటించారు. దాన్ని పురస్కరించుకొని మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖవారు ఈ మహాసభను ఏర్పాటు చేయడం అత్యంత ముదావహం.

నన్నయ జయంతి ఉత్సవం ఆంధ్ర దేశమంతటా అన్ని ప్రాంతాల్లో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నట్టు పేపర్లో చూస్తున్నాం. సాహిత్యపరుల్లో ఈ సంచలనం కలిగించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు అభినందనీయులు.

తెలుగు భాష చాల అందమైన భాష అని మనమనడమే కాదు. సహృదయులైన ఆంధ్రేతరులు అనేకమంది అన్నారు. కన్నడ మాతృభాషగాగల తుళువంశంలో పుట్టిన కృష్ణదేవయలు తెలుగు భాషను పోషించారు. అతని ఆస్థానంలో అష్టదిగ్గజాలు ఉండడమే కాకుండా ఆ మహారాజు తెలుగులో 'ఆముక్తమాల్యద, అనే మహా



కావ్యాన్ని వ్రాశారు. తెలుగురాజుగా ఉన్నందుకు గర్వించారు. 'దేశ భాషలందు తెలుగు లెస్స'అని చాటి చెప్పారు. పాశ్చాత్యులు కొంతమంది తెలుగును 'Italian of the East' అన్నారు. మరికొంతమంది 'French of India' అని చెప్పారు.

నా దృష్టిలో భారత దేశంలోగల అన్ని భాషలూ గొప్పవే! ఏ సాహిత్యమూ తక్కువ కాదు. అయితే ఒక్కొక్క భాషలో ఒక్కొక్క ప్రత్యేకత ఉంది. మన తెలుగు భాషలో ఒక ప్రత్యేకత కలదు. ఇది 'సంగీతానికి పనికి వచ్చే మృదువైన భాష' (Musical Language) 'జిలిబిలి పల్కుల బలు ముద్దులు గుల్కెడు భాష' అందుచేతనే నిష్పాక్షిక దృష్టిగల తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతిగారు సుందర తెలుగులో పాట పాడాలన్నారు. ప్రసిద్ధ వాగ్గేయకారుడు భక్తశిఖామణి త్యాగయ్య సుందర తెలుగులో శ్రీరాముని కీర్తించి అఖిలభారతసంగీతకవియై బహుజనుల మన్నన పొందాడు. ఇంత అందమైన భాషకు కారకుడైన నన్నయకు మనము జోహార్లు అర్పించాలి.

అతులిత మాధురీమహిమ ఆంధ్రుల భాషకు ఏలకల్గెనో? తెల్సుకొందాం.

ఏ భాషకానీ, ఎవరుగానీ, అభివృద్ధిగాంచాలంటే ఇచ్చి పుచ్చుకొనే దృక్పథం అలవర్చుకోవాలి. తెలుగువారు గోడలు కట్టకుండా సంస్కృతంలోని జిగిబిగి పటుత్వమనే మంచి గుణాలను గ్రహించారు. సహజంగా వారి భాషకున్న మృదుత్వాన్ని మేళవించారు. అందుచేతనే తెలుగు అందమైన భాషగా రూపొందింది.

ఒకరిలోని మంచి గ్రహించిననాడే తన మంచితనం ప్రకాశిస్తుందనే సత్యాన్ని మనం మర్చిపోకూడదు. ఇంగ్లీషు ఈనాడు ప్రపంచ భాష, అందమైన భాష అవడానికి రహస్య మిదే! ఇంగ్లీషు తనకు ముందున్న భాషలను త్రోసి రాజని ప్రపంచవ్యాప్తిని పొందింది. ప్రపంచ భాషల్లో ఏ భాషలో మంచి కనిపించినా అది గ్రహించింది.

దురదృష్టవశాత్తు మన తెలుగుసాహిత్యసృష్టి చాల ఆలస్యంగా జరిగింది. సోదరభాషలయిన తమిళ కన్నడాలలో సాహిత్యసృష్టి మనకంటే ముందు జరిగింది. తెనుగు వెనకబడడానికి ప్రబల కారణం మొదటి ఆంధ్ర రాజులు శాతవాహనులు, తరువాత వచ్చిన ఇక్ష్వాకులు, పల్లవులు, బృహత్ఫలాయనులు, శాలంకాయనులు మొదలయినవారు. ఈ రాజులు ప్రజల భాషఅయిన తెలుఁగు పట్ల శద్ధాసక్తులు చూపలేదు. రాజ్యపాలనాకార్యకలాపాలన్నీ సంస్కృత, ప్రాకృతంలోనే జరుగుతుండేవి. వారి శాసనాలు కూడ సంస్కృత, ప్రాకృతంలోనే ఉన్నాయి. ఆనాటి సంస్కృత పండితులు జనసామాన్యానికి దూరంగా ఉంటుండేవారు. వారెంతసేపూ సంస్కృత ప్రాకృతాల్ని ఆరాధిస్తూ రాజుల కార్యకలాపాలకు తోడ్పడుతుండేవారు.

6 వ శతాబ్దం మొదలుకొని మనకు లభించిన శాసనాలలో తెలుగు కనిపించినా, 7 వ శతాబ్ది మొదలు రాజ పోషణ కలిగి క్రమ వికాసాన్ని పొందింది. 11 వ శతాబ్దం నాటికి పరిపూర్ణరూపం ధరించింది. తూర్పు చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుని ఆస్థానమున మొట్టమొదట తెలుగు గ్రంథమైన 'ఆంధ్ర మహాభారతం' వెలసింది. దీన్ని గురించి ఇక్కడున్న పండితులు, భాషా శాస్త్రజ్ఞులు, చరిత్ర పరిశోధకులు విపులంగా చెబుతారు. ఇందులో నాకు అంత ప్రవేశం లేదు.

ఆంధ్ర మహాభారతము అవతరించడానికి ముఖ్యమైంది మత సంబంధమైన కారణమని గట్టిగా చెప్పాలి. ఆనాడు బౌద్ధ, జైన మతాలు జనసామాన్యంలో వ్యాప్తిగాంచాయి. వైదిక ధర్మాలకు నష్టం వాటిల్లింది. రాజు హిందూమతానికి చెందినవాడు. 'పంచమ వేదమ్' అని చెప్పబడే భారత ఇతిహాసాన్ని తెలిగించి వైదిక ధర్మం ప్రజలలో వ్యాప్తి పొందునట్లు చేయడానికి నిశ్చయించేడు. అది అతని జీవితధ్యేయం. కాలం కర్మం కలిసివచ్చింది. మహాభారతం అవతరించింది.



ఎన్నో కష్టాలు పడి ఈ ఇతిహాసరూప మగు 'భారతాన్ని' నన్నయ సర్వాంగసుందరమైన కావ్యంగా రూపొందించేడు. ఆ నాటి పండితులు అతన్ని ఎన్నో చికాకులు పెట్టి ఉంటారు. తన ప్రియ మిత్రుడైన నారాయణభట్టు భారతయుద్ధరంగమున అర్జునునకు శ్రీకృష్ణుడు తోడ్పడినట్లు పండితులతోడి యుద్ధంలో నన్నయకు తోడ్పడ్డాడు.

నన్నయ తన మిత్రుని గురించి ఈ విధంగా చెప్పడం తన మంచితనానికి నిదర్శనం. మిత్రుడు ఏ చిన్న మేలు చేసినా కొండంతలుగా చెప్పుకొనుట గొప్ప వారి లక్షణం.

నన్నయ ఆది సభా పర్వాలు అరణ్యపర్వం నాల్గవ ఆశ్వాసం వరకు (యక్ష ప్రశ్నలు వరకు) తెలిగించి కాలగతి పొందాడు. తిక్కన మాత్రం మూడు పర్వాలు నన్నయే వ్రాసినట్లు చెప్పాడు. నన్నయ తన కవిత్వలక్షణాల్ని మూడు విధాలుగా వివరించారు.

1. ప్రసన్న కథా కలితార్థయుక్తి
2. అక్షరరమ్యత
3. నానారుచిరార్థసూక్తులు,

వ్యాసుని భారతానికి అనువాదమైనా నన్నయ అన్ని కథల్ని తన స్వంతం చేసికొన్నారు. కచుని కథ అనుకోండి, నలచరిత్ర అనుకోండి, దుష్యంతుని చరిత్ర కానివ్వండి - తన సొంత కథల్లా ఉంటాయి. నాకు కాళిదాసు శకుంతల కంటే నన్నయ శకుంతలపై భక్తి గౌరవములు మెండు. ఎందుకంటే, భయపడకుండా ఆమె రాజును ఎదిరించి ధర్మాల్ని వివరిస్తుంది. ముఖ్యంగా సత్యాన్ని గురించి, భార్యాభర్తల సంబంధం గురించి ఉపన్యసించిన తీరు కొనియాడదగింది. ఈ సందర్భంలో శకుంతల చూపిన ధైర్యస్థైర్యాలు సమస్త భారతీయ మహిళలకు ఆదర్శ ప్రాయాలని చెప్పాలి.

ఇక అక్షరరమ్యత ఆతని కావ్యమున అంతటా చూస్తాం. నన్నయ పద్యాలు ఒక పర్యాయం చదివితే చాలు మనకు తెలియకుండానే కంఠస్థమవుతాయి. ధారాశుద్ధికి ఈతని కవిత్వం పెట్టింది పేరు.

మరో లక్షణం రుచిరార్థసూక్తులు. సూక్తులంటే మంచి మాటలని అర్థం. ఇవి కావ్యంలో ధర్మోపదేశానికి తత్త్వబోధకు అత్యంత అవసరం. అవకాశం దొరికినప్పుడెల్లా నన్నయ ఈ సూక్తుల్ని ఉపయోగిస్తాడు.

1. గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్

2. క్రోధము ధర్మక్రియలకు

బాధ యగున్, క్రోధిగా దపస్వికి జనునే.

ఇటువంటివి ఎన్నో చూస్తాం.

కుమారాస్త్రవిద్యాప్రదర్శనసందర్భంలో శిశుపాలవధ, భీమప్రతిజ్ఞ మొదలయిన సందర్భాల్లోని పద్యాలు ఇతని ధారాశుద్ధికి మచ్చుతునకలు.

ఈతనిని తిక్కన ఆంధ్రకవిత్వవిశారదుడు విద్యాదయితుండు, మహితాత్ముడని చెప్పాడు. ఎఱ్ఱన భద్రకుంజరముతో సరి పోల్చాడు. నన్నయ త్రికరణశుద్ధి గల వైదికనిష్ఠాపరుడు. సత్యసంధుడు, లోకజ్ఞుడు. ఇటువంటి మహాపురుషుడు ఆంధ్రుల ఆదికవి కావడం గొప్ప భాగ్యమని చెప్పి నేను సెలవు తీసుకుంటున్నాను.

Office of the Curator
Govt. Oriental Manuscripts Library
14 FEB 1995
Madras-600 005

# నన్నయభట్టు వైదికధర్మనిష్ఠ

1808

ఆచార్య సాళ్వ కృష్ణమూర్తి

నన్నయభట్టు వైదిక ధర్మ నిష్ఠను గమనిపవలెనన్నచో నన్నయ భట్టును గూర్చి కూడ చెప్పవలసి ఉండును.

1. నన్నియ/నన్నయ: క్రీ. శ. 1053 నాటి 'నందం పూడి' అటు తర్వాతి 'మండ' శాసన కావ్యకర్త అయిన నన్నియ ఆంధ్ర మహాభారత కర్త అయిన నన్నయ ఒక్కరే అనుట 'ఉపచ్ఛేద మవివక్షిత'మ్మను న్యాయమున సమీచీనము. 'నన్ని' శబ్ద మాధారముగ నన్నయను కర్ణాటకు డనుకొన నక్కఱ లేదు.

2. భట్టు శబ్దము: భట్టు శబ్దము కూడ నన్నయ మహారాష్ట్రుడేమో అనుకొనుట కవకాశ మిచ్చినది. తెనుగులో 'భట్టు'గా కనపడు ఈ శబ్దము సంస్కృతమున 'భట్టారక' శబ్దము. సంస్కృతమున భటధాతువు భృత్యర్థకము (భట భృతౌ) పోషణార్థమున వచ్చునది. 'భటాః సేవకాః తైః ఉత్తారయతి ఇతి భట్టారకః' అని వ్యుత్పత్తి. ఈ శబ్దము లౌకికముగ నాట్య పరిభాషలో రాజునకు చెల్లును. వైదికమున అగ్నిదేవునకు చెల్లును. నన్నయ భారతములోనే అగ్ని భట్టారకుడని (ఆది. 1 ఆ - 139, 141) ప్రయోగము లున్నవి. క్రీ. శ. 7 వ శతాబ్దమున కుమారిలభట్టు ప్రభాకరభట్టు అను వారు జైమినీయ దర్శన మగు మీమాంసా సూత్రములకు వ్యాఖ్యానములు వ్రాసినారు. అవి భాట్ట ప్రాభాకర ప్రస్థానములైనవి. అప్పటినుండి మీమాంసకులలో భట్ట శబ్దము ప్రచురమైనట్లు తోచును. అపూర్వ గ్రంథ రచనాసమర్థుడగు వాడు భట్ట శబ్ద వాచ్యుడని ఒక శ్లోక మున్నది.[1] అపూర్వ మన్నది పూర్వ మీమాంసలోని అంశము.

1. అపూర్వ గ్రంథనిర్మాతా భట్ట ఇత్యభిధీయతే - శాబర భాష్యము.

అపూర్వగ్రంథమనగా తొలుత దానిని ప్రతిపాదించు మీమాంసా శాస్త్ర గ్రంథము. తర్వాతికాలమున అది 'ఏ యితరగ్రంథముల వలనను తెలియబడని విషయముగల శాస్త్ర గ్రంథమునకు పేరైనది. నన్నయ నాటికి ఈ భట్ట శబ్దము బ్రాహ్మణులందఱకు వర్తించెడిది కాదు. విమలాదిత్యుని (క్రీ. శ. 1011-1022) కాలమున శాసన కావ్య కర్తయైన భీమనభట్టు, రాజనరేంద్రునికాలమున కలిదిండిశాసన కావ్య కర్తగా నుండిన బేతనభట్టు, నందంపూడి శాసనకావ్యకర్త అయిన నన్నయభట్టు, ఇతనికి భారత రచనలో సహాయపడిన నారాయణభట్టు ఈ నలువురలో మొదటి ముగ్గురు శాసనకావ్యకర్తలుగా సంధి విగ్రహి స్థానీయులగుటచేతను ఆ అమాత్యపదవి పితృపితామహక్రమమున వచ్చెడి దగుటచేతను ఏకకుటుంబము వారనవచ్చును. అట్లె రాజరాజు సవతిసోదరుడగు విజయాదిత్యునికాలమున అమాత్యుడుగానుండి క్రీ. శ. 1072 లో రాజమహేంద్రవరమున శాసనము వేయించిన భీమనప్రెగ్గడ నన్నయ కుమారుడగుట ప్రాయోభావము. వీరుకాక చాగంటి శేషయ్యగారు ఆంధ్రకవితరంగిణి (Vol I) లో ఇచ్చిన తూర్పు చాళుక్యుల శాసనములలో దాదాపు 160 సంవత్సరముల వ్యవధిలో ముగ్గురు మాత్రమే భట్ట నామధారులు కనబడుచున్నారు : క్రీ. శ. 892 నాటి కూకి పఱ్ఱు శాసనములో ఒక ద్రోణభట్టు ; అటుతర్వాతి కంచుంబఱ్ఱు శాసనములో ఒక భట్టుదేవుడు ; నందంపూడి శాసనము తర్వాతి మండ శాసనములో ఒక శివకుమారభట్టు. కాగా భట్ట శబ్దము మీమాంసాపండితులకు మాత్రమే ప్రాయికముగా చెల్లెడి దనుట పిండి తాంశము. మీమాంస తెలియునివారును యజ్ఞ యాగాదులు చేయవచ్చును. యజ్ఞ యాగాదులు చేసియు భట్ట నామములేనివారును శాసనములలో ఉన్నారు. 7 వ శతాబ్దమునాటి రెండవ విష్ణువర్ధనుని శాసనములోని ధ్రువశర్మ, విమలాదిత్యుని రణస్థిపూడి శాసనములోని వజ్జియప్రెగ్గడ ఇట్టివారు. నన్నయభట్టు, నారాయణభట్టు ఈ యిద్దఱు

Tel·1808



కవులేకాక మీమాంసకులు. ఇది చెప్పబోవు వైదికధర్మనిష్ఠలో ఋజువు కాగలదు. కాగా భట్ట శబ్దము నన్నయ మీమాంసకుడనుటకు చాలునేకాని ఏ ప్రాంతమువాడో నిర్ణయించుట కక్కఱకు రాదు.

8. నన్నయగోత్ర సూత్రాదికము : నన్నయ తన్నుగూర్చి ప్రథమ పురుషలో చెప్పిన 'తన కుల బ్రాహ్మణు' డను భారత పద్యము (ఆది. ఆ1-19 ప) ప్రసిద్ధము. దానిలో తాను ఆపస్తంబ సూత్రుడనని, ముద్గల గోత్రజాతుడనని మాత్రమే చెప్పినాడు. ఆపస్తంబ సూత్రుడనని చెప్పుటలోనే తాను కృష్ణ యజుర్వేద శాఖకు చెందిన వాడననుట ఇమిడి ఉన్నది. ఆపస్తంబసూత్రము కృష్ణ యజుర్వేదశాఖలోని మంత్రములను ఆక్రమమునే అనుసరించి వాడినది. ఆపస్తంబసూత్రులందఱు కృష్ణ యజుర్వేదము వారనుట నిశ్చితము. అందువలననే నన్నయ చెప్పలేదు. తైత్తిరీయ బ్రాహ్మణము, తైత్తిరీయారణ్యకము, తైత్తిరీయమహానారాయణోపనిషత్తు కృష్ణయజుశ్శాఖకు సంబంధించిన వేదభాగములు.

ఈ సందర్భమున నన్నయ వైదికియా నియోగియా అని జరిగిన చర్చ స్మరింపవలసి ఉన్నది. ఈ చర్చ శాఖాభిమానముల వలన జరిగిన అచ్చపు లౌకిక వివాదము. ధర్మశాస్త్రమున దీనికి తావే లేదు. ఈ చర్చా వివాదములలోనికి లాగబడినవి పై పద్యములోని రెండు పట్టులు. కుల బ్రాహ్మణుడన్న పదబంధ మొకటి. నన్నయ ముద్గల గోత్రజాతుడననిచెప్పుకొనగా చిత్రాంగదాపరిణయకర్త, నియోగి అయిన గోపాలునిరామకవి తాను మౌద్గల్యగోత్రమువాడనని చెప్పికొని నన్నయను మూల పురుషుడుగాచెప్పికొనుట. ఇందు మొదటిది కుల బ్రాహ్మణ శబ్దార్థము. రెండవ అమ్మరాజు విజయాదిత్యుని శాసనములోని కుల బ్రాహ్మణ శబ్దమునకు Fam ily Priest అని పాశ్చాత్యులు చెప్పిన అర్థము తప్పు. 'కుల పర్వత'మన్నపుడెట్లు అర్థము చెప్పుదుమో కులబ్రాహ్మణుడన్నపుడును అట్లే చెప్పవలెను. కుల బ్రాహ్మణుడనగా కులీనుడైన బ్రాహ్మణుడని మాత్రమే అర్థము.

పురోహితుడని చెప్పరాదు. వ్యాస భారతమున సభాపర్వములో నారదుడు ధర్మజునితో రాజనీతిని ప్రస్తావించు సందర్భమున మంత్రులను గూర్చి అడుగుచు 'కులీనాశ్చానురక్తాశ్చ కృతాస్తే వీర మంత్రిణః' (5 అ. 27 శ్లో) అనియు, పురోహితప్రశంసలో 'కచ్చిద్వినయ సంపన్నః కుల పుత్రో బహుశ్రుతః" (5 అ. 41 శ్లో) అనియు, వీరభటుల ప్రస్తావనలో 'కచ్చిత్సర్వేఽనురక్తాస్త్వాం కులపుత్రాః ప్రధానతః' - అను చోట్ల (5 అ. 52 శ్లో) కులీన, కుల పుత్ర శబ్దములు వాడబడినవి. కులీనుడు గొప్పవంశమువాడు. కుల పుత్ర శబ్దము కులసంభవ శబ్ద తుల్యము. సామాన్యమగు కులమింటివాడు. నన్నయ తన రచనలో పురోహిత ప్రశంసకడ కుల పుత్ర శబ్దమును వదలినాడు; వీరభటుల ప్రస్తావనలో గ్రహించి నిలిపినాడు. మంత్రుల ప్రస్తావనలో 'అనఘుల శాస్త్ర విధిజ్ఞుల ననురక్తుల పితృపితామహక్రమమున వచ్చిన విప్రుల' (సభా. ఆ 1-26 ప) నని వ్రాసి కులీనతకు అనురక్తికి పితృపితామహక్రమము నాకరము చేసినాడు. కుల బ్రాహ్మణుడనని చెప్పికొన్న నన్నయ తాను పితృపితామహక్రమమున వచ్చిన వాడగుటయే కారణము కానోపును. ఫలితార్థము నన్నయ తాను గొప్పవంశము వాడనను అర్థమునసే కులబ్రాహ్మణ శబ్దమును వాడినాడు. వైదికివాదులకుగాని నియోగివాదులకుగాని ఈ శబ్దము నిరుపయోగము. ఇంక నియోగియైన గోపాలుని రామకవి తాను మౌద్గల్య సగోత్రుడ ననుచు నన్నయను పేర్కొనుట ముద్గల మౌద్గల్య గోత్రములొక్కటియా అను చర్చను దెచ్చినది. ముద్గల మౌద్గల్య గోత్రములొక్కటే యనుటలో సందేహములేదు. రెండింటికి ప్రవరలొక్కటే. గోత్రమును చెప్పునపుడు గోత్రకర్తనామముతోగాని దాని తద్ధితాంతరూపముతోగాని చెప్పుట వికల్పము. ప్రవరలోని ఋషి గణమును తద్ధితాంత రూపములతోనే చెప్పవలెనని నియమము. కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రిగారు చూపిన వశిష్ఠ వాశిష్ఠ పరాశరగోత్రముల భిన్నత్వము యథార్థమే కాని ముద్గల మౌద్గల్య గోత్రములు వేరనుటకు పనికిరాదు. వశిష్ఠుడు కూటస్థ పురుషుడు. అది ఏకార్షేయమె. వాశిష్ఠుడు వశిష్ఠుని



కొడుకే కానక్కఱలేదు. ఆ వంశము వాడు కావచ్చును. అతడు గోత్రకర్త అయినపుడు వాశిష్ఠగోత్రమగును. ఇది త్రయార్షేయము. వాశిష్ఠ, మైత్రావరుణ, కౌండిన్య ఋషులు. పరాశరగోత్రము త్రయార్షేయమె. వాశిష్ఠ, శాక్త్య, పారాశర్యులు ఋషులు. ముద్గల గోత్రము ఆంగీరసగణములోని (1) గౌతమగణము (2) భరద్వాజగణము (3) కేవలాంగిరసగణము అను వానిలోని కేవలాంగిరసగణమునకు చెందినది. వీరిలో హారీతులు, కుత్సులు, కణ్వులు, రథీతరులు, ముద్గలులు, విష్ణువృద్ధులు ఉన్నారు. ఈ ఆఱు గణముల వారికి గౌతమ భరద్వాజ గణముల వారితో వివాహాదు లున్నవి. ముద్గలగోత్ర భిన్నమైన మౌద్గల్యగోత్రము లేదు. ఇది నిర్ణయసింధువు ప్రవరఖండలో నున్నది. అస్తు. అప్పుడు గోపాలుని రామకవి నియోగి కనుక నన్నయ నియోగి అగునా? ఇది భిత్తిక లేని చిత్రము. ఇచ్చట ఒక విషయము చెప్పవలెను. నన్నయ ఆపస్తంబసూత్రుడు ముద్గలగోత్రుడు. నారాయణభట్టు ఆపస్తంబసూత్రుడు. హారీత గోత్రుడు. గోపాలుని రామకవి ఆపస్తంబసూత్రుడు. మౌద్గల్య గోత్రుడు. వీరు ముువ్వురు కృష్ణయజుశ్శాఖవారే. నారాయణభట్టు నియోగి అని వీరేశలింగంపంతులుగారు చాగంటి వారు కూడ వ్రాసినారు. కాని నిరాధారము. నన్నయనాటికి వైదికనియోగి భేదమే లేదు. ఈ శాఖాభేదము కాకతి గణపతిదేవుని కాలమున మొదలైనది. గోపరాజు రామప్రధాని అనునతడు అంతవరకు విశ్వబ్రాహ్మణులకుండిన కరణికపుటుద్యోగములను బ్రాహ్మణుల కేర్పాటు చేసినాడు.[1] దానితో ఈ ఉద్యోగులూరూర వెలసి వీరి సంఖ్య పెరిగినది. బ్రాహ్మణులకు విహితమైన అధ్యయన అధ్యాపన యజన యాజన దానప్రతిగ్రహములను షట్కర్మలలో అధ్యాపన యాజన ప్రతిగ్రహములను వీరు వదలుకొన్నారు. షట్కర్మలు పాటించువారు వైదికులైనారు. వానిలో మూడింటిని వదలుకొన్నవారు నియోగులైనారు.

---

1. చిల్లరిగె శ్రీనివాసరావు - ఆంధ్రదేశము చరిత్రము - మొదటిభాగము - పుట 44 - ఆంధ్ర సరస్వతీ గ్రంథమాల ప్రచురణ 1933.

4. నన్నయ యజ్ఞము చేసినాడా? నన్నయ యజ్ఞము చేసినట్లు పదునేడవశతాబ్దివాడైన పట్టమట్ట సరస్వతీ సోమయాజి తన పృథుచరిత్రములో చెప్పినాడు. ఇది నమ్మదగినదా అను సందేహ మున్నది. నన్నయ 'తన కులబ్రాహ్మణు' డన్న పద్యములోనే తన వేదశాఖను సూత్రాను మితిగా చెప్పినట్లు దీనిని కూడ చెప్పినాడు. 'నిత్య సత్య వచను' అన్నది రెండు కారణములచేత అచట నిబంధింపబడినది. వ్యాస భారతము 'సత్యవాక్ప్రబంధ' మని మూలముననే చెప్పబడినది. దానిని భాషాంతరీకరించుటకు తనకు గల అర్హతను చెప్పికొనవలెను. రెండవది తాను యజ్ఞముచేసినది చెప్పవలె. ఈ రెండింటికనుకూలముగా నన్నయ ఆ మాటవ్రాసినాడు. నిత్యసత్యవచనుడు యజ్ఞముచేసినా వాడగునా? అట్లు కాదు. యజ్ఞముచేసినవాడు నిత్య సత్యవచనుడుగా ఉండవలె. 'తస్మాదాహితాగ్ని ర్నానృతం వదేత్' అని తైత్తిరీయ బ్రాహ్మణము. ఈ బ్రాహ్మణము కృష్ణయజుశ్శాఖకు చెందినదని ముందే చెప్పితిని. నన్నయ యజ్ఞముచేసినాడనుట నిశ్చితము. ఆ చేయుటతణుకుకడ గోస్తనీనదీతీరముననా రాజమహేంద్రవరముననా అన్నచో చెప్పలేము.

కాగా నన్నయభట్టు కృష్ణయజుశ్శాఖీయుడు. ఆపస్తంబ సూత్రుడు. ముద్గలగోత్రుడు. మీమాంసకుడు. యజ్ఞముచేసినవాడు. సంహితాభ్యాసుడు. అవిరళజపహోమ తత్పరుడు. ఇవి అతని కర్మిష్ఠితకు సూచనలు. ఉభయభాషాకావ్యరచనాభి శోభితుడు, సత్ప్రతిభాభియోగ్యుడనునవి ఆయన సాహిత్యసంబంధమైన అర్హతలు.

5. వైదిక ధర్మ స్వరూపము: నన్నయ వైదిక ధర్మనిష్ఠను వివరించుటకు ముందు వేదమనగా ఏమియో ధర్మమనగా ఏమియో చెప్పవలసి ఉన్నది. ఆధునికులమని చెప్పికొను మనకు వైదికధర్మమనగా ఏదియో పట్టి పూర్వాచార పరాయణత్వము (Orthodoxy) గా తోచును. ఈ కాలమున ఉండుటయే అధునికత అయినచో ఎప్పటి



వారప్పటికి ఆధునికులే అగుదురుగనుక అందులో విశేషమేమియు లేదు. దేశకాలముల ననుసరించి ప్రయోగశీలమైన చిత్తవృత్తితో వ్యష్టి సమష్టి సౌఖ్యమునకు శ్రేయస్సునకు ప్రయత్నించుట ఆధునికత అని చెప్పికొన్నచో అది సార్థకముగా ఉండును. వైదిక ధర్మము ప్రయోగశీలమైనది. వ్యష్టి సమష్టి శ్రేయమునకు ప్రయత్నించునది. దీనికే సనాతనధర్మమని పేరు. సనాతనమనగా శాశ్వతమైనది అని అర్థము. శాశ్వతమైనది ఆధునికమును అగును. 'ధర్మార్థనిబద్ధమేవ జీవితమ్' అని వ్యాసుడు భారతోద్యోగపర్వమున కుంతీ ముఖమున ఒక నిర్వచనము చేసినాడు. దేనియందు ధర్మము అర్థము నిబంధింపబడి ఉన్నవో అదే జీవితమన బడుచున్నది. ధర్మము సృజనసూత్రము (Cveative Principle). అర్థము దాని ఫలము. అర్థశబ్దము ద్రవ్యము (Substance) గుణము (Quality) కర్మము (Action) అను వానియందు వర్తించును. లోకములో నున్నవన్నియు ద్రవ్యములు, వాని గుణములు, వాని పనులే. కాగా అర్థమన్నది లోకమునంతటిని చెప్పును. ఇట్టిలోకమున సర్వుల కోరికలు రెండువర్గములక్రిందకు మాత్రమే వచ్చును. తాను కోరినది జరుగుట; తన కిష్టములేనిది జరుగకుండుట. మొదటిది ఇష్టసిద్ధి. రెండవది అనిష్ట పరిహారము. వీనికై మనము సాధారణముగా లౌకికమైన ఉపాయములతో ప్రయత్నింతుము. అవి పనిచేయనపుడు మతమును ఆశ్రయింతుము. నేడు మనము మతమనుచున్న దానినే ప్రాచీనులు ధర్మమన్నారు. వైదిక ధర్మము వేదము నాశ్రయించిన మతము. వేదమనగా నేమి? ఇష్టసిద్ధి అనిష్ట పరిహారమునకై అలౌకికమైన ఉపాయమును ఏది బోధించునో అది వేదమని వేదభాష్యకర్త సాయణుడు ఐతరేయబ్రాహ్మణ వ్యాఖ్యలో నిర్వచించినాడు. ఈ అలౌకికమైన ఉపాయమే ధర్మము. అలౌకికమనగా ఇంద్రియజ్ఞానభూమికకు (Sense Plane) హేతువాదభూమిక (Rationalistic-Plane) కు అతీతమైనది. 'ధరతిలోకానితి ధర్మః' అను వ్యుత్పత్తి ఇది సృజనసూత్రమని తెల్పును. 'ధ్రియతే జనైరితి ధర్మః' అను వ్యుత్పత్తి జనులు ప్రయత్నపూర్వకముగా పూనవలసినదని చెప్పును. ఏల?

సహజముగా పూనుటకు కారణముండదు కనుక. దీనినే వాశిష్ఠ ధర్మ సూత్రము ' అగృహ్యమాణకారణోధర్మః ' అని చెప్పినది. ధర్మమునకు లౌకికమగు కారణము ఉండదు. వేదమిట్టి ధర్మమును బోధించును. ఈ వేదము సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తు అని నాల్గు విధములు. మొదటి రెండు కర్మకాండకు ముఖ్యములు. చివరి రెండును జ్ఞానకాండకు ముఖ్యములు. సంహితను, బ్రాహ్మణమును ఆశ్రయించి జైమిని మీమాంసాదర్శనము కర్మకాండను చెప్పుచున్నది. దీనికే ధర్మ మీమాంస అని కూడ పేరు. బాదరాయణుని బ్రహ్మ సూత్రములు జ్ఞానకాండ. ఇది ఉత్తర మీమాంస, వేదాంతము అనబడుచున్నది. కర్మకాండ వలన చిత్తశుద్ధి కలిగి జ్ఞానకాండకు అర్హతవచ్చును. వైదిక ధర్మమనునది ఇట్లు పూర్వోత్తర మీమాంసలు. అయినను మొదటిమెట్టుగా లౌకిక జీవితమున కర్మకాండకు ప్రాధాన్యము. మీమాంసా పరిభాష ' వేదబోధితేష్టసాధనతాకో ధర్మః ' అని చెప్పి యాగాదులను చెప్పుచున్నది. వేదము బోధించెడు ఇష్ట సాధన తాకమైనదే ధర్మము, అది యాగాదులు. కర్మకాండలో సంహిత బ్రాహ్మణము ముఖ్యములు. బ్రాహ్మణములో కర్మను విధించు వాక్యములుండును. సంహిత మంత్రముల సముదాయము. కర్మాచరణ సమయమున అర్థ స్మారకమైనది మంత్రము. ద్రవ్య త్యాగమే యాగము. ఈ యాగ రూపమైన ధర్మము స్వతంత్రముగ ఫలము నీదు. చోదన (Catalyst) గా మాత్రమే పనిచేయును. యజమానుని పుణ్యపాప సంస్కారములను మేల్కొల్పి ' అపూర్వము ' అను దానిని కల్పించును. అది యజమానుని అదృష్టము కొలది వాని ఇష్టమును కాలాంతరమున ఫలింపజేయును. మీమాంస కర్మను విధించునే కాని ఫలమును విధింపదు. ఇది దాని ప్రయోగశీలత (Experimentalism). వ్యష్టిశ్రేయమునకు కామ్యకర్మ లెన్నియో ఉన్నవి. సంపదకోరువాడు ' వాయవ్య' మను యాగముచేయవలెను. పశువులను దాసదాసీలను కోరువాడు ఉద్భిత్తను యాగముచేయవలెను. ఇంద్రియసుఖము కోరువాడు పెరుగుతో

Tel. 1808



సాన్నాయ్య యాగముచేయవలెను. స్వర్గకాముడు అగ్నిహోత్ర దర్శ పూర్ణమాస, సోమయాగాదులు చేయవలెను. సమష్టికి వాన కురియవలెనన్నచో ' కారీరి ' చేయవలెను. సత్రయాగము సమష్టి యాగమే కాని కలిలోనిషిద్ధము. ఇట్లు వైదికధర్మమున ప్రయోగశీలమైన శ్రేయోదృష్టియే ఉన్నది. ఈ వైదిక ధర్మరూపమైన కర్మకాండకు జైమినీయ మీమాంస పట్టుకొమ్మ. దీనిలో 907 అధికరణములు, అన్నియే న్యాయములు ఉన్నవి.

6. వ్యాస భారతము : రాజరాజు పనుపున నన్నయ ఆంధ్రీకరింప పూనుకొన్నది వ్యాస భారతము. దీనికి పంచమవేద ప్రసిద్ధి ఉన్నది. భారతము కృతి. కృతి విశ్వజనీనముగనుండవలెనని aestheticians చెప్పుదురు. వ్యాస భారతము విశ్వజనీనమైన కృతి. (ఆది. 1 అ- 31 ప). ' ఋచో యజూంషిసామాని వేదాధ్యాత్మం తథైవచ। న్యాయ శిక్షాచికిత్సాచ దానం పాశుపతం తథా ' (అనుక్ర. ప. 1 అ _ 71 శ్లో) అనుచు తన కృతిలో ఋగ్యజుస్సామ వేదములు, వేదాంతశాస్త్రము, న్యాయము, శిక్ష, చికిత్స, దానము, పాశుపతము ఉన్నవని అనులోమక్రమమున వ్యాసుడే చెప్పినాడు. ఇచట న్యాయమనగా (పూర్వ) మీమాంస. సూతుడు సత్రయాగము చేయుచుండిన శౌనకాది మునులతో ' సూక్ష్మార్థ న్యాయయుక్తస్య వేదార్థై ర్భూషితస్యచ, అని భారతమును గూర్చి పూర్వోత్తర మీమాంసలకు ప్రాధాన్య వివక్షచేసి చెప్పినాడు. సూక్ష్మార్థ న్యాయములనగా సూక్ష్మములైన పూర్వ మీమాంసా న్యాయములు. వ్యాస భారతమిట్టిది కనుకనే వైదికమత ప్రచారమునకు దాని నెన్నుకొనుట జరిగినది. అది శాస్త్ర కావ్యము. దీనిలో అర్థము బద్ధమై నిరూపితమై ఉన్నదనియు దానిని తెనుగున ధీయుక్తితో రచింపుమనియు రాజరాజు నన్నయను కోరినాడు. అర్థమనగా మీమాంస. ఈ భారతము ' అనేకవిధ పదార్థ ప్రపంచ సంచితంబు ' (ఆది. 1-66) అనియు ' అర్థాంశు ప్రకాశంబుతో మానై 'న దనియు (ఆది. 38-21) నన్నయ గూడ వ్రాసినాడు,

మీమాంస ఇందు బద్ధమై ఉన్నదనగా అభిసంధి విధానముగా ఉన్నదని అర్థము. నిరూపితమనగా కథలో ఉపాఖ్యానములలో చిత్రింపబడినదని అర్థము. (illustrated.)

7. రాజరాజు : ఇట్టి పూర్వోత్తర మీమాంసా శాస్త్రకావ్యమైన శ్రీ మహాభారతమును ఆంధ్రీకరింపుమని నన్నయను కోరిన రాజరాజెట్టివాడు ? పరమధర్మవిదుడు (ఆది. 1-9) నిత్యనిరంతర ధర్మమతి (ఆది. 1-163) నిత్యధర్మప్రారంభుడు (ఆది. 2-239) ధర్మనిరతుడు (ఆది. 3-1) విమలధీ రమణీయుడు (ఆది. 4-273) ధర్మధురంధరుడు (ఆది. 4-274), నిత్యసత్యుడు (ఆది. 8-323), ధర్మ విశారదుండు (సభా. 2-1) ధర్మశీలుడు (సభా. 2-321) ధర్మమిత్రుడు (అర. 1-400), శ్రీ రమ్యధర్మనిత్యప్రారంభవిభాసి (అర. 2-1) సమీహిత గుణక్రియుడు (అర. 2-358). ధర్మవిచారోద్దాముడు (అర. 9-1). నిత్యసత్యవచనుడనని చెప్పికొన్న నన్నయ అనృతము వ్రాయడు. ఎంత అతిశయోక్తులనుకొన్నను రాజరాజు పూర్వ మీమాంస తెలిసినవాడుగ కనబడుచున్నాడు.

8. నేపథ్యము : రాజరాజు భారతమునేల ఆంధ్రీకరింప చేయవలసి వచ్చినది ? చారిత్రక నేపథ్యము మనకు తెలియును. మతపరముగ కొంచెము చెప్పవలెను. క్రీ. శ. 7 వ శతాబ్ది నుండి 10 వ శతాబ్దాంతము వరకు గొప్ప మతవాదముల కాలము. శంకరులు వైశేషికులను అర్ధవైనాశికులు (బౌద్ధులు) అనుటతో వైదికమతానుయాయులు ఆ శాస్త్ర గ్రంథములు వ్రాయపూనుకొన లేదు. బౌద్ధులు జైనులు గౌతమన్యాయ, వైశేషికముల నాదరించినారు. బౌద్ధుల నిర్వాణ భావనకు వైశేషికుల 'అసత్కార్యవాదము' అక్కఱకు వచ్చినది. వారి పదార్థ వివేచనము జైనుల 'పంచాస్తికాయముల'కు దారి చూపినది. జైనుల గ్రంథములలోను లలితవిస్తరములోను వైశేషికము పేర్కొనబడినది. ధర్మకీర్తి (7 శతాబ్ది), ధర్మోత్తరు (క్రీ.శ. (89 శతా) డు మున్నగు బౌద్ధాచార్యులు గౌతమన్యాయ గ్రంథములు



వ్రాసినారు. వైదికులలో ఈ వాదోపయోగి శాస్త్ర గ్రంథములు రాకపోగా జైనబౌద్ధులతో వాదించు భారము మీమాంసకులపై పడినది. క్రీ. శ. 1000 ప్రాంతమున జైమిని 'సంకర్ష కాండకు' దేవస్వామి వ్యాఖ్యానము వ్రాసినాడు. 8 వ శతాబ్ది నుండి జైనమునకు ఆంధ్ర దేశమున వైదికమతముతో సమానముగ రాజాదరణ మున్నది. విమలాదిత్యుని (క్రీ. శ. 1011-1022) వరకు అది సాగినది. వైదికమతము పైకొనుచున్నది. రాజరాజు వైదికమతము నభిమానించినాడు; ప్రచారము చేయదలచినాడు. ఆనాటికి యజ్ఞయాగాగాదులయెడ వైముఖ్యము మెండుగానున్నది. 11 వ శతాబ్దినాటి చాళుక్యసోమేశ్వరుని 'అభిలషితార్థచింతామణి' 'నాస్తియజ్ఞసమో రిపుః' యజ్ఞమువంటి శత్రువు మఱియొకటి లేదన్నది. ఇట్టి పరిస్థితులలో వైదికమతమును ప్రచారము చేయుట అనగా వేదప్రామాణ్యమును, చాతుర్వర్ణ్య వ్యవస్థను, యజ్ఞయాగాదులను, దేవ బ్రాహ్మణ గోపూజనమును ప్రచారచేయుట. దీనికి తగిన గ్రంథము శ్రీ మహాభారతము. అది సత్రయాగ సందర్భమున సూతుడు మునులకు చెప్పినది. కథలోని ధర్మజుడు రాజసూయ అశ్వమేధములు చేసినవాడు. ఉపాఖ్యానములలో అడుగడుగున పూర్వరాజుల యాగప్రశంస ఉన్నది. అన్నిటికి మించి యాగములకు వలసిన శాస్త్రమే అందున్నది. ఇంకేమి కావలెను ? కనుక భారతమును ఎన్నుకొనుట జరిగినది.

9. నన్నయ భారతాంధ్రీకరణము : నన్నయ వ్యాసభారతమును స్వతంత్రానువాదపద్ధతిగ వ్రాసెనని మనము స్థూలముగ చెప్పికొను మాట. వ్యాసభారతము శాస్త్రకావ్యమని నన్నయకు దెలియుననుటకు రాజనరేంద్రునిచే పలికించిన మాటలె నిదర్శనము. కాగా నన్నయ్య కూడ ఆంధ్ర మహాభారతమును శాస్త్రకావ్యముగానే తీర్చినాడు. ఎట్లు ? భారత కథయే శ్రీ విద్యకు, త్రయీవిద్యకు అన్వయించునట్టిది. భారతమనగా భరతవంశమువారి చరిత్ర అను వ్యుత్పత్తి మాత్రమే కాదు. భాసిరతమ్ భారతమ్ అని కూడ వ్యుత్పత్తి. కాంతియందాసక్తమైనది అని అర్థము. 'అగ్నిమిచ్ఛధ్వం భారతాః' అను

అరుణోపనిషద్వాక్యమునకు భారతాః = శ్రీ విద్యోపాసకాః అని వ్యాఖ్యాన మున్నది. నన్నయగారు కూడ 'భారత భారతీ సముద్రము దరియంగ నీదను' (ఆది. 1-19) అన్నచోట భారత శబ్దమును సాభిప్రాయముగా వాడినాడనవలెను. భారతగ్రంథ భారతి అని మాత్రమే కాదు. అంతే కాదు ద్రౌపది జన్మవృత్తాంతమును చెప్పుచు వ్యాసుడు 'తత్రైవ వేద్యాం కృష్ణాపి జజ్ఞే తేజస్వినీ శుభా' (అంశావతరణ 68 అ-114) అని శ్రీ శబ్దము వాడకుండ చెప్పగా నన్నయ 'శ్రీ మూర్తియై యాజ్ఞసేని పుట్టె' (ఆది 8 ఆ-84 ప) అని కంఠోక్తిగా వ్రాసినాడు. భారతమును 'సాత్యవతేయ ధీవనధి జన్మశ్రీ మహాభారతాఖ్యానాఖ్యామృతసూతి' (ఆది 3 ఆ-21) అనుచు వ్యాసుని ధీవనధిలో పుట్టిం శ్రీ మూర్తిగా చెప్పినాడు. భారత శబ్దమిట్లే త్రయీవిద్యకు వర్తినిచును. త్రయీవిద్య అనబడు వైదికమతమున యజ్ఞయాగాదులలో అగ్నియే ప్రకాశించును కద. నన్నయ తరువాతికాలమున అల్లసాన పెద్దన 'పూతమెఱుంగులున్' అను తన సింహావలోకనోత్పలమాలికలో స్పష్టముగా 'భారత భారత సమ్మతప్రభా' అని భారత శబ్దమును రెండుసార్లు వాడినాడు. మొదటిది విశేషణము. రెండవది విశేష్యము. పెద్దన శ్రీ విద్యోపాసకుడు. 'భాసిరతమై'న భారతమునకు సమ్మతమైన ప్రభ నతడు చెప్పుచున్నాడు. ఇట్టి భారత కథలో మీమాంసాపరమైన కొన్ని గుఱుతులు చెప్పెదను. వేదమునకు ప్రమేయమైన అర్థము ముత్త్రివిధమని మీమాంస చెప్పును. 1) క్రత్వర్థము 2) పురుషార్థము 3) ఉభయార్థము. క్రత్వర్థమనగా దాని కదియే ఫలము కాని వేరొకటి ఉండదు. ఆదిపర్వములోని శ్వేతకి అను రాజర్షి వృత్తాంతము దీనిని చిత్రించును. పురుషార్థమునకు ఫలము, దాని సాధనము ఉండును. మందపాలమహర్షి కథ దీనికి చిత్రణము. ఉభయార్థమున క్రత్వర్థ పురుషార్థములు రెండును ఉండును. ఖాండవవనదహనమున కృష్ణార్జునులు అగ్నికి సహాయపడుట ఇట్టిది. మయసభావృత్తాంతము మీమాంసకులు చెప్పెడు 'అపూర్వ'మును తెలుపును. దుష్యంతోపాఖ్యానమున శకుంతలా దుష్యంతుల సంవాదము మీమాంసలోని



అంగత్వవిధాన ప్రమాణములైన శ్రుతి, లింగ, వాక్య, ప్రకరణ, స్థాన సమాఖ్యలను వాని సంఘర్షణము. ఆకాశవాణి మాటలు దుష్యంతుడు శిరసావహించుట శ్రుతి ప్రమాణము నంగీకరించుట. మీమాంసారూపమైన ఇట్టి కథను నన్నయ కూడ శాస్త్ర కావ్యముగా తీర్చినాడు. మంగళాచరణముచేయుట మాత్రము పౌరాణిక పద్ధతి. వెంటనే రాజరాజు ప్రశంస. రాజరాజును గూర్చిన 'రాజకులైక భూషణుడు' 'ఘనదురితానుబంధ' అను వృత్తములు గృహపతికి దీక్ష యిచ్చునప్పటి 'ప్రయోజముల'ను మనసులో బెట్టుకొని వ్రాసినవి. రాజనరేంద్రుని ఈ ప్రశంసలో ఆఱు ఋతువులు వచ్చుటను గమనింపుడు.

శాస్త్రమునకుగాని శాస్త్రకావ్యమునకుగాని (1) ఉపక్రమోపసంహారములు (2) అభ్యాసము (3) అపూర్వత (4) ఉపపత్తి (5) ఫలము (6) అర్థవాదము అని ఆఱు తాత్పర్యలింగములుండును. ఇవి కుమారిలభట్టు మీమాంసాశ్లోకవార్తికములో చెప్పబడినవి. గ్రంథము వానిని విచారింపవలె. నన్నయ రాజరాజు నోట 'బహుభాషల బహువిధముల' అను (ఆది. 1 ఆ - 18 ప) పద్యమున భారతమును గూర్చిన ప్రశంసార్థవాదము చేయించినాడు. 'ఏ యది హృద్యమపూర్వంబేయది' (ఆది. 1 ఆ - 29 వ) అను పద్యమున ఉపక్రమోప సంహారములను వదలి మిగిలిన తాత్పర్యలింగ విచారణ చేసినాడు. 'ఎద్దాని వినిన నెఱుక సమగ్రంబగు' నన్నది అభ్యాసలింగము. 'అపూర్వంబే యది' అన్నది అపూర్వలింగమె. 'హృద్యము' అన్నది ఉపపత్తిలింగము. 'అఘనిబర్హణము' ఫలలింగము. ఇట్లు కావ్యోపక్రమము శాస్త్రపద్ధతిగా ఉన్నది.

'హరిహరాజగజాననార్క' (ఆది. 1 ఆ - 21) అను పద్యము మొదలుకొని 'సారమతింగవీంద్రులు' (1 ఆ - 25) అను పద్యమువరకు గల 5 పద్యములను నన్నయకులకబంధముగా వ్రాసినాడు. ఇది మరల యాగమునకంగములైన ప్రయాజముల వంటివి. ప్రయాజములు, ఆజ్యభాగలు, అనూయాజములు అనునవి యాగమునకు లింగ

ములు. ఆత్మగతమైన అదృష్టమును పుట్టించునవి. ద్రవ్యగత, దేవతాగత సంస్కారమును పుట్టించునవి కావు. వీనిని ఆరాదుపకారకము లందురు. ఈ ప్రయాజములు కనీసము అయిదుగానుండును. కనుక నన్నయ ఆయిదు పద్యములు వ్రాసినాడు. మీమాంసలోని 'అపూర్వవిధి'ని మనసులో బెట్టుకొని విద్వత్సభలను స్తుతించినాడు. 'నియమవిధి'ని మనసులో బెట్టుకొని నారాయణభట్టు సాహాయ్యమును చెప్పినాడు. 'పరి సంఖ్యావిధి'ని మనసులో నుంచుకొని 'సారమతిం గవీంద్రుల'ను ప్రసిద్ధ పద్యమును వ్రాసినాడు. ప్రయాజములలో 'స్వాహాకారం యజతి' అను విధి వాక్యమున ఏర్పడిన ఐదవ ప్రయాజమునకు ఉత్తమప్రయాజమని పేరు. 'సారమతి' పద్యమిచట ఉత్తమ ప్రయాజ స్థానమున నున్నది. నన్నయరచనమీాద సాహిత్య విమర్శ కంతటికి ఈ పద్యము కీలక స్థానమైనది. కాని ఈ పద్యము పూర్తిగా మీమాంసా గంధిలము. మొదటి విశేషము ఈ పద్యమున అంగత్వ విధాన ప్రమాణములైన ఆఱింటి క్రమమున ఈ పద్యము కూర్చబడనది. 'సారమతిఀ' అను కరణార్థకతృతీయతోడి దళము శ్రుతి స్థానీయము. 'కవీంద్రు'లనునది లింగస్థానీయము. 'ప్రసన్న కథాకలితార్థయుక్తిలో నారసి' అన్నది వాక్య స్థానీయము. 'మేలు నాన్' అన్నది ప్రకరణ స్థానీయము. 'ఇతరులక్షరరమ్యతనాదరింప' అన్నది స్థానస్థానీయము. 'నానారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు' అన్నది సమాఖ్యా స్థానీయము. ఈ పద్యమున కవీంద్రులనగా కవి శ్రేష్ఠులని మాత్రమే అర్థము కాదు. మీమాంసకు లనియు చెప్పవలెను. కావ్యాంశముతో శాస్త్రాంశమును జోడించినపుడు రెండురకముల అర్థములు చెప్పికొనవలసి ఉండును. అనగా రెండుక్రియ లేర్పడును. రెండుక్రియ లేర్పడినపుడు అక్కఱలేనిదానిని నివర్తింప జేయునది పరిసంఖ్యా విధి అనబడును. కావ్యార్థము అయినచో ప్రసన్నకథాకలితార్థ భంగి, అర్థరీతి అని వ్రాయవలెను. నన్నయ 'అర్థయుక్తి' అనుట శాస్త్రము కొఱకు. యుక్తి అనగా ఉపపత్తి. అర్థయుక్తి అనగా అర్థమునకు హేతునిరూపణము. అది ప్రసన్నకథ యందు



కలితమైనది. మీమాంసా విషయకమైన ఈ హేతునిరూపణమును లోతున జూచుటకు కవిశ్రేష్ఠులు చాలరు. మీమాంసకులే కావలెను. కాగా కవీంద్రులనగా 'ఇంద్రంకవ యంతిస ప్తతంతుభిరితి కవీంద్రాః' అని వ్యుత్పత్తి చెప్పి మీమాంసకులని అర్థము చెప్పవలెను. సారమతి అనగా మేధ. అది ఇంద్రదేవతాకము. ఇంద్రునకు మేధాతిథి అని కూడ పేరున్నది. పైగా వెనుకటి పద్యములోని వాఙ్మయధురంధరుడు అన్నదియు ఈ కవీంద్రులన్నదియు సమబలములు కావు. మీమాంసకులైన నన్నయనారాయణభట్టుల రచన లోతుచూచుటకు మీమాంసకులే సమర్థులగుదురుకాని కవిశ్రేష్ఠులు కారు. 'అర్థయుక్తి' 'లోనారసి' అను వానిని బట్టి కవీంద్రులనగా మీమాంసకులని అర్థము. కవి శ్రేష్ఠులనుట నివర్తింపబడినది. 'మేధాశక్తిచే మీమాంసకులు ప్రసన్నమైన కథలలో కూర్చబడిన మీమాంసాశాస్త్రార్థోపపత్తిని లోతున జూచి శ్రేయస్కరమనునట్లుగాను మీమాంసకేతరులైన వారు అక్షరరమ్యత నాదరించునట్లుగాను మీమాంసా న్యాయములకు నిధియైన నన్నయభట్టు జగద్ధితముగ భారతసంహితా రచన బంధురుడయ్యెను' అని ఈ పద్యాభిప్రాయము. వ్యాసభారతమున సూతుడు సూక్ష్మార్థన్యాయములన్న వానినే నన్నయ నానా రుచిరార్థ సూక్తులుగా చెప్పినాడు. అధ్వర్యుమంత్రములకు 'అధ్వర్యవము' అని సమాఖ్య ఉన్నది. అవి కలవాడు అధ్వర్యుడు. నన్నయభట్టు నానారుచిరార్థసూక్తినిధిత్వముతో తన్ను అధ్వర్యు స్థానమున నిలుపుకొన్నాడు. ఇట్లు నన్నయగారి కావ్యము శాస్త్ర కావ్యము. రచన మీమాంసానుసారి యైన రచన. నన్నయ మీమాంసాపండితుడై దానిని మననముచేయుటచేత 'మనసా' వైదిక ధర్మనిష్ఠుడు. యజ్ఞముచేసి అవిరళజపహోమతత్పరుడగుటవలన 'కర్మణా' వైదిక ధర్మనిష్ఠుడు. భారతగ్రంథమును వైదిక ధర్మ మీమాంసారూపమైన శాస్త్రగ్రంథముగా తీర్చుటవలన 'వాచా' వైదిక ధర్మనిష్ఠుడు. ఇట్లు నన్నయ వైదిక ధర్మనిష్ఠ త్రికరణ శుద్ధి గలది.

10. ముగింపు : నన్నయ భారతములోని పూర్వ మీమాంస ఎవరికి కావలెననవచ్చును. ఆ దృష్టితో చదువగోరువారు కొందరైన ఉండకపోరు. పూర్వ మీమాంస నుద్ధరించు ప్రయత్నముతో నీ ప్రసంగము చేయబడలేదు. నన్నయ పూర్వమీమాంసకుడని, ఆయన భారతము మీమాంసా శాస్త్ర గ్రంథమని, నిరూపితమైనపుడు ఆయన కవిత్వమునకు మీమాంసకుల వాక్యార్థ పద్ధతిగా అన్వయార్థములు చెప్పికొన్నపుడే ఆ కవి హృదయము మనకెఱుక పడు ననుట ఉద్దేశము. నన్నయ భారతమునకు నేడు మనము చెప్పికొను దేశవాళి పద్ధతి చాలదు. మీమాంసలో రెండు ప్రస్థానములున్నవి. భాట్టము. ప్రాభాకరము. భాట్టులు అభిహితాన్వయ వాదులు. ప్రాభాకరులు అన్వితాభిధానవాదులు. నన్నయ ఏ ప్రస్థానమునకు చెందిన వాడో నిర్ణయించుకొని అటుపిమ్మట ఆయన కావ్యమును వ్యాఖ్యానింపవలె. నాకు చూడగా నన్నయ అన్వితాభిధానవాదిగా తోచును. అది సరియైనచో నన్నయ పద్యములలోని కూర్పును యథాతథముగా నుంచి అనగా పదములను చోటుమార్చక అన్వయముచేయవలెను. అన్వయ విషయమున ఆ మీమాంసకుల సూత్రములను పాటింపవలెను. అట్టి వ్యాఖ్యానము నన్నయ భారతమునకు రావలసిఉన్నది. అపుడే నన్నయగారి కవితా ఉపూర్వము తెనుగు వారి అదృష్టమును పండింపగలదు.

---

# TRANSLATION - NANNAYYA BHATTA'S METHODOLOGY

BY

Maha Mahopadhyaya R. N. SAMPATH

*Professor of Sanskrit, Presidency College, Madras-5*

It was Anandavardhana of the 9th Century, who for the first time in the Literary horizon of India admitted and accepted that in Literary compositions there are bound to be similarities, correspondences or resemblances of ideas and yet they should not be damned as 'Plagiarism'. According to him in his magnum opus "Dhvanyaloka", he avers that there are 3 types of correspondences, viz., imagelike on a mirror, painted on a canvass and echo of the bodily features. The last one is acceptable to Anandavardhana and he has no hesitation to denounce the rest two. According to him the first two are lifeless whereas the third one is full of life with all possible qualities of head and heart. It is like the son and father similarity maintaining the individual difference in spite of resemblance. The Vedic dictum ' ' ఆత్మా వై పుత్రనామాసి atma vai Putranamasi" - might have weighed with him for this acceptance.

Just as there are limitations in the world of material substances for all entities similarly there is bound to be limitation in the world of words too. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" - yato vaco nivartante Aprapya manasa saha. Words fall flat not able to catch up the concept of Highest Entity along with the mind. Ananda Vardhana's enunciation was for the poems in Sanskrit language regarding the repetition of an idea or motif of an ancient poet by a later one.

What is permissible for a poem in one language may be equally applicable to its translation in other languages too. Perhaps Nannayya Bhatta was a pioneer and the first translator of a Sanskrit composition in a South Indian language even though in the 13th century Vedanta Desika gave a free rendering of a Tamil work "Thiruvoimozhi" in Sanskrit,

Milton contended that Translators are traitors. His justification was that the translators do not really picturise the original author's intentions fully in their translations. One main norm that a translator has before him is to be literally faithful to the original. The one main difficulty in this is that every language has its own mannerism, ideology and usage which may be against the original work's medium. In this circumstance the translator by being faithful to the original medium presents only a psuedo rendering but not one that is germane to the translated medium. This becomes all the more complicated and confused when a Sanskrit work is taken for translation. Unless and until the translated medium also has the nuances and subtilities of the medium of the translated work, the full import and aim of the work translated cannot be obtained.

The other method is a free-hand rendering of the translated work into a new language. Here there is scope for the translator's ingenuity to play with. Hard places not amenable for easy rendering may be presented or left out at the convenience and command of the translator and by reading such a work one will be introduced to the work not otherwise amenable for understanding because of an unknown medium.

Besides these two methods there is one another process which comes to be known "Transcreation". In this process it is not merely the representation of an idea of one medium into a different one without any distortion but at the same time the translator has a free hand to say that in his own way. This has been the main contribution of Nannayya to the literary expansion. He has blazed a new trail in this line which has been followed by later literateurs. This method does not give freedom to distort the original but the translators have the liberty to contract or expand any narrative or imagery to suit the need. In fact to quicken the movement of the narrative this may become necessary too. But at the same time they cannot represent any incident or act in such a way that



may change or distract the essential qualities of the character of the original work. To illustrate this distraction the following example may suffice. In the Tamil Classic "Silappadikaram" the author Ilango represents Kannagi the heroine as an embodiment of chastity which she vindicates by burning the Madura City by hurling away the left breast in the air. Here the author's point of view is to present that even natural forces obey the commands of a chaste woman. But the story and script based on Silappadigaram for a film has presented this scene not on supernatural basis but based on rationalistic doctrines. It is presented as if she takes a live and burning torch and sets fire to the buildings little realising that his ingenuity has failed miserably. It is not only that he has felled the characters from the high pedestal but also failed the poetic justice. Contrarily Valmiki was a retionalist. In such a situation he introduced a monkey. His tail got bounded with rags soaked in oil and when lit, the monkey did not walk on the streets but hopes over the roof-tops enabling the fire to get set on all houses.

Reverting to the work of Nannayya Bhatta "Andhra Mahabharatam", it is to be noted that he has not left us the full work of Vyasa in 18 parvas in Telugu but we have to-day only the first two parvas viz. Adi and Sabha and a portion of Vana Parva. What led to the incompletion is not this paper's problem? The presentation is comprehensive and in tact regarding the narration as found in the original. This work being the first literary classic in Telugu, the author has exemplified himself as a master craftsman. The language has a charm and diction that can easily surpass any in that category. In fact he has delineated as style and language that has become the model for all later writers in Telugu. The blending of Sanskrit and Telugu to a harmonious admixture that confers a sweetening effect to a discerning heard is a gift of the pioneer Translator.

But what distinguishes the translation from the original work is the pattern handled by the translator. It is a known

fact that the translator Nannayya Bhatta was the Raja Purohita of the Chalukyan King Raja Raja 944–1022. It was the King's order to resume and restore the Vedic religion that was prevalent then. Being a staunch Mimamsaka steeped in the performance of rituals and rites as per the dictates of Veda, necessarily pin* pointed the need for the Dharma and practising of it earnestly. Hence when the opportunity came into his hands, he naturally seized it and gave full vent to his pet dictum. Dharma is a spiritual concept as per the Mimamsa system and performance of the Vedic injunctions are paramount and none need be in servitude to any Devata. Contrarily in the extant Mahabharata in Sanskrit and particularly in the Sabha Parva an intriguing situation arises. When Dharma performs Raja-suya-Yaga Bhisma advises Dharma to give the first honour (Agra Puja) to Sri Krishna and when questioned by Sisupala in nearly 19 Adhyayas he narrates the previous avataras of Krishna from that of Varaha and establishes He is not thereby a mortal as appears to be. But God and Bhakti being anathema for a Mimamsaka, Nannayya offers two reasons for the choice. First he avers that being an oldest member of the assembly and also as well enshrined in wisdom both worldly and spiritual, he has high esteem and regard for Sri Krishna in spite of his age and hence Dharma being a junior member of my family should adhere to the advice and secondly Krishna belongs to a princely class.* But these two reasons are not acceptable for logical scrutiny against the convincing reasons adduced in the original.

1808

Besides in the disrobing of Draupadi in the same Parva by Dussasana in the Durbar Hall while all members were present, the continuous flow of sarees as if from nowhere is represented but not the prayer of Draupadi to Sri Krishna to come to her in that distress, is conspicuous by its absence. Nevertheless a full-length discussion over the point raised by Draupadi of het conquest is discussed in detail as if heavens will fall if such a discussion was not held. The fear of Dharma-sampata, if nor

* P. 337. A.M.B.



answered correctly and convincingly, grips the elders, to hold the discussion. This problem is represented in the original too but in not in the same fervour.

The Sabha parvam in Vyasa Bharata has main themes like—Building of a palace by Maya and its description by comparison of other celestial Sabhas by Narada; Rajasuya Yaga and its precedent and anticident actions; game of dice and humiliation of Pandavas not excluding Draupadi. These three main and major incidents have a larger chunk of expansive material culmination and finalisation. The first viz., Maya Sabha-though descriptive in nature and content yet is spread over 12 Adhyayas. The Translator does represent the contenst of this sector in just 81 units of composition containing vacanas, seesapadyams etc. The Brahma Sabha description is extending over 62 verses in the original and concludes with the verse "Sabhayam Manusha loke Sarva Sreshta tama tave." But the Translator condenses the whole content in just 15 lines in vacana style. The matter is so condensed that the reader or hearer not only comprehends but has scope for his visualization and imagination. Besides the contemporary ideas that were in vogue but not that of original has also been introduced. Vyasa while describing the Durbar Hall of Brahma enumerates all who were present. The panca tattvas, pance Bhutas, Yuga (as per Vedic astronomy only 5 years) etc. But Nannayya makes the entire gamut of Time from Kshana to Yuga.** By his time the Chaldean system of 60 years cycle, 60 nadikas and 60 vinadikas have come to rule.

Hence it is evident that Nannayya by presenting the Mahabharata in Telugu had in his mind not to offer a mere translation but represent that as a Dharma Sastra pin-pointing the subtle Dharmas that get spread in the whole of Mahabharata. Incidentally he has paved the way for the originality and his perspective of life being enshrined in that. This is nothing but a Transcreation Process and the modern translators like P. Lall

** P. 305 A.M.B. line 13ff. In the Viṣṇu Purana the order of Parts of Time is different.

and others might get much benefit by reading the principles which have been handled by Nannayya. It is unique character of Telugu Bharatam that compelled Dr. Sukthankar and others to take this work as a basis for the preparation of critical edition of Mahabharata by Bhandarkar Oriental Research Institute, Poona.

BOOKS CONSULTED

1. Srimadandhra Maha Bharatam - Part I (A.M.B)
   Ed. by Utpala Venkata Rangacharya
   Tagore Publishing House, Hyderabad-27,
   1977 Year Edition.
2. Mahabharatam - Part I
   Ed. by T. R. Krishnacharya & T. R. Vyasacharya
   Nirnaya Sagar Press - Bombay,
   1906 Edition.

---

Office of the Curator
Govt. Oriental Man[uscripts] Library
14 FEB 19..
Madras-600 005



# ప్రాఙ్నన్నయ యుగపు తెలుగు భాష

కోరాడ మహాదేవ శాస్త్రి

తెలుగుభాష క్రీస్తు పూర్వము 6 శతాబ్దానికి ప్రత్యేక భాషగా ఏర్పడిందని భాషావేత్తల అభిప్రాయం. అంటే తరువాత ఆరు శతాబ్దాలకు తెలుగుభాషకు ఆధారాలు శాసనాల్లో లభించడం, 16 శతాబ్దాలకు నన్నయ ఆంధ్రమహాభారతం వెలువడడం జరిగిందన్న మాట.

క్రీస్తుశకం మొదటి ఆరు శతాబ్దాల్లో ప్రాకృత సంస్కృత శాసనాల్లో తెలుగుపదాలు మాత్రమే - గ్రామ వ్యక్తి నామాదులు కనబడతాయి. వాక్యగతమైన తెలుగుభాష 6 శతాబ్దం చివరిపాదంలో రేనాటిచోళుల శాసనాల్లో లభిస్తుంది.

తెలుగుదేశంలో ప్రాకృతం కొంతకాలం, తరువాత సంస్కృతం రాజభాషగా ఉండేది. ప్రజలు తెలుగుభాషను వ్యవహరిస్తూండేవారు. 6 శతా. నాటి విష్ణుకుండిన రాజు 2-వ విక్రమేంద్రవర్మ వేయించిన చిక్కుళ్ల శాసనం సంస్కృతభాషలో ఉంది. ఆ శాసనం చెక్కినవాడు తెలుగువాడు. శాసనంలో 'విజయరాజ్య సంవత్సరంబుల్' అని తెలుగు బహువచనరూపం వాడాడు, సంవత్సరాః అనడానికి బదులు.

అటు దక్షిణంలో చోళులు, పశ్చిమంలో చాళుక్యులు దేశభాషలు ఆదరించినవారు. రేనాటి చోళులకు ద్రావిడ దేశంలోని చోళులతో సంబంధం ఎలాంటిదో నిశ్చయంగా తెలియదు కాని వారి ప్రభావం వీరిపై ఉండక పోదు. 6-11 శతాబ్దాల్లో తెలుగుభాషను పరిశీలిస్తే అది పొందిన పరిణామం చాలా స్పష్టంగా తెలియవస్తుంది,

వెనక్కి వెళ్ళిన కొద్దీ భాష ప్రాచీనతా లక్షణం కనబరచడం సహజం కదా. 6-8 శతాబ్దాల్లో రూపాలు ఇతర ద్రావిడభాషా రూపాలకు ఎక్కువ సన్నిహితంగా ఉంటాయి.

7 వ శతాబ్దం నాటి పొట్లదుర్తి శాసనంలో భాష ఇలా వుంది. స్వస్తి శ్రీ పోటి మహారాజు ళ్లేళన్ ఇన్పుఱోలి అణపోతులు రేవణకాలు పుద్దణకాలు ఇచ్చిన పన్నప పెన్వాఱ ఇళతేనిక్కి, తేని ఱచ్చిన వాన్రు పఞ్చమహాపాతకు న్రకున్. ఈ యుగంలో నిలిచియున్న ప్రాచీనరూపాలకు ఉదాహరణాలు :

నాల్కు : ఇరవదియాదినాల్కు మఱున్తుల్లు వేల. కన్నడం నాల్కు, తమి. నాన్కు > నాల్గు.

ము : సముచ్చయ ప్రత్యయం - ఎవ్వారైయుము. దేవి త్లోం ఱూఱు రట్టగుళ్ల అన్వయంబున వారెవ్వరయ్యుము రక్షింపనున్న పన్ను వ్వాళయుమ్. - మాదెర్ల శాస. > ఎవ్వారైనను.

ఆ : ఆణ్డు = సంవత్సరం, శ్రీ పోర్మ్లలరామపుణ్యకుమార ప్రథివీ వల్లభచోటి మహారాజులకు ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరం బుళ్ యేనగు నాణ్డు. రామేశ్వరం శాస. 7 శతా. > ఏ.

రేఫ సంయుక్తాలు : పెర్దళ్, చిర్వలి, తక్కఱ్ఱపుఱోలు, తిర్వలూరు. చిర్వలియ పటుకాను రేనాణ్డేళుచు తక్కఱ్ఱ పుఱోల పారదాయ కిఱ్తేపురు కత్తిశమ్మఱ్ఱకు తిర్వలూర పనాస. అనంతర కాలంలో వర్ణ సమీకరణం పొందాయి. పెద్దలు, చిప్పిలి, తక్కవోలు.

కొన్ని ధ్వని మార్పులు ప్రాఙ్నన్నయ యుగంలో ప్రారంభమై 10 శతాబ్దానికి పూర్తి అయాయి. ణ కారం న కారంగా మారింది. ఎణ్, కాణ్, కొణు, ఎణ్ ధాతువుల్లో ణకారం ప్రాచీనం, ఎణుంబాది, కొణిరి ; కొణు వారు, పణి, కాణ్బ రూపాలతో పాటు ణకారం న కారం అయిన రూపా లున్నాయి, ఎనుబది, కొను, పని,



ళ కారం ల కారంగా మారింది : దీనికి బహువచన ప్రత్యయళ కారం మంచి ఉదాహరణం. విజయరాజ్యసంవత్సరంబుళ్ అన్న పదబంధంలో ళకారం క్రమంగా తగ్గి లకారం వ్యాప్తి పెరిగింది. ప్రయోగాల సంఖ్య.

| | | |
|---|---|---|
| ళ : ల | 7 శతా. | 31 : 30 |
| | 8 | 40 : 17 (అహదనకర శాసనంలో 22 ప్రయోగాలు) |
| | 9 | 1 : 22 |
| | 10 | 4 : 8 |

ఆళు > ఆలు, మన్మఱాళు, ఏళు>ఏలు, కయ్యింబుళ్లోన > కయ్యంబులోన

విలోమలేఖనం ఈ మార్పులు పూర్తి అయినందుకు నిదర్శనం. కళరేని, కళవాన్రు, ళేమ

మూర్ధన్యనాదోష్మము 'ఱ' ప్రాఙ్నన్నయ భాషలో నిలిచి వుంది. అనంతరకాలంలో ఇది అజ్మధ్యస్థమైనపుడు డ కారంగా మారింది. చోఱ, తోఱ, నొఱంబి మొదలైనవి.

మహ దేకవచన ప్రత్యయం న్రు ణ్డు గా మారింది.

అమహ దేకవచన ప్రత్యయం మ్బు - ము/మ్ము కావ్యభాషలో నిలిచివుంది.

మొదటిసారి ణ్డు అద్దంకి శాసనం క్రీ. శ. 848 లోను, ముమ్మ చాళుక్య భీముని ధర్మవరం శాసనంలోను 892-922 వాడబడింది.

కొన్ని ధ్వని మార్పులు ప్రాఙ్నన్నయ యుగంలో ప్రారంభమై మధ్యయుగంలోనో మధ్యయుగాంతానికో పూర్తి అయాయి.

ర - ఱ లకు భేదం ప్రాఙ్నయ యుగంలోనే తొలిగిపోతున్న దనడానికి శాసన లేఖనాలు సాక్ష్యమిస్తున్నవి. ఒకే శబ్దం రెండు వర్ణాలతోను వ్రాయబడినవి ఉన్నవి, ఎఱుగు వారు, చిఱుంబూరు, తూర్పున, మఱుత్రు, మఱియును, చెఱువు. [కావ్యభాషలోను ముద్రిత ప్రతులలో మరి ఇత్యాది శబ్దాలు రెండు విధాలైన రేఫలతో వ్రాయడం కనబడుతుంది.] నన్నయలో ఇవి భిన్న వర్ణములే గాని కవిత్రయానంతరం వ్యావహారిక భాషా ప్రభావంచేత రేఫఱకారాలు కలిసి పోయాయి. ఉచ్చారణలో భేదం లేనప్పుడు అవి భిన్న వర్ణాలుగా ఎక్కువకాలం నిలబడడం కష్టం. నన్నయభాష ననుసరించి ఈ భేదం నిలబెట్టాలని ప్రయత్నించిన కవులు లాక్షణికులు ఎన్నో తబ్బిబ్బులకు లోనయారు.

పదమధ్య స్పర్శవర్ణాలు కొన్ని శబ్దాల్లో మహాప్రాణాలుగా మారడం కనిపిస్తుంది. శాసనాల్లో ఉదాహరణాలు : ఏభది, ఇరుభది, మంఘిమగరాజు, ఇష్ఠవిషయకామోపభోగంబులు, పెద్ధ కలుచువు బఱితి, యెంభనూట, తొంబ్భాద్యది యెణింబది - అముద్రిత శాసనంలో నిరూపం, ARE 241/1937-38. ఇంతూరిసీమ, పుచ్ఛగుంత మొ॥ మధ్యయుగపు శాసనాల్లో ఇలాటి రూపాలు చాలా తరుచుగా కనిపిస్తాయి. వంఛన, ఇఠీతల, పాధిక, అప్ఫము, భంఢి, ఠెల్లము. కావ్యభాషలో ఇలాంటివి లేవు. ఆధునికాంధ్రంలో రెండు విధాలుగా ఈ మహాప్రాణ వర్ణాలలో కూడిన రూపాలు స్థిరపడ్డాయి. (1) సంఖ్యావాచక సమస్తరూపాల్లో, ముప్ఫై, నలభై, ఏభై, డెభ్భై ఎనభై, తొంభై, ఏబది > ఏభది > ఏభ ఇ > ఏభై 2. అత్యంతార్థంలో మహాప్రాణత్వం, ఛాలా, ఘట్టిగా, పెద్ధ మొదలైనవి.



వర్ణలోపం పూర్వస్వరదీర్ఘానికి ప్రాఙ్నయ శాసనాల్లో ఉదాహరణాలు 8 శతా. ఏలే, 9 శతా. ఉపేక్షించినా, 10 శతా. ఎల్లా, ఈ ధ్వని పరిణామ రీతి క్రమంగా బలపడి కావ్యభాషలో కూడా, ప్రవేశించింది. నన్నయ, జీవితము - జీతము (2-1-38), తిక్కన, నమ్మి నమ్మక, శివకవులలోను అనంతరకవుల గ్రంథాల్లోను ఇట్టివి కోకొల్లలు, దీని ప్రభావం చేత పదాల్లో కలిగినని మార్పులు. చాలన్ > చాలా, కూడా, దాకా, చేసెడి > చేసే. కేతన వీటిని గ్రామ్యాలుగా పరిగణించాడు. ఆధునికాంధ్రంలో ఇవి ప్రచురంగా వాడబడుతున్నవి.

ఋకారానికి ప్రాఙ్నన్నయ యుగంలోను కవిత్రయయుగంలోను రికారోచ్చారణ వుంది. 12 శతాబ్దం నుండి రుకారోచ్చారణబయలుదేరి మధ్యయుగంలో బలపడి ఆధునిక యుగానికి స్థిరపడింది.

మొదటి నుంచీ భాషలో కనబడుతున్న మార్పులు కొన్ని శిష్టవ్యవహారంలోకి రాలేదు - ఇకారానికి పూర్వమందున్న వకారం యకారం కావడం, 7 శతా. గోయిందపోఱేఱి. 9 శతా. గోయింద శర్మ, సాతలూరు శాస.

వర్ణ వినిమయం - ఒకే రూపంలో ఒకప్పుడు ఒకవర్ణము, మరొకప్పుడు మరొకటి రావడం అనేది భాష అంతటా వుంది. కనుక - గనుక. ప్రాఙ్నన్నయ భాషలో ఇందఱు - ఇందొఱు, ఒకడు - ఒకొడు. ఒకొడు కేవలం వర్ణ వినిమయంచేత కలిగినది కాకపోవచ్చు. ఒకారంతో కూడిన ఒకొడు ప్రాచీన రూపము, ఒకటి అర్వాచీనరూపము కాదగును. చూడు The Numeral Noun 'one', Journal of the Dept. of comparative philology, Calcutta University. 'Gurupujanjali' Sukumar Sen commemoration volume.

సంధి: ప్రాఙ్నన్నయ వ్యావహారిక భాషలో సంధి ఐచ్ఛికము. పద్య శాసనాల్లోను కావ్యభాషలోను సంధి నియితంగా, కనబడుతుంది. ఉరుటూరు శాసనంలో విసంధి రూపాలు : ఎఱికల్ తుగరాజుల్లి ఇచ్చిన పన్నాస, రాచమానంబున ఏబది, తిరువుళపాఱకు ఇచ్చిన పన్నాస.

శాసనాల్లో క్వాచిత్కంగా వడాగమం కనబడుతుంది. కావ్యభాషలో యడాగమం అన్నిచోట్లా వస్తుంది. వ్యావహారిక భాషలో అచ్చుల స్వభావాన్ని బట్టి యడాగమవడాగమాలు రెండూ రావచ్చు. ఇది సంధిలో రెండవ అచ్చుని బట్టి వుంటుంది.

మా + య్ - ఇల్లు Cf. తమి. పుళి - య్ + ఇల్

మా + వ్ - వూరు. పులా + వ్ - ఇల్.

పదజాలం : ప్రాచీన శాసనాల్లో ప్రాకృతప్రభావం విశేషంగా కనబడుతుంది. పన్నస, అణపోతులు, బిదియ, బెజఇత్త భటరళు, అగ్గిజ్జ, నండిజ్జ, భద్దజ్జ, మొదలైన రూపాలు తరవాతి కాలంలో లోపించిపోయాయి. సంస్కృత ప్రభావంచేత తద్భవరూపాలు కొంతవరకు భాషలో వెనకబడుతున్నాయి. భక్తి అనే తత్సమమే కాని బత్తి అనే తద్భవరూపం నేడు వాడుకలో లేదు.

దేశ్య పదజాలం : ప్రాఙ్నన్నయభాషలో వున్న శబ్దాలు : పన్నస, మరుత్రు, ముట్ఱు మొదలైనవి. అర్థవి పరిణామంతో తరువాత కనబడేవి కుడుచు -పోఱి- వసంతిపోఱి-చోటిమహాదేవుళు. పోరి - పోరడు అనంతపుర మాండలికం. శబ్దపల్లవాలు భాషలో నూతనపదనిర్మాణ విధానాల్లో ఒకటి. గమనించదగ్గవి : వక్రపలుకు, వక్రంబువచ్చు, అన్నియంబు వొడుచు, విలోమము సేయు, అడ్డాడు, విఫలము తలంచు, రండు తలంచు, విరోధయు సేయు, బృందంబుగొను,



ఆస్తప్రాప్తంబగు, పట్టంకట్టు, పట్టంబెత్తు, గుడ్లువెత్తించు. నన్నయ : పెండ్లి యగు, ఆధునికయుగం పెడ్లి చేసికొను.

నిష్పాదక ప్రత్యయాలు : అలి, కొట్టలి (కాచు - కావలి వీచు - వీవలి) వు : ఊష్వు నేల (ఊడువు నేల) ;

సంఖ్యావాచక సమస్త పదాల్లో ఆది శబ్దప్రయోగం : ఇరుబాది రెండు, ఇరువది ఆదిగాగల రెండు అని అర్థం. నళ్ళాద్వాది యెుకొటి, ఇరుపదియాది నాల్కు, ఇరుపదియది ఏను, ఇరుబాది మూణ్డు. తరువాతి కాలల్లో ఇలాంటి రూపాలు లేవు.

అగు - పూరణార్థక సంఖ్యావాచక ప్రత్యయం. ఇరుభది ఏణ్డు అగు నేటి. వన్నయలో అగు, > అవు, > అవ.

గౌరవ బహువచన రూపాల్లో 'కాలు' సంస్కృత పాదశబ్దానికి తెలుగునేళ, రేవణకాలు, పుద్దణకాలు. గౌరవ బహువనన ప్రత్యయం ఆరు. (పోల్చి చూడు తమి. ఆర్, పెరియ - పెరియార్) ఆరు. అనంతర కాలంలో ఈ రూపం లేదు. రేవశర్మారు, పాలశర్మారికిన్.

ప్రాఙ్నన్నయ యుగంలో వర్తమానార్థక రూపాలు కనబడవు. తద్ధర్మార్థాకమే వర్తమాన భవిష్యత్కాలాలను బోధిస్తుంది. ప్రాచీన ద్రావిడభాషలో ఒక్కటే రూపం మూడు కాలాల్లోను వాడబడుతూ వుండేదని భాషావేత్తల అభిప్రాయం. ప్రత్యేకమైన భూతకాలిక రూపం ఏర్పడిన తరువాత ఇది వర్తమాన భవిష్యత్తులకు పరిమిత మయింది. కలజ్యనుబంధంతో భవిష్యద్రూపం ఇంకా అర్వాచీనం. తద్ధర్మార్థకం భూతకాలంలో వాడిన ప్రయోగాలు భారతంలో వున్నాయి. ద్యూత క్రీడకు కొండొక నేతున్ (= నేర్చి యున్నాను), విజితేంద్రుండని నిమ్మనిం బాయక విందు (= వింటిని)

వాక్య నిర్మాణం: వాక్యం చాలా వరకు సంపూర్ణక్రియా విరహితమై, విధేయ విశేషణంతో కూడి వుంటుంది. వక్రంబువచ్చు వాన్డు పంచమహాపాతకున్డు.

గద్యశాసనాలు, వ్యావహారికంలో వున్నాయి. పద్యశాసనాలు, కొన్ని గద్యశాసనాలు కావ్య శైలిలో వుండడం చేత 7 శతాబ్దానికే తెలుగులో సాహిత్య కృషి జరుగుతూండేదని, కావ్యశైలి అన్నది ఒకటి ఏర్పడిందని స్పష్టంగా తెలుస్తూంది.

కావ్యశైలికి ప్రధానలక్షణాలు: తత్సమపద బాహుళ్యం, సంధి నియతంగా పాటించడం, అన్వయ సౌష్ఠవం. తురిమెళ్ల శాసనభాష చూడండి:

ఓం స్వస్తి శ్రీమత్ సత్యాశ్రయశ్రీ ప్రిథివీ వల్లభ మహారాజాధిరాజ విక్రమాదిత్య పరమేశ్వభలాకున్ శ్రీమదున్నత ప్రవర్ధమాన విజయ రాజ్య సంవత్సరంబుళ్ ఆచంద్ర తార పురస్సరం ద్వితీయ వర్షం ప్రవర్తమానంకాను గొగ్గి భటరళ దక్షిణ భుజాయమానుం అయిన ఆలకుమర ప్రియతనయుం అయిన ఉజే నీ పిశాచనామధేయుంబు తుఱుతటాక నామాభిధాన నగరాధిష్ఠానుం అయి ఏఱువ విషయం బేళన్ తస్యమాతా దత్తం గోవృషాణభట్టారహో శతపంచాశత్ క్షేత్రం.

చివర పంక్తులలో మణి ప్రవాళ శైలి. సంస్కృత విభక్త్యంత శబ్దాలతో కూడిన తెలుగు. ఇట్టి శైలి తెలుగులో వుండేది. శాసనాల్లో అడ్కడక్కడ కనిపిస్తుంది. ఉదా॥ 8 శతా, రాచమానంబున ఏభది మఱున్తుఱ్లు నేల అలఘుదిన్త ఉత్తరబు కట్టు కౌండిల్య గోత్రస్య పెబ్బాబఅ రేవశర్మణ పుత్ర స్య అగ్గి శర్మరి కిచ్చిన దత్తి, మరొక శాసనంలో: స్వస్తి సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజుల ప్రవర్ధమాన విజయరాజ్యసంవత్సరంబుళ్ పది ఏటిగు నేంట విక్రమాదిత్యతనయ



శ్రీ విష్ణువర్ధన ప్రసాదా చ్ఛట్టపాథ్యేవ ఇంద్రకీలే ప్రతిష్ఠితః - పార్థీశ్వరః, ఈ శైలి మధ్యయుగంలో అంతరించిపోయింది. పాల్కురికి సోమన శతకంలో ఒక చోట మణిప్రవాళం వాడబడింది.

తెలుగు శాసనాల్లో వ్యావహారిక రీతికి మరొక ఉదాహరణం: కావ్యశైలిలో ఏక వాక్యంలో ఇమిడే భావాన్ని చిన్న చిన్న వాక్యాల్లో పునరుక్తితో చెప్పడం.

ఎఱికల్ ముత్తురాజులను కుణ్డికాల్లు నివబుకాను ఇచ్చిన పన్నస దుజయరాజుల ముత్తురాజులు శక్తికాయ ఇచ్చిన పన్నస్ప కొట్టంబున పాఱకు కణ్టికాల్లు ఇచ్చిన పన్నస ఇరువదియాదినాల్కు మఱున్తుఱ్లు నేల.

ఇంతెద్ది వాడి విరిగల్లు ముత్తురాజు ఏళ, కంగుళూన్ఱు ఏల.

ఇమ్ముడి ఈతో ఇచ్చిన వన్నవిస కోసియపాఱ చేది శర్మ కిచ్చిరి.

అన్వయసౌష్ఠవం లేకపోడానికి ఉదాహరణం. విజయాదిత్యుని కపిలేశ్వరపుర శాసనం చూడదగును. కృష్ణా జిల్లా క్రీ. శ. 740. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం వారి పత్రిక V-2. పుటలు 41-52.

కావ్యశైలి ప్రాఙ్నన్నయ యుగంలోనే ఏర్పడింది. నన్నయ భారతంలో అది స్థిరము సుసంస్కృతము అయిన రూపం దాల్చింది. అది అనంతర కవులకు శిరోధార్య మయింది. ఆ మూడు కృతులలో నా మాన్యుడు నుసువు తెలుగు లరసికొని రచించినారు, తిక్క సుధీమణి మొదలైన తొంటి తెనుగు కవీంద్రులు.

# నన్నయ్య రాజరాజనరేంద్రుల నాటి చరిత్ర

## వేదము వేంకటరాయశాస్త్రి

ఆంధ్రవాఙ్మయమునకు ఆది కవి, భారత రచనకుముందే వాగనుశాసనుడు, రాజరాజనరేంద్రుని యాస్థానివాడు, రాజునకు పరంపరాగతుడైన పురోహితుడు నన్నయ్యభట్టు. పురోహితుడైనవాడు రాజులకు వట్టి వైదికశాస్త్రిలుగా మాత్రమే ఉండనక్కర లేదు. రాజుయొక్క పంచప్రధానులలో నొకడు. వారు 'మంత్రి, పురోహిత, సేనాపతి, యువరాజ, దౌవారిక', లనబడువారు.

నన్నయ భట్టునకు చాలమంది అపార్థములు కల్పించినారు ఇతడాంధ్రుడే. రాజనరేంద్రు డెంతటి ఆంధ్రుడో అంతటివాడే. తానే యిట్లు చెప్పుకొన్నాడు.

"తనకులబ్రాహ్మణు, ననురక్తు, నవిరళ
జపహోమ తత్పరు, విపులశబ్ద
శాసను, సంహితాభ్యాసు, బ్రంహాండాది
నానాపురాణ విజ్ఞాననిరతు,
బాత్రు, నాపస్తంబసూత్రు, ముద్గలగోత్ర
జాతు, సద్వినుతావదాత చరితు,
లోకజ్ఞు, నుభయభాషాకావ్యరచనాభి
శోభితు, సత్ప్రతిభాభి యోగ్య,

నిత్యసత్యవచను, మత్యమరాధిపా
చార్యు, సుజను, నన్నపార్యుఁ జూచి,
పరమధర్మవిదుడు వరచళుక్యాన్వయా
భరణుఁ డిట్టులనియె కరుణతోడ."



ఈ పద్యము వట్టి ఆత్మస్తుతి కాదు. వాస్తవముగా నన్నయ్య 'లోకజ్ఞుడు' 'మతి + అమరాధిపాచార్యుడు' అనగా బృహస్పతి. పైగా కులబ్రాహ్మణుడు, కాబట్టి అనురక్తుడు. తిక్కన సోమయాజి, మొదట తిక్కనామాత్యుడు, తర్వాత సోమయాజి, మనుమసిద్ధికి కులక్రమాగతుడైన మంత్రి. వైదికికాడు, ఆ విధముగానే నన్నయకూడ. నన్నయ్య తన తండ్రిపేరును ఎక్కడను చెప్పుకొనలేదు. రాజరాజుయొక్క తండ్రి విమలాదిత్యుని రణస్తిపూండి శాసన రచయిత (1019) భీమనభట్టు. రాజరాజుయొక్క కలిదిండి శాసన రచయిత 1035 లేదా 1042 (ప్రాంతము) బేతనభట్టు; 1051 లో నందంపూండి శాసన రచయిత నన్నయభట్టు. కుల పారంపర్యమునుబట్టి, భీమనభట్టు నన్నయ్య తండ్రిగాను, బేతనభట్టు అన్నగాను ఉండవచ్చునని శ్రీ చాగంటి శేషయ్యగారొక ఊహను వెలిబుచ్చినారు. ఇది సానుభూతిలో ఆలోచింపదగినదే. రాజరాజనరేంద్రుని తాతయైన దానార్ణవునికి చాళుక్య భీముడని బిరుదు. క్రీ. శ. 973 లో రణమరణమందినాడు. ఆతని మంత్రి తన కుమారునికి రాజుపేరు పెట్టుకొనియుండును. ఇది యొక ప్రాచీనాచారము. భారతదేశమంతటను ఈ ఆచారము ఉండినదే.

ఇందులకు తోడు నన్నయ రాజరాజనరేంద్రులు ఇంచుమించు సమవయస్కులుగా నుండినట్లు తోచుచున్నది. నన్నయ్య చివరి తారీఖు క్రి. శ. 1059. నరేంద్రునిది 1061. రాజు 1019 నుండి 1061 వరకు నలువదిరెండేండ్లు రాజుగానుండినాడు. వీరిరువురి యొక్క జీవితములు పెనవేసికొని దాదాపు అర్ధశతాబ్దకాలము వీరిద్దరును రాజ్యభ్రష్టులై, దేశత్యాగులై సుఖదుఃఖములలో సమభాగులై యుండియుందురు. నరేంద్రుడు దేశత్యాగియై ఎన్నిమార్లో తమిళదేశమందలి తిరువయ్యారుకు పోయి తలదాచుకొనవలసి వచ్చినది. అంత గొప్ప ప్రభువు, 'అపరాజిత భూరిభుజాకృపాణధారాజల శాంతశాత్రవపరాగుడు', మహాయోధుడు, పట్టుమని పదిరోజులు, శత్రుభీతి లేక,

Tel. 1808



తన రాజ్యములో నుండినట్లు కానరాడు. తాను రాజుగా నుండిన (లేదా తన రాజ్యకాలము) నలువది యేండ్ల కాలములో చివరి తొమ్మిదేండ్లు మాత్రమే కొంత కుదురుపాటుతో రాజ్యమేలినట్లు కనబడుచున్నది. ఈ కుదురుపాటుకు నన్నయ్యయే కారణము, రాజనరేంద్రుడు పడరానిపాట్లుపడి తుదకు నన్నయ యొక్క రాజనీతి ప్రయోగముచేతనే రాజ్యమందు స్థైర్యమును పొంది, ఆ కృతజ్ఞతా సూచకముగా నన్నయ్యచేత మహాభారతమును ఆంధ్రీకరింప జేసి ఆ చంద్రార్కమైన కీర్తిని సంపాదించినాడు.

వీ రిద్దరుగాక వీరికి తోడు, నన్నయ్యకు సహాధ్యాయి నారాయణభట్టు కనబడుచున్నాడు. నన్నయ్య అతని నిట్లు ప్రశంసించినాడు.

"పాయక పాకశాసనికి
భారత ఘోర రణంబునందు నా
రాయణునట్లు వానస ధ
రామరవంశవిభూషణుండు, నా
రాయణభట్టు, వాఙ్మయ ధు
రంధరుడున్, తన కిష్టుడున్, సహా
ధ్యాయియునై నవా డభిమ
తంబుగతోడయి నిర్వహింపగన్."

ఈ పద్యము చాల ముఖ్యమైనది. కృష్ణార్జునుల పోలిక చాల గొప్పది గదా. యుద్ధముచేసినవా డర్జునుడు, సారథ్య మొనర్చినవాడు నారాయణుడు; ఇక్కట్టులలో చక్కని హితముపదేశించి ఆదుకొన్నవాడు. అట్లే నన్నయ్య రచయిత, మార్గదర్శకుడు నారాయణ భట్టు. తా మిరువురును నరనారాయణుల వంటివా రనుట. తాను కర్త, ప్రేరకుడు రాజనరేంద్రుడు, కారయిత నారాయణభట్టు, అనుమోదకులు ఆస్థాని వారు.

కాని ఎవడీ నారాయణభట్టు, ఇంత గొప్పవాడు? చారిత్రకముగా క్రీ. శ. 1051 నుండి 1056 వరకును వేంగియందొక నారాయణ



భట్టు, త్రైలోక్యమల్లదేవర ప్రధాని సకుటుంబముగా నుండినట్లు శాసనములు కనబడుచున్నవి. నందంపూండి అగ్రహారప్రతిగ్రహీత యొక నారాయణభట్టు, అష్టాదశభాషాధురంధరుడు కనబడుచున్నాడు. అగ్రహార మిచ్చినవాడు రాజరాజనరేంద్రుడు, శాసన రచయిత నన్నయ్య, ఇరువురు నారాయణభట్టులు సమానస్కంధులుండిరా? నన్నయ సహాధ్యాయియు వాఙ్మయధురంధరుడేగదా. కాదు, ఇరువురు నొక్కరేయని శ్రీకొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు వ్రాసియున్నారు. ఈ పద్యమందలి 'వానసధరామరవంశవిభూషణుం' డను నదియు 'త్రైలోక్యమల్ల దేవర ప్రధాని' అనునదియు పరస్పరము సమన్వయింపవలెను. అవి నిజమును పట్టిచ్చు శబ్దములు. 'వానస' అనగా అర్థము మన పండితులు పాఠాంతరములు వెదకి 'వాణస' ను 'దానును' కాక 'మానుగ' 'వాసిగ', అని పరిష్కరించినారు. కాని నిజముగా అది 'వాణస'యే. అది ఆయన ఇంటిపేరు. ఆంధ్రులవలెనే కర్ణాటకులకు ఇంటిపేరు సహజము. తమిళులకే లేదు. ఇందులో 'వాణస' అనగా 'బానసము' వంటయిల్లు, రాజుయొక్క భోజనశాల. మహానసము. త్రైలోక్యమల్లదేవర చాళుక్య చక్రవర్తి. కల్యాణి ఇతని రాజధాని. ఆయనకు మహామాత్యుడు వాణస మధుసూదనయ్య. శాసనములలో మధుసూదనయ్య బిరుదులు "వాణస వెగ్గడె, మనెవెగ్గడె, ఆస్థానవస్తునాయకం, ద్వాసప్తతి నియోగయోగంధరాయణం, వాణస మధుసూదనయ్య" అని కలదు. ఇతడు మహామాత్యుడు రాజుయొక్క డెబ్బదిరెండు నియోగముల మీద పై యధికారి. రాజుయొక్క భోజనాదికములనే గాక అంతఃపురమును, ఆస్థానమునుకూడ చూచుకొనువాడు, తర్వాత వానస యింటి పేర్ల వారు ఎందరో ఆంధ్రదేశమునకు వచ్చినారు. పండితారాధ్యుడు వానస వంశస్థుడు.

చూడగా నారాయణభట్టు, కర్ణాటకుడు; మహామాత్యుడైన వాణస మధుసూదనయ్యకు బంధువు; దగ్గరి జ్ఞాతియేమో. అంతటి గొప్పవాడు వచ్చుటలో విశేషముండవలెను. కారణము నన్నయభట్టు

నకు సహాధ్యాయి, ఇష్టుడు. కాని అంతమాత్రమేనా ? ఒక ఆశ్చర్యము! ఈ పండితులు ఇరువురును, ఏ గురుకులమున, విశ్వవిద్యాలయమున, ఘటికా స్థానమున చదువుకొన్నారో గాని వారి ప్రభువులు పరమ శత్రువులు, ఉప్పు నిప్పు, ఈ శత్రుత్వము పరంపరాగతము. అప్పుడు పుట్టినది కాదు. దాదాపు ఒక శతాబ్దకాలము, మూడు తరముల వారు పోరాడుకొని నాల్గవ తరము నాటికి పరిస్థితులు మారిపోయినవి. రాజరాజనరేంద్రుని కుమారుడు రాజేంద్రుడు తమిళ-చోళరాజుల యల్లుడు మేనల్లుడు. రాజరాజనరేంద్రుడు గంగైకొండ చోళరాజు అల్లుడు, మేనల్లుడు. తండ్రి విమలాదిత్యుడు చోళరాజు మేనల్లుడు కాదు గాని అల్లుడే. పెదతండ్రి శక్తివర్మ చోళ సహాయముచేత రాజ్యము సంపాదించినవాడు, బంధువు. వారి అండవలననే రాజ్యమును కాపాడుకొన్నవాడు కూడ. కారణము వేంగిని అపహరించుటకు కల్యాణీ చాళుక్యులనబడు కర్ణాటకులు కంకణము కట్టుకొని యుండిరి. వారు ఎత్తి వచ్చి వేంగి ప్రభువులను తరిమినప్పుడంతయు చోళరాజులు పోయి తమ అల్లుళ్ళయిన వేంగి చాళుక్యులకు సాయపడుచుండిరి. దగ్గర ఉండి పోలీసు వారివలె కాపాడవలసి యుండినది. మహా యుద్ధములు జరిగినవి. అటువంటి పరిస్థితిలో ఈ విచిత్ర పరిణామము, ఈ కన్నడ స్నేహము, ఎట్లు కుదిరినదో ఆశ్చర్యమే గదా.

పరిశోధించి చూడగా, ఆంధ్ర మహాభారత రచనాకాలము, ఒక శతాబ్దముగా జరుగుచుండిన భీకర సంగ్రామముల చివరిదశగాను, తన రాజునకును, తనకును చివరిదశలో శాంతిని చేకూర్చిన వాడు నన్నయ్యభట్టుగాను తెలియుచున్నది. తిక్కనసోమయాజి మనుమసిద్ది రాజ్యస్థాపనా చార్యుడైన యెడల నన్నయ రాజనరేంద్రస్థాపనాచార్యుడైనాడు. దీనికి ఎంతో పూర్వ చరిత్ర గ్రహింపవలసియున్నది. ఇందులకు మనము ఒక మారు, దృష్టిని వెనుకకు మరల్చి రాజనరేంద్రుని అగచాట్లే గాక ఆతని తండ్రి తాతల పాట్లను కూడ గ్రహించిన ఎంతో చరిత్ర విశదమగును. ఎటువంటి పరిస్థితిలో ఆంధ్రమహాభారతము, ఆంధ్రుల ఆదికావ్యము, వ్రాయబడినదో, ఆ వింత బోధపడగలదు.



రాజరాజనరేంద్రుని పితామహుని, దానార్ణవుని, దాయాదులు చాల బాధించి రాజ్యమునకు రానీయక తఱుముచుండిరి. అతడును చాల యుద్ధములు చేసి క్రీ. శ. 970 లో, జ్ఞాతిని చంపి రాజ్యమును సంపాదించుకొనెను. కాని మూడేండ్ల కన్న ఎక్కువ కాలము అనుభవింపలేక పోయెను. ఇంతలో పెడకల్లు రాజధానిగా కర్నూలు ప్రాంతమును పాలించుచుండిన తెలుగు చోళరాజు జటా చోడ భీముడను మహాబలశాలి, రణరంగమున దానార్ణవుని చంపి వేంగినిహరించెను. ఆది మొదలు అతని కుమారులు ఇరువురును ఇరువదియైదు సంవత్సరముల కాలము, దేశభ్రష్టులై, కాందిశీకులై తిరుగసాగిరి. మొదట కళింగ దేశప్రభువును, తమ తండ్రికి తల్లివంక బంధువునైన, కామార్ణవుని ఆశ్రయించిరి. ఆతడు జటాచోడభీమునితో ఎనిమిదేండ్లు పోరాడి క్రీ. శ. 978లో రణమరణమునందెను. ఆతని తమ్ముడు వినయాదిత్యుడును వీరికై పోరాడి 981 తుదకు తానును వీరశయ్య నలంకరించెను. జటాచోడభీముడు వేంగీకళింగములను ఆక్రమించి, అడ్డు లేక పాలింపసాగెను. శక్తి వర్మ విమలాదిత్యులు గతిలేక, తమిళ దేశమునకుపోయి, చోళరాజులను ఆశ్రయించి, తంజావూరుజిల్లా తిరువయ్యారులో కాలము నెదురుచూచుచుండిరి.

ఈ లోపల దక్షిణాపథములోను, ఆర్యావర్తమందును పెక్కు రాజకీయ కల్లోలములు ఏర్పడి దేశము చాల మారిపోయెను. కర్ణాటక దేశమున రాష్ట్రకూట చక్రవర్తులను పడద్రోసి, పాతచాళుక్య వంశస్థుడు రెండవ తైలపుడు మరల తమ రాజవంశమును క్రీ. శ. 973 లో స్థాపించెను. ఇతడు జటాచోడ భీమునికి మిత్రుడు. ఆ సంవత్సరమే గదా ఈ చోడ భీముడు దానార్ణవునిచంపి వేంగిని హరించినది. సరిగా ఆ సంవత్సరమో లేక ఒక సంవత్సరము ముందో (972) మాళవ దేశములో పరమార మహీపతి ముంజరాజు రాజ్యమునకు వచ్చెను ఇతడు భోజుని పెదతండ్రి - పినతండ్రి యని, భోజుని చంప యత్నించెనని అసత్యపు కథలు ప్రచారమునకు వచ్చినవి. ఈతడు రాష్ట్రకూటుల

శత్రువై, వారిస్థానమును కోరినందున తాను 'పృథ్వీవల్లభ' బిరుదును తాల్చెను. తైలపుడును 'పృథ్వీవల్లభ' బిరుదమును ధరించెను. (చారిత్రకముగా ఇరువురు ఒకే బిరుదును ధరించిన యెడల వారికి స్పర్ధయు శత్రుత్వమును కలవని గ్రహింపవలెను). ఈ శత్రుత్వముచేత ముంజమహీపతి తైలపుని మీదికి లెక్కలేని పర్యాయములు దండయాత్రలు సల్పెను. తైలప శత్రువులకు చోళరాజులకు మిత్రుడాయెను. దీనిచేతనే భోజమహారాజు రాజరాజనరేంద్రునికిని చోళులవలన మిత్రుడాయెను. ఈ చరిత్ర యంతయు మున్ముందున్నది.

ఈ విధముగా దేశము మారిపోవుచుండిన కాలములో శక్తివర్మ విమలాదిత్యులను ఆదరించు వారు లేక, వారు క్రీ. శ. 981 తర్వాత చోళరాజ్యములో అడుగుపెట్టిన కాలములో, చోళులు అప్పుడప్పుడే బలము సంపాదించుకొని తలయెత్తసాగిరి. తెలుగు సోదరులు చోళదేశమునకు వచ్చుటకు కారణము - కర్ణాటకులు తమ శత్రువునకు మిత్రులు. కాళింగులు పోయిరి. ఇంకెవరున్నారు. పైగా భూమార్గము అటవీప్రదేశము, శత్రుజనాకీర్ణము. వీరికి సముద్రమార్గమొక్కటే శరణ్యమై యుండెను. వేంగినుండి తమిళదేశమునకు ఆ కాలమున. మన నేటి రైలు మార్గమువలె, సరాసరి మార్గము లేదు. కొండలు, నదులు, అడవులు, దుష్టజంతువులు, బందిపోటు దొంగలు, శత్రువులు లేకుండిన కడప, గుత్తి, కర్నూలు మార్గముగా పోయి, లోతులేని చోట, కృష్ణా తుంగభద్రలను దాటి వేంగికి పోవుచుండిరి. రెండవది సముద్ర మార్గము. ఈ వేంగి రాజ్యమునకు, కృష్ణా గోదావరుల నడిమి దేశమునకు, రాజధాని వేంగీపురము. నేటి పెద వేగికి సమీపము. బెజవాడ (విజయవాడ దుష్ట సమాసము. విజయవాడ సాధువు. లేదా విజయవాటీ సంస్కృతము) రెండవ రాజధాని, గిరిదుర్గము. నాటికింకను రాజమహేంద్రవరము నిర్మింపబడలేదు. పైగా గోదావరిని దాటుటయు సాధ్యము కాదు. అట్టి పరిస్థితిలో శత్రుసమాకీర్ణమై దారి సరిగా లేని భూ మార్గముకన్న శక్తి వర్మ విమలాదిత్యు



లకు సముద్రమార్గమే సుకరమై యుండియుండును. అందుకే చోళరాజులు నౌకా దండయాత్రలు సాగించినారు.

ఇంతే కాదు తమిళచోళులకును వేంగీ చాళుక్యులకును పూర్వ బాంధవ్యముండినట్లు కనబడుచున్నది. చోళులు, తొమ్మిదవ శతాబ్దము చివరను పదవశతాబ్దము ప్రారంభమునను, పాండ్యులను పల్లవులను అణచి పైకి రాసాగిరి. వీరికి విజయాలయుడు మూలపురుషుడైనందువలన వీరిది విజయాలయ వంశమయ్యెను. వీరు తొండమండలమును పల్లవుల దగ్గరి నుండి జయించుటయే గాక తంజావూరు రాజ్యమును, ముత్తరైయర్ అనబడు ముదిరాజులవద్ద నుండి, జయించిరి. కాని తొండమండలమును (కంచి రాజ్యమును) నెల్లూరు వరకును జయించినందువలన కాంచీనగర ప్రాంతమందే ఎక్కువకాలము ఉండవలసినవారైరి. ఈ వంశమువాడు ఆదిత్యచోళుడు కాళహస్తి ప్రక్కన తొండమనాడను ఊరిలో మరణించెను. ఈ మొదటి ఆదిత్యచోళుని తర్వాత ఆతని కుమారుడు పరాంతకుడు మదరాసు కాళహస్తి ప్రాంతములనుండి కావేరీతీరము వరకు గల రాజ్యమునకు పాలకుడయ్యెను.

కాని ఇంతలో కర్ణాటకులు ఎత్తి వచ్చిరి. మూడవరాష్ట్రకూట కృష్ణరాజు కంచి రాజ్యమును జయించి తొండమండలమును స్వాధీనము చేసికొనెను. పరాంతకుడు శ్రమపడి సాధించినదంతయు పాడైపోయెను. అతని కుమారులలో గండరాదిత్యుడనువాడు ప్రసిద్ధుడు. 949-957 నడుమ పాలించెను. తర్వాత అతని తమ్ముడు అరింజయుడు, సుందరచోళుడు, 'పరకేసరి' రెండవ ఆదిత్యుడు 956 నుండి 969 వరకు పాలించిరి. వీరిలో అరింజయుడు వేంగి చాళుక్యరాజు రెండవ భీముని కుమార్తెను కుందవ్వను, (వీర్క కుందవైయారును) పెండ్లాడెను. 949 లో జరిగిన రాష్ట్రకూట విజయానంతరము ఈ రాజవంశముల కలయిక అసాధ్యముగాన ఈ వివాహము క్రీ. శ. 949 కి చాల ముందే పరాంతకుని కాలమందే జరిగియుండవలెనని మదాచార్యులు నీలకంఠ

శాస్త్రిగారి యభిప్రాయము. గండరాదిత్యుని కాలము నుండియు కర్ణాటకులను తరుముటకు చేయుచుండిన ప్రయత్నములు కొనసాగినవి. రాష్ట్రకూట మూడవ కృష్ణరాజు 968 లో గతించెను. కర్ణాటకుల బలము తగ్గినది. చోళులు కాంచీపురమందే ఎక్కువకాలము గడపుచుండిరి. సుందరచోళుడు 973 లో గతించునాటికి చాల భాగము మరల స్వాధీనమైనది. క్రీ. శ. 985 లో రాజరాజచోళుడు రాజ్యమునకు వచ్చునప్పటికి రాష్ట్రకూటులు పూర్తిగా అంతరించి పండ్రెండేండ్లు దాటినవి. క్రీ. శ. 973 లో దానార్ణవుడు రణమరణమందిన సంవత్సరమే కల్యాణీ చాళుక్యులు పైకి వచ్చిరి. రెండవ తైలపుడు కర్ణాటక చక్రవర్తి.

రాజరాజచోళుడు పరాక్రమవంతుడు, దూరదృష్టి గల విజిగీషువు, సామ్రాజ్యకాంక్షి. శక్తివర్మ విమలాదిత్యులను ఈతడెప్పుడు చేపట్టెనో గాని, తన కుమార్తెను కుందవ్వను విమలాదిత్యు కిచ్చి పెండ్లి చేసెను. ఈ కుందవ్వ యను పేరు అతని నాయనమ్మది. అతని యక్క పేరు కూడ కుందవ్వ. అక్క మీద ఈతనికి అపారప్రేమ గౌరములు. తన కుమార్తెకు ఆ పేరే పెట్టుకొనెను. అక్క కుందవ్వ లెక్కలేని దానధర్మములు చేసినట్టిది. ఈ పూర్వ బాంధవ్యముచేత కాబోలు దానార్ణవునిరాణి, శక్తివర్మ విమలాదిత్యుల తల్లి, తిరువయ్యారులోనే స్థిరముగ నిలిచిపోయెను. క్రీ. శ. 1007 లో ఈమె శాసనము కలదు. ఇంకను చాళుక్య వంశస్థులు కొందరు చోళరాజుల కొలువులో కనబడుచున్నారు. రాజరాజచోళుడు శక్తివర్మ విమలాదిత్యులను వేంగి యందు పునఃప్రతిష్ఠ చేయుటకు కంకణము కట్టుకొనెను. విమలాదిత్యునికి తాను రాజగుచునే తన కుమార్తెనిచ్చి యుండవలెను. ఏలయన రాజరాజనరేంద్రుడు 1019 లో రాజ్యమునకు వచ్చునాటికి ముప్పది, ముప్పదియైదేండ్ల వాడు గా నుండవలెను. 1061 వరకు దాదాపు 42 ఏండ్లు రాజుగా నుండెను. తండ్రికి విమలాదిత్యునికి పెద్ద కుమారుడు, 'విమలాదిత్యాగ్రతనూజ' అని నన్నయ. ఇతని సవతి తమ్ముడు, ఇతని తర్వాత 15 ఏండ్లు జీవించిన వాడు, నాటికే



(1019) ఇతనిని ఎదిర్చి పోరాడునంతటి వయసువాడు. ఈ తమ్ముడు జటాచోడ భీమునికి దౌహిత్రుడు. మేడమ్మ కుమారుడు. ఈ భీముడు క్రీ. శ. 1001 లో గదా రాజరాజచోళునిచేత చంపబడినాడు. తర్వాత మేడవ్వ పెండ్లి, విజయాదిత్యుని జననము. విజయాదిత్యునికి పదునెనిమిదేండ్లైన నుండిన రాజరాజనరేంద్రునికి ఇరువదియెనిమిదైన నుండవలయును. ఏలయన తమ్మునికన్న వదునాలుగు పదునైదేండ్లు ముందుగానే గతించెను గదా. కాబట్టి రాజరాజనరేంద్రుడు క్రీ. శ. 937 ప్రాంతమున జనించియుండు. అనగా రాజరాజచోళుడు తాను రాజైనదగు వెంటనే తన కుమార్తెను కుందవ్వను విమలాదిత్యుని కిచ్చి పెండ్లిచేసియుండును. తన సామ్రాజ్యకాంక్షకు కుమార్తె పెండ్లి కాంది.

ఆవెను వెంటనే రాజరాజచోళుడు, వేంగిని సాధించుటకు పునాదిగా పశ్చిమచాళుక్యచక్రవర్తి తైలపునితో యుద్ధములు ప్రారంభించెను. క్రీ. శ. 983 లోనే చోళులు తైలపునితో అనంతపురముజిల్లా రొద్దముకడ కర్ణాటకులను జయించిరి. బహుశః ఈ విజయము రాజరాజుదిగానే యుండును. అప్పుడు చోళరాజు ఉత్తమచోళుడు. రాజరాజు, అతనికుమారుడు కాడు గాని యువరాజుగాను, తర్వాతి రాజుగాను అంగీకరింపబడినవాడు. కాబట్టి యువరాజుగానే మైసూరు, కోలారు, బళ్లారి, కర్నూలు ప్రాంతములను జయించెను.

కాని ఒక ప్రశ్న యుదయింపవచ్చును. శక్తివర్మ విమలాదిత్యులను వేంగియందు పునః ప్రతిష్ఠచేయుటకు వేంగి మీదికి రాకుండ కర్ణాటకుల మీది కేల పోవలయును - అని. కారణము చాల గొప్పది. వేంగిని ఆక్రమించిన జటాచోడ భీమునికి చాళుక్య తైలపుని సహాయమున్నది. క్రీ. శ. 973 లోనే గదా వీరిద్దరును రాజ్యములను సంపాదించుకొనిరి. పైగా వేంగికి దండయాత్రకు కడప కర్నూలు మార్గము తప్ప వేరు మార్గములేదని ముందే గ్రహించితిమి. కాబట్టి ఈ మార్గములను సాధించి క్రీ. శ. 999-1000 ప్రాంతమున వేంగి మీదికి తరలెను. శక్తివర్మ ఈ యుద్ధములలో పరాక్రమించెను.

చోళుల సాయముతో వేంగిని 999 లోనే ఆక్రమించెను. వెంటనే జటాచోడభీముడు తన సేనాధిపతులను శక్తివర్మమీదికి పంపెను గాని శక్తివర్మ వారిని సంహరించెను. రావణాసురునివలె జటాచోడుడు శక్తివర్మను తాకి, కంచివరకు దండయాత్రసలిపి ఘోరముగా పోరాడెను. కంచిలో రాజరాజచోళుడు క్రీ. శ. 1001-2 లో రణరంగమున భీముని ఓడించి చంపెను. అంతటితో తన కార్యము నెరవేరగా శక్తివర్మ విమలాదిత్యులను వేంగియందు నిర్భయముగా నుండ నియోగించెను.

శక్తివర్మ విమలాదిత్యులకు తండ్రిపోయిన ఇరువదియైదేండ్లకు మరల తమ రాజ్యము దొరకినది. శక్తివర్మ వయసులో కూడ పెద్దవాడు. క్రీ. శ. 973 కు ముందే తండ్రితో కలసి యుద్ధములలో పాల్గొని యుండినవాడు. క్రీ. శ. 1011 వరకు పాలించి గతించెను. రాజరాజచోళుని మరణమును 1014 ప్రాంతముగాన ఇతడు అతనికి సమవయస్కుడేమో కాబట్టియే రాజరాజు తనకుమార్తెను ఆతని తమ్మునికిచ్చి పెండ్లి చేసినాడు. కాని శక్తివర్మ రాజ్యము నెమ్మదిగా జరుగలేదు. చోళరాజులకు వేంగిని కాపాడుటయే ప్రధానకార్యమై పోయినది. కల్యాణీచాళుక్యులు బాధించుటను వదలలేదు. క్రీ. శ. 997 లో తైలపచక్రవర్తి గతించెను. ఆతని కుమారుడు సత్యాశ్రయుడు చక్రవర్తి యాయెను. రాజరాజు జీవితకాలమున తమిళులకు వేంగి విషయమున మిత్రుడైన మాళవమహీపతి ముంజుడు తైలపునితో యుద్ధములుచేయుచు, పై నుండి ఎత్తి వచ్చి, గోదావరినిదాటి, చోళులు చాళుక్యులను తాకినప్పుడంతయు, తానును కొట్టుచుండెను. చాళుక్యులు ముంజుని పట్టుకొని చంపి ఆతని కిరీటమును, నవరత్నములు తాపిన దానిని అపహరించి తమ యుద్ధభేరికి కట్టి, తమ యుద్ధములలో ముందుగా ఊరేగించుచుండిరి. దానిని మరల సంపాదించుటకు పరమార రాజకుమారులు చోళ సైన్యములో చేరియుండిరి. ముంజుడు పోయిన తర్వాత ఆతని తమ్ముడు సింధురాజు దక్షిణా పథముమీదికి రాలేదు. ఆతనికి ఆ చుట్టుపట్ల సరిపోయినది. అటువెనుక 1015 ప్రాంతమున భోజుడు రాజ్యమునకు వచ్చెను.



ఈ మధ్యకాలమున సత్యాశ్రయునికి సందు దొరకినది. ఇతడును పరాక్రమవంతుడే. జటాచోడుడు గతించి వేంగి మరల తూర్పు చాళుక్యుల వశముకాగానే 1006 లో వేంగి మీదికి దండయాత్ర సలిపి ధరణికోట, యనమదల, చేబ్రోలు మున్నగు కోటలను గుంటూరు జిల్లాలో, అనగా నాటి వెలనాడు రాజ్యములో, కాల్చి దేశమును ధ్వంస మొనర్చెను. వీరు కృష్ణనుదాటి వేంగిదేశమును చొచ్చినట్లు కానరాదు. దీనికి ప్రతిక్రియగా రాజరాజు చోళ సైన్యములు కర్ణాటక దేశమున బిజాపూరు వరకును పోయి ధ్వంస మొనర్చినవి. రాజరాజుతో యుద్ధ మొనర్చి చోళ సైన్యములను వెనుద్రిప్పుటకు సత్యాశ్రయుడు వేంగిని వదలి పోరాడి 'తిగుళరమారి' (తమిళుల కుమారకుడు) అను బిరుదమును ధరించెను. ఆతనియాస్థానకవి. రన్నమహాకవి, వేణీసంహారముననుకరించి కన్నడమున గదాయుద్ధమను కావ్యమును రచించెను ! దీనికే సాహస భీమ విజయమను నామాంతముపెట్టి, సత్యాశ్రయుడు భీముడైనట్లును, రాజరాజ చోళుడు రాజరాజు (ధుర్యోధనుడు) ఐనట్లును ధ్వనించునట్లు కావ్యమున నిర్వహించెను.

ఇతని కన్న ముందే రాజరాజ చోళుని శాసనములో, కవి, జటా చోడభీముని భారతభీమునికిని రాజరాజును భారత ధుర్యోధనుకిని పోల్చి, స్పష్టముగానే, పూర్వము బలహీనుడైన (నడుముకడ గాంధారి తాకనందున ఆ భాగమున దెబ్బకు తాళలేదు) రాజరాజును గదాయుద్ధ ప్రవీణుడైన భీముడు మోసముగా చంపినాడు గదా, నేడు ఆ పేరే గల రాజరాజు బలవంతుని, ఎట్టి దోషమును లేని ఆంధ్రభీముని గదాయుద్ధమున చంపినాడు గదా. ఈ రాజరాజెంత గొప్పవాడో గదా యను చమత్కార శ్లోకమును వ్రాసినాడు.

" దండేన భీమేన యుధిప్రవీణో
యద్రాజరాజో నిహతో మదాఢ్యః
తద్భీమనామాన మరంధ్రమంధ్రం
హాస్మీతి దండేన జఘాన తం సః

ఈ విధముగా ఆ కాలమున భారతమును జనులు ఎక్కువగా స్మరించుచుండిరి.

రాజరాజు జటాచోడనిభీముని చంపి 'తెలింగకులకాల' అని బిరుదు ధరించెను.

అటుతర్వాత 1006 నుండి 1011 వరకు శక్తివర్మకు ఎట్టి బాధలు లేవు. తమ్ముడు విమలాదిత్యుడు పట్టాభిషిక్తుడైనాడు. కాని ఇతని రాణికుందవ్వ క్రీ. శ. 1010 తో తిరువయ్యారులో నుండినట్లు తెలియుచున్నది. ఇతని పట్టాభిషేకము క్రీ. శ. 1011 మే నెల 14 తేది పరిగినది గాన చోళదేశమున నుండి వేంగికి ఆమె వచ్చి యుండవలెను. కుందవ్వ చోళరాజ్యముననే యుండినందున ఏదో శత్రుభయముండి యుండును. ఇంతలో రాజరాజు తన వార్ధక్యమువలన తనకుమారుని రాజేంద్రచోళుని యువరాజును చేసెను. రాజరాజచోళుడు 1014 లో గతింపగా రాజేంద్రుడు చోళచక్రవర్తి విజృంభింప నారంభించెను. తత్షణమే కట్టు దిట్టములు ప్రారంభించెను. అప్పటికే పెద్ద వాడేమో, తన కుమారుని రాజాధిరాజును యువరాజుగా చేసి తనతో కూడ నుంచుకొనెను. కుమారుడు ఇరువది యేండ్లకు మించినవాడుగా నుండి యుండవలెను. ఏలన ఆతడు 1054 మరణించినాడు. 1018 నుండి 36 ఏండ్లు. గతించునప్పటికి పెద్దవాడుగానే యుండును. చూడగా రాజేంద్రుడు పెద్ద ప్రయత్నమందే యున్నట్లు తెలియుచున్నది. తర్వాతి చరిత్ర దీనిని బలపరుచుచున్నది.

కర్ణాటక చక్రవర్తి సత్యాశ్రయుడు 1008 లో గతించి అతని తమ్ముని కుమారుడు విక్రమాదిత్యుడు రాజాయెను. ఆతని కాలమున ఆతనికి ఉత్తరమునుండి ఎత్తివచ్చిన చేదిరాజులతో ఘర్షణ యేర్పడినది. ఆతనితర్వాత అతి స్వల్పకాలము అయ్యనయను నతడు రాజై గతింపగా 1015 జయసింహుడు ఇతడు రాజాయెను. రాజేంద్ర చోళునికి సమకాలికుడు. మరల ఘర్షణలు, వాని పూర్వాంగములైన కుట్రలు



కుయుక్తులు, కుతంత్రములు ప్రారంభమైనవి. కర్ణాటకులకు, సింహళ, పాండ్య, కేరళీయులు మిత్రులైరి. వివరములు అక్కరలేదు గాని, జయసింహుని రాజ్యాధిరోహణము సులభముగా జరుగలేదు. కాని అతని మంత్రులు సాయపడిరి. చోళులను తన మీదికి రానీయక వారి దృష్టిని అన్యత్ర ఆకర్షించుటకు వెనుకనుండిన శత్రువులను రేపెను. వారు సింహళ కేరళపాండ్యులు. రాజేంద్రచోళుడు వీరిని అణచి గాని కర్ణాటకముమీదికి రాలేక పోయెను. ఈ సందులో జయసింహుడు వేంగి మీదికి దండయాత్రకు అదను చూచుచుండెను.

ఇంతలో 1019 లో విమలాదిత్యుడు గతించెను. వెంటనే రాజరాజనరేంద్రుని తఱిమి, వేంగిలో అతని తమ్ముని విష్ణువర్ధన విజయాదిత్యుని ప్రతిష్ఠించుటకు జయసింహుడు ఎత్తి వచ్చెను. విజయాదిత్యుని పట్టాభిషేకము జరిగినట్లు లేదు. ఏలన అది అత్యాడంబరముగా 1031 లో జరిగినది. కాని రాజనరేంద్రుడును కాందిశీకు డాయెను. ఆంధ్ర కర్ణాటకరాజ్యముల కూడలియైన రాయచూరు మండలమున, మునంగియను చోట మహాసంగ్రామము జరిగెను. రాజేంద్రచోళుడు ఈ సందర్భమున తన సైన్యములో కొంత కర్ణాటకుల మీదికిని, కొంత వేంగీ కళింగ ఉత్కళ వంగరాజ్యములమీదికిని పంపెను. ఈ సైన్యములు భూ మార్గముల మీద వెడలగా, సముద్రముమీద నౌకలను కటాహాది ద్వీపములకును పంపెను. సముద్రముమీద తూర్పు రేవులను కూడ కాపాడవలసి యుండెను. బ్రహ్మాండమైన ప్రయత్నముగా నున్నది. జయసింహుడు 1021 లో మునంగి యను చోట పరాజితుడు కాగా, రాజేంద్రుని గంగాయాత్ర నొనర్చిన సైన్యములును వచ్చి రాజేంద్రుని గోదావరీతీరమున కలసికోగా, రాజరాజనరేంద్రుని పట్టాభిషేకము క్రీ. శ. 1022 ఆగస్టు నెల 22 వ తారీఖున, తన మేనమామయు తనకు పిల్ల నిచ్చిన మామయునైన రాజేంద్రచోళుని సముఖమున జరిగినది. గంగానదీ తీరభూములను జయించినందున రాజేంద్రచోళుడు గంగైక్కొండ చోళ[illegible] అను బిరుదును తాల్చెను. రాజరాజనరేంద్రుని రాజ్యాధిరోహణము ఇంత శ్రమతో కూడినదని ఎవరైనను ఊహిం

చిరా! యావద్భారతదేశమును ఈ యుద్ధములలో పాల్గొన్నట్లైనది!

గంగైకొండచోళపుర నిర్మాణము - ఇది జరిగిన తర్వాత కొద్ది కాలముననే రాజేంద్ర గంగైకొండ చోళుడు, తన రాజధానీ నగరమును, పళైయారై, తంజాపురులనుండి, చిదంబరమునకు సమీపమున గంగైకొండ చోళపురమని తాను క్రొత్తగా, తన దిగ్విజయ సూచకముగా నిర్మించుకొన్న, మహానగరమునకు మార్చుకొనెను. ఈ నగర నిర్మాణమును, నగరప్రవేశమును క్రీ. శ. 1024 లేక 1025 ప్రాంతముల జరిగియుండును. రాజరాజనరేంద్రుడు 1022 నుండి రాజ్యపాలన మారంభించెను. కాని అనుదినము శత్రుభయము లేక పోలేదు. రాజేంద్ర చోళునికిని తత్పూర్వముండిన రాజధానులు, కుంబకోణమునకు సమీప మండలి పళైయారై (తిక్కన చెప్పిన ప్రాయేఱు) యును, తంజాపురమును, (పళైయారైలో రాజేంద్రచోళుడు ఆతని యక్క కుందవ్వయు తమ బాల్య జీవితములను గడపిరి.) ఈ రాజధానులు చేరపాండ్య సింహళీయులకు దగ్గరగా నుండి, తాను వేంగీ ప్రాంతములకు పోయినప్పుడు శత్రుభేద్యములగుటకు తగియుండినవి. కాంచీనగరము ఇటు కళ్యాణీ చాళుక్యులకు చాల సమీపము. ఈ క్రొత్త నగరము నేటి తిరుచ్చిజిల్లా, ఉదయార్పాళయముతాలూకాలో నున్నది. ఇది కావేరీ తీరమునుండి ఉత్తరమున చాల ఎగవను, వెల్లార్ నదీతీరమున నిర్మితము. సముద్రమునకు సమీపము కాదు. దీనిని సకల సంపత్సమృద్ధముగాను శత్రుదుర్భేద్యముగాను, శత్రువులకు కొంత దూరముగాను చాల దూర దృష్టితో రాజేంద్రుడు నిర్మించుకొనెను.

కర్ణాటక చాళుక్యులు ఊరకుండలేదు. క్రీ. శ. 1031 లో రాజరాజనరేంద్రుని వేంగి నుండి, ఆతని సవతి తల్లి కుమారుడు, విష్ణువర్ధన విజయాదిత్యుడు, తఱిమి తాను వేంగికి రాజుగా పట్టాభిషేకము చేసికొనెను.



"రాజరాజాహ్వయోరాజా ద్వాదశాబ్ద మపాలయత్. తం రాజరాజనృపతిం నిర్ధాట్య భువః ప్రసహ్య విజయాదిత్యః విమలాదిత్య తనూజో తస్యద్వైమాతురోఽగ్రహీత్ రాజ్యమ్."

ఇది ఆకస్మిక కృత్యముకాదు. కర్ణాటకులు దూరదృష్టితో చేయుచుండిన సన్నాహముల యొక్క మొదటి ఫలితము. జగదేకమల్ల సింహుడు 1032 నుండి 1042 వరకు (జీవితాంతమున) పోట్లచెఱువను చోట నుండి, శైవులైన తన రాణుల యుద్బోధనచేత జైనమతమును వీడి శైవుడై, రాజ్యమును తన పెద్ద కుమారునికి త్రైలోక్యమల్లాహమల్ల బిరుదాంకితుడైన సోమేశ్వరునికి (శైవునికి) ఒప్పజెప్పి తాను ఆధ్యాత్మిక చింతనలో కాలము గడపుచుండెను. ఈ సోమేశ్వరుడు బాలుడుగాడు. 1044 ప్రాంతమున రణరంగధీరుడైన విక్రమాదిత్యుడీతని రెండవకుమారుడు. పదునెనిమిదేండ్లైనను పెద్దకుమారుని కుండియుండవా? 1044 - 16 = 1026 నాటికి తండ్రికి 25 ఏండ్లైన నుండవా? ఈతడే తుంగభద్రలో 1058 లో మునిగి ప్రాణత్యాగ మొనర్చిన వాడు 1058-1026=32. 25+32=57 సంవత్సరములగును. కాని అరువదిదాటిన వాడుగానే యుండవలెను. విష్ణువర్ధన విజయాదిత్యుడు తానీతనికి అంకకాడనియు కుమారుని వంటి వాడనియు చెప్పుకొని యుండుటచే 1033 నాటికే ముప్పదియైదేండ్ల వాడుగానైన నుండవలెను.

మఱియొకవిషయము విష్ణువర్ధన విజయాదిత్యుడు ఈ సోమేశ్వరుని ఆశ్రయించినవాడు. క్రీ. శ. 1001 కి తర్వాత జటాచోడభీముని రణమరణానంతరము జనించి గదా యుండవలెను. ఆతనికే 1033 నాటికి ముప్పదియైన నుండిన సోమేశ్వరునికి ఇంకను ఎక్కువయే యుండును.

పైగా, అంతవరకు దేశమందు జైనమతమును రాజులును, వారి ననుసరించి జనులును ఆదరించుచుండిరి. చోళులు మొదట శైవులైరి.

రాజరాజ, రాజేంద్ర, వీరరాజేంద్ర శబ్దములకు శివుడనియే యర్థము. విమలాదిత్యుడు మాత్రము జైనుడు, కాని శివుని పూజింపనివాడు గాడు. అతనిరాణి కుందవ్వ, బాల్యమందే కుమారుని రాజరాజనరేంద్రుని శైవమతమందు ప్రవేశపెట్టి, రాజరాజని తనతండ్రిపేరు పెట్టుకొనెను. అందుచేతనే రాజనరేంద్రుడు భారతములో.

"ఇవి యేను సతతంబునామెడ రం
బిష్టంబులై యుండు, బా
యవు; [1]భూదేవకులాభి తర్పణ మహీ
యః ప్రీతియు [2]భారత
శ్రవణాసక్తియుఁ [5]బార్వతీపతి పదా
బ్జధ్యాన పూజామహో
త్సవము [4]సంతతదానశీలతయు శ
[6]శ్వత్సాధుసాం గత్యము.

ఈ భారతశ్రవణాసక్తి కూడ బాల్యమందే ఏర్పడియుండును. తనకు "కులబ్రాహ్మణుడును అనురక్తుడును" బాల్యమునుండియు బహుశః సహచరుడునునైన నన్నయను నాడే ప్రార్థించి యుండును. కాలము అనుకూలించి రాలేదు. ఈ శైవమతము కర్ణాటకమునకును వ్యాపించినది. అదియు 1000 ప్రాంతమై యుండును. కర్ణాటక సోమేశ్వరుని తల్లి క్రీ. శ. 1000 లోనో అంతకుముందో శైవనామకరణము చేసి యుండవలెను. తర్వాత భర్తను శైవునిగా చేయుటకు అంతకాలము పట్టినది.

తండ్రి శివధ్యానపరుడై శివాచార్యులతో కాలము గడుపనారంభింపగా, కుమారుడు, రాజ్యవ్యవహారములకు పూనుకొని, తమ రాజధానీ నగరమును, పాత మాన్యఖేటమునుండి, పైకి కల్యాణకటకమని (నేటి బసవకల్యాణి) తాను క్రొత్తగా నిర్మించిన నగరమునకు మార్చుకొనెను. ఈ నగరమును ఇతడే నిర్మించుకొనెనని బిల్హణకవి విక్రమాంకదేవ చరిత్రయందు చెప్పియున్నాడు. శాసనములలో దీని ప్రథమప్రశంస క్రీ. శ. 1088 లో నున్నది. రాజేంద్రచోళుడు గంగై



కొండ చోళపురమును నిర్మించుకొన్నదానికి వెంటనే ఇది ప్రతి ధ్వని, ప్రతి ప్రయత్నమును. ఇది శత్రువులకు ఒకయడుగు దూరమును అగును.

మరల యుద్ధములు ప్రారంభమైనవి. ఈ ప్రయత్నములు క్రీ. శ. 1030 నుండియే ప్రారంభమైయుండవలెను. 1031 లో విష్ణువర్ధన విజయాదిత్యుడు రాజరాజనరేంద్రుని తరిమి వేంగిని గ్రహించెను. దీనికి ప్రతిగా రాజేంద్రచోళుని సైన్యములు, ముగ్గురు బ్రాహ్మణ దండనాయకుల నాయకత్వమున, వేంగి మీదికి బయలుదేరి, మొదట కర్ణాటక రాజ్యమున, నేటి హైదరాబాదునందలి కొల్లిపాకవరకును పోయి, అటనుండి వేంగికి వచ్చి, బెజవాడకు సమీపమున (నేటి కైకలూరు తాలూకా) కలిదిండిగ్రామమున ఘోర యుద్ధముచేసి, కర్ణాటక సైన్యమును తఱిమి రాజరాజనరేంద్రుని వేంగియందు పునః ప్రతిష్ఠితుని చేసినవి. కాని యుద్ధమున ఆ ముగ్గురు సేనాధిపతులును మరణించినందువలన రాజరాజనరేంద్రుడు వారిపేరిట మూడు శివాలయములను గట్టించెను. ఈ శాసనమున తారీఖు లేదు గాని 1035 గాని ఆ తర్వాత 1044 లో రాజేంద్రచోళుని మరణమునకు ముందు గాని జరిగియుండవలెను.

కాని ఎక్కువకాలము రాజనరేంద్రుడు వేంగియందుండినట్లు లేదు. క్రీ. శ. 1042 లో కర్ణాటక చక్రవర్తి జగదేకమల్లుడును 1044 తమిళ చక్రవర్తి రాజేంద్రుడును గతింపగా వారి కుమారులు రణమందు ప్రవేశించిరి. యుద్ధమునకు వారి చేతులు పురపురలాడుచుండినవి. 1044 లో కర్ణాటకులు వేంగిని జయించిరి. కన్నడ మంత్రి, దండనాయకుడు, శోభనరసు అనునతడు ఈ సందర్భమున, పొల్గొని 'వేంగీపుర వరేశ్వర' బిరుదమును దాల్చెను. 1047 లో కర్ణాటక యువరాజు, తర్వాతి రెండవ సోమేశ్వరుడు, 'వేంగీపుర వరేశ్వర' బిరుదమును దాల్చెను. 1044-1047 నడుమ వేంగి, వదలక కన్నడిగుల యధీనమందే యుండినదో లేక నడుమ రాజనరేంద్రుడు ఆక్రమించి మరల పోగొట్టుకొనెనో తెలియదు గాని, ఇరువురు భిన్నకాలములందు ఈ బిరుదును ధరించుటచేత ఇవి రెండు దండయాత్రలుగా నుండిన వేమో. దాక్షా

రామమందు కర్ణాటకుల శాసనములు ఎక్కువగా నున్నవి. రాజరాజ నరేంద్రునికి మరల తిరువయ్యారు ప్రయాణము తప్పలేదు. క్రీ. శ. 1050 లో రాజనరేంద్రుడు తన రాణి అమ్మంగదేవితో తిరువయ్యారులో నుండి అచటి దేవునికి మూడువందల రాజరాజ వేంగి మాడలను (నాణెములను) దానముచేసినట్లు శాసనము కలదు.

ఇప్పటికి రాజరాజనరేంద్రునికి వేంగినుండి ఇది నాలుగవ ఉద్వాసనము. తన కొడుకు తన మామలును, బావమరదుండ్రును విరామము లేక పోరాడుచుండినను కర్ణాటకుల సహాయముపొందిన తనతమ్ముని దే పై చేయిగా నున్నది. ఆతడును మహాపరాక్రమశాలి. తాత జటా చోడ భీముడెంతటి మహావీరుడో అంతటివాడు. తమిళశాసనము లీతనిని 'నిడువాళ్ తెలుంగు విచ్చయ్యర్' "పెద్ద కత్తితో పోరాడు విచ్చయ్య (విజయాదిత్యుడు)" అని వర్ణించి యున్నవి. ఈ క్లిష్ట పరిస్థితిలో రాజరాజనరేంద్రుడును నన్నయ్యభట్టును ఆలోచించి ఏదో ఉపాయము పన్ని వేంగీరాజ్యమును సంపాదించినట్లున్నది. ఎట్లనగా-

క్రీ. శ. 1051 నుండి ఒక ఆశ్చర్యకరమైన మార్పు కనబడుచున్నది. కర్ణాటక పశ్చిమ చాళుక్యులేమో వేంగిని వదల లేదు. వారి యధికారము చెల్లుచునే యున్నది. కాని రాజరాజనరేంద్రుని యాస్థానమున త్రైలోక్యమల్ల దేవర ప్రధాని నారాయణభట్టు" అని యొక రాజకీయుడు కనబడుచున్నాడు. రాజరాజనరేంద్రు డితనికి నందంపూండి యగ్రహారమును ఆతని పాండిత్యాతిశయములకు ఇచ్చినాడు. శాసనమును రచించిన కవియా, నన్నయ్యభట్టు. ఈ నారాయణభట్టే నన్నయకు భారతరచనకు తోడ్పడిన వాడని శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు కూడ ప్రతిపాదించియున్నారు. ముందే గ్రహించితిమి.

చూడగా నన్నయ నీతిప్రయోగమే యిదియని స్పష్టము. ఎన్నిమార్లు రాజ్యమును శత్రువులకు వదలి తంజావూరు తిరువయ్యారులకు పోవుట ? ఎంతదూరము ? నడుమ ఎందరు శత్రువులు. చోళ చాళుక్య యుద్ధములకు ఒక నిలుపుదల కనబడలేదు. తమిళులును



రాజనీతిని ప్రయోగించుచునే యుండిరి. వీరికి ఉత్తరమున పరమార ముంజమహీపతియు, తర్వాత భోజరాజును మిత్రులై, లెక్కలేని పర్యాయములు ఎత్తి వచ్చి కర్ణాటకులను, వారు వేంగి మీదికి దాడి పోయినప్పుడంతయు వెనుకనుండి పొడుచుచుండిరి. రణరంగము వేంగీ కర్ణాటక చోళరాజ్యములతో నిలువక క్రమముగా దక్షిణాపథమంతయు వ్యాపించి యావద్భారతదేశ పర్యాప్త మయ్యెను. రాజేంద్రచోళుడు గంగవరకు పోవుట వట్టి పుణ్యమునకుగాదనియు, రాజనీతియనియు, శత్రువులతో చేరిన శత్రువులను దండించి, కొందరు మిత్రులతో మైత్రిని దృఢ మొనర్చుకొనుటకే యనియు గ్రహించితిమి. మాళవ భోజుడేగాక, సౌరాష్ట్ర చాళుక్యులును, కాళంజరులు చేదీశులును, కావ్యకుబ్జులు, వంగకోసలులును పాల్గొనుచుండిరి. నన్నయ్య రాజరాజ నరేంద్రులకు ఈ యుద్ధములు తాము బ్రదికియుండగా ఒక నిర్ణయనకు రావని తెలిసిపోయినది. కాబట్టి నన్నయ్య తన సహాధ్యాయిసాయముతో, కర్ణాటక మహామాత్యుడు వాననమధుసూదనయ్య సాయము పొంది, విష్ణువర్ధన విజయాదిత్యునికి, వయసులో రాజనరేంద్రునికన్న చాల చిన్నవానికి, అచ్చటనే కర్ణాటక సామ్రాజ్యమున నొళంబపాడి మండల (అనంతపూరుజిల్లా ప్రాంతము) ప్రభుత్వ మిప్పించి, రాజనరేంద్రుని మరల, జీవిత చరమకాలమున, వేంగియందుంచుటకు మార్గము కల్పించినాడు.

పైగా నన్నయ్య, రాజనరేంద్రునిలో ఎంత మార్పు తెప్పించినాడనగా, పశ్చిమ చాళుక్య బిరుదావళిని అనుకరింప జేసినాడు. (ఈ విషయము కీ. శే. శ్రీ నేలటూరు వెంకటరమణయ్యగా తమ "పల్లవులు - చాళుక్యులు" అను గ్రంథమున చక్కగ విశదీకరించినారు) కల్యాణీ చాళుక్యులు "సమస్త భువనాశ్రయ" బిరుదమును ధరించెడివారు. వేంగివారిది "సర్వలోకాశ్రయ" మఱియొకటి "సత్యాశ్రయకుల శేఖర" అనునది. భారతమందు నన్నయ ఈ మార్గానుసరించి, రాజనరేంద్రుడు కల్యాణీ చాళుక్యులకు బంధువు, జ్ఞాతి

వారు రెండవపులకేశి వంశస్థులైన వీరు కుబ్జ విష్ణువర్ధనుని వంశస్థులు అన్న సోదరభావమును చూపెను. ఇది రాజనరేంద్రునికి ఆత్మార్థము మంచిదే గాని, మూడు తరములుగా బంధువులుగా నుండిన చోళరాజులకు తీరని యవమానకారణమైనది.

ఈ మార్పులకును, నన్నయ్య రాజనీతి ప్రయోగమునకును ప్రబలమైన కారణము క్రీ. శ. 1048, 1049, 50 సంవత్సరముల నడుమ జరిగిన యుద్ధములే. వేంగిని చోళులు సాధింపజాలరని నిశ్చయించి, మరల వారెత్తివచ్చిన, వెనుకనుండి ఎత్తి వచ్చు పరాక్రమవంతుని భోజరాజును హతమార్చినగాని తమకు వెనుక పోటు తప్పదని కర్ణాటక చక్రవర్తి సోమేశ్వరుడు మాళవము మీదికి దాడి వెడలెను. నూటముప్పదిమంది రాజులు కలసి భోజుని తుదముట్టించిరని మేరుతుంగాచార్యుని ప్రబంధ చింతామణి చెప్పుచున్నది. భోజుడును తన రాజధానిని తాను క్రొత్తగా కట్టుకొన్న ధారానగరమునకు, చోళచాళుక్యులవలెనే, మార్చుకొని యుండెను. సోమేశ్వరుని సామంతులే చాలమంది రాజులుండిరి. వీరిలో హొయసలులులు, కాకతీయులు, కొంకణులు మొదలగు వారెందరో, ఈ భోజుని బంధువులు చోళసైన్యములో చేరియుండిరి. కర్ణాటకులు మాళవ దేశమును పాడుపెట్టి, ఉజ్జయిని, మాండ్వా, ఉదయపూరు మున్నగు ఊళ్లు తగులబెట్టిరి. భోజుని ధారానగరములో ముట్టడించిరి. ఎనుబదియేండ్ల వృద్ధుడు, శతాధిక గీర్వాణ గ్రంథకర్త, సారస్వత పోషకుడు, మహాకవి, శత్రువులకు లొంగక యుద్ధముచేయుచునే కోటలోపల అతిసారభేదులచేత మరణించెను. అంతశత్రువులు ధారానగరమును హతమార్చి, దోపిడి పంచుకొనుటలో జగడమాడుకొనిరి.

ఈ దండయాత్రలసంగతి చోళులు గ్రహించి, చాళుక్యులు మాళవమున నుండగా కర్ణాటకమును ధ్వంస మొనర్చి, కల్యాణనగరమునే కాల్చి వేసిరి. అది ఎఱిగిన చాళుక్యసేనాపతి, పులకేశియనునతడు, కాంచీనగరమును కాల్చెను. ఇంతలో కర్ణాటకులు మరల తమ దేశమునకు వచ్చి చోళులను తఱిమిరి. ఇదంతయు క్రీ. శ. 1050 నాటి



సంభవములు. ఇట్టి విషమ పరిస్థితిలో వేంగిమీద నన్నయ్య రాజరాజనరేంద్రుల కిక నెక్కడి ఆశలు. తమకా వయసు మీరుచున్నది. అందుచేతనే నన్నయ్య పశ్చిమచాళుక్యలతో, వేంగీ చాళుక్యులకు మర్యాదగా సంధికుదిర్చినాడు. ఇక రాజధానీ నగరముగా బెజవాడగాని, కొల్లేరు వద్ద వేంగీపురముగాని పనికిరావని, గోదావరికి తూర్పున. శత్రువులకు దూరముగా రాజరాజనరేంద్రుని పేరిట రాజమహేంద్రపురము నిర్మింపజేసి అందు సుఖముగా నుండి భారతరచన చేసెను. ఇక పరవా లేదురా! అబ్బ! ఎంత ప్రాణమునకు వచ్చివదిరా యని నిట్టూర్చి యుండును. అమ్మ రాజరాజమహేంద్రుడు రాజమహేంద్రవరము నిర్మించినాడనునది పొరపాటు.

క్రీ. శ, 1051-52 నందంపూండి అగ్రహారమును నన్నయ్యనారాయణభట్టునకు ఇప్పించినది, పాండిత్యమాత్రమునకుగాదు రాజకీయమునకు, ఈ మార్పు చోళరాజులకు ఎంతయవమానకరమైనదనగా, చోళచక్రవర్తి రాజాధిరాజు, తమ్ముడు రాజేంద్రచోళుని తోడ్కొని, బ్రహ్మాండమైన సైన్యముతో రాయచూరు, కృష్ణా తుంగభద్రాతీర దేశములను ధ్వంసముచేయుచు దండయాత్ర సాగించెను. కొప్పం అనుచోట ఘోరసంగ్రామము పొసగెను. సముద్రముల వంటి సైన్యములు తారసిల్లి, ఇరు వాగులలో ఎందరో మరణింపగా, తుదకు చోళరాజాధిరాజే ఏనుగుమీదినుండి పోరాడుచుండగా మరణించెను, వెంటనే తమ్ముడు రాజేంద్రుడు, రణరంగసుందే పట్టాభిషేకము చేసికొని, ఆ సమీపపు కొల్లాపురమున, మహారాష్ట్ర కొల్లాపురముగాదు, జయస్తంభమునాటి వెనుదిరిగి పోయెను. ఇదంతయు క్రీ. శ. 1054 నాటికి తుద ముట్టినవి. చోళులు వేంగి ఇక తమకు అసాధ్యమని మానుకొనిరి. మరల క్రీ. శ. 1063 లో వీర రాజేంద్రుడు తాకువరకు రాజనరేంద్రుని ఎవరును బాధింప లేదు.

అబ్బ! నన్నయ్యకు ఆంధ్రమహాభారత రచనకు ఇప్పుడు గదా అవకాశము దొరకినది. ఏ కాలమున, ఏ దుర్ముహూర్తమున సంకల్పించి

నాడోగాని, జీవితపు కడపటి ఏ డెనిమిది సంవత్సరములలోనే శాంతిగలిగి రచనావకాశము కలిగినది. అదియు అసమగ్రము. కాని వేంగియందు నారాయణభట్టు కూడ 1057 నుండి 1056 వరకు నుండినాడు. 1059 నన్నయ్య చివరితారీఖు. 1067 రాజనరేంద్రుని చివరి తారీఖు. కవి మరణమే రచన ఆగిపోవుటకు కారణమా లేక రాజకీయములా? కాని ఈ ఏడెనిమిదేండ్లు శత్రుభీతి పూర్తిగా లేనందున ఆ దర్శప్రాయమైన రచన చేయదలచి, కొంత నెమ్మదిగా వ్రాయుచుండినందువలన కాబోలు మూడు పర్వములతోనే ఆగిపోయియుండును రచన.

ఇచ్చట గ్రాహ్య విషయమేమనగా, నన్నయ్యకార్యముసాధించి కృతకృతుడై కావ్యరచన చేయగా, తిక్కనకార్య సాధన నిమిత్తమే చేసినాడు. పూర్తి భారతము వినిపించి, గణపతి సాయముతో మనుమసిద్ధికి రాజ్యమిప్పించి కృతకృతుడైనాడు. ఈ రెండు బాధలు లేనివాడు ఎఱ్ఱన, నన్నయ్య ననుకరించినాడు. ఆదికవి కీర్తి నన్నయ్య భట్టునకు దక్కినది.

వేదము వేంకటరాయశాస్త్రి

---

శ్రీ


తీర్థం శ్రీధరమూర్తి
తెలుగు పండితుడు.
ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయము,
విశ్వ విద్యాలయ భవనములు,
మదరాసు-5.


## నన్నయ - పంపలు, తులనాత్మక పరిశీలనము

పంపడు, నన్నయభట్టు ఇరువురును ప్రతిభా సముద్రులు, మహాకవులు. వీరు పరమపవిత్రమైన, పంచమవేదమని ప్రసిద్ధిగాంచిన వ్యాస భారతమును విభిన్నరీతులలో, దేశ భాషలలోనికి అనువదించి యున్నారు. ఇరువురును చాళుక్యరాజాస్థానమును అలంకరించిన కవి వరేణ్యులే. 1808

పంపకవి ఆదిపురాణము, విక్రమార్జున విజయము అను రెండు మహా ప్రబంధములను రచించి యున్నాడు. ఆదిపురాణములో ఆది తీర్థంకరుడైన వృషభస్వామి వైభవము విశేషముగ వర్ణింపబడి యున్నది. పంపకవి భారతమును విక్రమార్జునవిజయమని పేర్కొన్నాడు. కవి జైనుడు కాబట్టి భారతమును లౌకిక కావ్యముగ నిర్దేశించెను. కన్నడ సాహిత్యములో లభించు కావ్యములలో పంపభారతమే మొదటిది. కాబట్టి దీనికి ఆదికావ్యమని, వ్రాసిన కవికి ఆదికవి అని ప్రసిద్ధి. పంపకవికి కవితాగుణార్ణవ, సరస్వతీమణిహార ఇత్యాది బిరుదములు గలవు. పంపకవి వేములవాడ చాళుక్య వంశోద్భవుడైన రెండవ అరికేసరి యొక్క ఆస్థానకవి. రెండవ అరికేసరి క్రీ. శ. 980 సం॥లో రాజ్యము చేసినట్లు శాసనాధారములు కలవు. కావున పంపకవి ఆ కాలములో నుండినట్లు స్పష్టము.

11వ శతాబ్దములో రాజమహేంద్రవరమును రాజధానిగ చేసికొని వేంగీ దేశమును రాజరాజనరేంద్రుడు పరిపాలించెను. ఈ రాజు కాలము క్రీ. శ. 1053 అని నందంపూడి శాసనమువలన తెలియ వచ్చుచున్నది. కావున, రాజరాజనరేంద్రుని యాస్థానమందుండిన నన్నయభట్టు 11వ శతాబ్దమునకు చెందినవాడని చెప్పవచ్చు.

భారతరచనా విధానము :

పంప భారతమునకు వ్యాస భారతమే మూలము. అయినను, రచనా విధానములో నవ్యత కలదు. వ్యాస భారతములోని పర్వ విభాగములు కాని, ఉపాఖ్యానములుకాని, విస్తారమైన నీతి ధర్మ ప్రసంగములుకాని పంపభారతమున కానరావు. పంపభారతము 14 ఆశ్వాసముల పరిమితి గల, వీరరసప్రధానమైన, ఒక మహా కావ్యము. ఇందులో అష్టాదశవర్ణనలు కలవు. కథానాయకుడు ధర్మరాజు కాడు, అర్జునుడు. కురుపాండవుల యుద్ధానంతరము అర్జున పట్టాభిషేకముతో కథ ముగియుచున్నది.

నన్నయభట్టు రాజరాజనరేంద్రుని ప్రేరణచే మహాభారతమును వ్యాస భారతానుసారముగ అనువదించెను. ఇందు పర్వవిభాగము గలదు. ఉపాఖ్యానములు ఉల్లేఖింపబడియున్నవి. నీతి ధర్మములు విస్తారముగ వర్ణితములై 'తింటే గారెలు తినవలెను. వింటే భారతము వినవలెను' అను లోకోక్తికి దృష్టాంతముగా ఉన్నది. వ్యాసముని ప్రణీత భారతమందు నిరూపితములైన విషయములు మూలానుసారముగ గ్రహింపబడియున్నట్లు క్రిందిపద్యము వలన తెలియుచున్నది.

క. జననుత కృష్ణద్వైపా
యనమునివృషభాభిహిత మహాభారత బ
ద్ధ నిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తిమెయిన్ (ఆది 1-16)



పంపభారతరచనలో ఒక వైచిత్రి కలదు పంపకవికి తన ఆశ్రయదాతయైన అరికేసరిపై అపారమైన ప్రీతి. దానికి కారణము ఆ రాజు మహానాయక లక్షణాన్వితుడు, వీర శృంగారగుణాభిరాముడు. ఈ గుణములన్నియు తన కావ్యనాయకుడైన అర్జునునికి సరిపోవు చున్నవి. కాబట్టి, పంపకవి కృతిపతియైన అరికేసరికిని, కావ్యనాయకు డైన అర్జుననికిని అభేదముగాయించి కథను నడిపించి, కావ్యమునకు విక్రమార్జునవిజయము అను పేరు సార్థకముగావించియున్నాఁడు.

ఈ విధముగా కథను నడుపు సందర్భములో కొన్ని ఇబ్బందులు కలిగినవి. అర్జునుడు కుంతికి పుట్టెనని చెప్పవలసివచ్చినపుడు, కుంతికి గుణార్ణవుడు పుట్టెను అని చెప్పబడినది. 'గుణార్ణవుడు' అరికేసరి యొక్క బిరుదు. ఆ బిరుదు అర్జునునకు లేదు. ఒకవేళ దానికి మహా గుణశాలి అని అర్జునపరముగ అర్థముచేసినను, అభేదప్రతిపత్తివలన అరికేసరితల్లి కుంతి కానేరదు. 'చాళుక్యవంశోద్భవుడు' అనుబిరుదు అరికేసరికిచెల్లును కాని కురువంశోద్భవుడైన అర్జునునకెట్లు సరిపుచ్చ వచ్చును ? మరొక విషయము. పంపభారతములో ద్రౌపదికి భర్తలు ఐదుగురు కారు. అర్జునుడు ఒక్కడు మాత్రమే. ఇది జైన సంప్రదాయ మని విమర్శకులు భావించిరి. కాని, కారణము వేరే ఉన్నది. ద్రౌప దికి ఐదుగురు భర్తలు అని చెప్పినచో అర్జునునితో అభేదప్రతిపత్తిగల అరికేసరికి అన్యాయము కలుగును. అరికేసరిభార్యకు కూడ ఐదుగురు పతులు ఉన్నట్లు ప్రతీతి కల్గును. దానిని నివారించుటకే, కవి, ద్రౌపదిని అర్జునునికి ఒక్కనికే భార్యగ చెప్పవలసి వచ్చినది. ఈ మార్పువలన కథలో ప్రధానభాగములైన ద్యూతప్రసంగము, భీమునిశపథము, వనవాసాదికము అన్నియు వ్యర్థములగుచున్నవి.

క. బహుభాషల బహువిధముల
బహుజనములవలన వినుచు, భారత బద్ధ
స్పృహులగువారికి నెప్పుడు
బహుయాగంబుల ఫలంబు పరమార్థముగున్ (ఆది. 1-17)

Tel-1808



రాజరాజనరేంద్రుడు నన్నయభట్టుతో మహాభారతముయొక్క గొప్పదనమును వర్ణించు సందర్భములో ఉన్నదీ పద్యము. ఇందులో బహుభాషల బహువిధముల అను పదములవలన నన్నయభారతము కంటె ముందు, బహుభాషలలో వెలసిన భారతములలో పంపభారతము ఒకటి. నన్నయ స్వయముగా గాని లేక సహాధ్యాయి అయిన నారాయణభట్టు సహాయముతో గాని, పంపరచితములైన భారతమును, ఆదిపురాణమును పరిశీలించి ఉండవచ్చును. ప్రకృతము నన్నయభారతముపై పంపభారతప్రభావముకలదా ? అను ప్రశ్న మిక్కిలి కుతూహలజనకమై యున్నది. క్రింది ఉదాహరణములను పరిశీలించినచో పంపని పద్యముల యెత్తుగడలను, సమస్తపదములను నన్నయ ఎట్లు సంగ్రహించి యుండునది స్పష్టము కాగలదు.

నన్నయపై పంపకవి ప్రభావము :

1. సరళ తమాల తాల హరిచందన నందన భూజరాజియిం...

(పంప భా. 5-52)

సరళ తమాల తాల హరిచందన చంపక నారికేళ...

(ఆది ప. 8-74)

2. కురువృద్ధం...(పంప భా. 6-44)

కురువృద్ధుల్ గురు వృద్ధ బాంధవులు...సభా. ప. 2-33)

3. శ్రీ మచ్చళుక్య వంశ

వ్యోమామృత కిరణ...(పంప భా. 1-15)

శ్రీ మచ*ళుక్య వంశ శి

ఖామణి ..., (ఆది ప, 3-1)



4. సాల ప్రాంశు విశాల లోల నయనం ... పంప భా. 1-68)

సాల ప్రాంశు నిజోజ్జ్వలత్కవచు ... (ఆది ప. 6-31)

5. 1) సకల క్ష్మాచర ఖేచరాంచిత మహా మాణిక్యగాణిక్య...

(ఆది. పు)

2) నర మాతంగ తురంగ సైన్య......(పంప భా. 12-135)

మద మాతంగ తురంగ కాంచన లసన్మాణిక్య గాణిక్య...

(సభా. ప. 1-18)

6. హరి హర హిరణ్యగర్భరు...(పంప భా. 1-82)

ఆద్యులైన హరి హర హిరణ్యగర్భ...(ఆది ప. 1-2)

7. ఏలా లవంగ లవల్

వేలా వన భూమియొల్...(ఆది పు. 13-2)

వేలా వనములను నవ రమ్యములగు

వేలా వనములను...(ఆది ప. 8-137)

పంపనన్నయల యాశయములు :

పంపకవికి నన్నయభట్టునకు వ్యాసముని ప్రణీతభారతముపై గల యభిప్రాయములు, అనువదించుటలో వారి యాశయములు విభిన్నములై కనుపట్టుచున్నవి.

మ. చలదాళ్ దుర్యోధనం, నన్నిరొయొళినతనయం, గండినొళ్
భీమసేనం,

బలదొళ్ మద్రేశ, నత్యున్నతియొళమరసింధూద్భవం,
చాపవిద్యా
బలదొళ్ కుంభోద్భవం, సాహనద మహిమెయొళ్ ఫల్గునం,
ధర్మదొళ్ ని
ర్మలచిత్తం ధర్మపుత్రం, మిగిలివర్గళ నీ భారతం లోకపూజ్యం.
(పంప భా. 14-64)

పట్టుదలలో దుర్యోధనుడు, సత్యపరిపాలనమున కర్ణుడు, వీరమున భీమసేనుడు, బలమున శల్యుడు. మహత్త్వమున భీష్ముడు, విలువిద్యలో ద్రోణుడు, పరాక్రమమున పార్థుడు, ధర్మమున ధర్మమున ధర్మజుడు వీరివలన భారతము లోకపూజ్యమైనది.

మ. అమితాఖ్యాపక శాఖలం బొలిచి వేదార్థమలచ్ఛాయమై
సుమహోద్వర్గ చతుష్క పుష్ప వితతిన్ శోభిల్లి, కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థఫలమై ద్వైపాయనోద్యాన జా
త మహాభారత పారిజాత మమరున్ ధాత్రీసుర ప్రార్థ్యమై.
(ఆది 1-66)

వేదవ్యాసముని యొక నందనవనము. అందొక పారిజాత (భారత) పాదపము ప్రాదుర్భవించినది. ఉపాఖ్యానములు దాని కొమ్మలు. వేద విహిత విషయములు దానినీడ. ధర్మాది చతుర్విధ పురుషార్థములు కుసుమములు. కృష్ణార్జునుల యుత్తమగుణములు ఫలములు.

లోకపూజ్యతను గడించిన పంపభారతములో శ్రీ కృష్ణునికి స్థానమే కానరాదు. కారణము.

" బెళగువె నిల్లి లౌకికమ " (వంప భా. 14-60. తన యీ భారతమును కేవల లౌకికకావ్యమని పంపకవి తలంచెను. ఇక నన్నయ మహాభారతమును మోక్షాఖ్యఫలప్రదమగు పారిజాతమని సంభావించెను



ఇక, భారతానువాద కార్యమునుగూర్చి పంప నన్నయలు క్రింది విధముగా దా కొనిరి.

ఉ. వ్యాస మునీంద్ర రుంద్ర వచనామృత వార్థియ నీసువెం
(పంప భా. 1-13)

చ. అమలిన తారకా సముదయంబుల నెన్నను సర్వ వేద శా
స్త్రముల యశేషపారము ముదంబునఁ బొందను బుద్ధిబాహు వి
క్రమమున దుర్గమార్థ జల గౌరవ భారత భారతీ సము
ద్రముఁ దఱియంగ నీదను విధాత్రునకైనను నేరఁ బోలునేఁ.
(ఆది ప. 1-19)

దుర్గమార్థములచే అగాధమైన భారత సముద్రము బ్రహ్మకైన నీదుటకు అసాధ్యమైనది. ఇక నా వంటివానికి చెప్పనేల ! అని యర్థాపత్తి. నన్నయపలుకులలో నయము, వినయము కనుపట్టుచున్నవి. పంపడు వ్యాసమునీంద్రులయొక్క గంభీర వాక్యముల నెడి సుధాసముద్రమును సునాయాసముగా నీదగలనని బాహాటముగ చాటుకొనెను. దానికి తగినట్లుగా తన భారతమును మూడు నెలలో ముగించినట్లు గ్రంథాంతమున తెలియజేసియున్నాడు.

" ......ఒందు మూరు తిం
గళొళె సమాప్తియాదుదనె బణ్ణిసిదం గుణార్ణవం.
(పంప భా. 14-60)

పంప నన్నయల చిత్తవృత్తులు వారి రచనలయందే కాక యాశ్వాసాంతగద్యములందును ప్రతిబింబితములై యున్నవి.

" ఇదు వివిధ విబుధజన వినుత, జన పదాంభోజ వరప్రసా
దోత్పన్న ప్రసన్న గంభీర వచనరచన, చతుర కవితాగుణార్ణవ
విరచితమప్ప విక్రమార్జున విజయదొళ్ "......(పంప భా.)
ఇది సకల సుకవిజన వినుత నన్నయభట్ట ప్రణీతంబైన
శ్రీ మహాభారతమునందు"...(నన్నయ)

వివిధ విబుధజన వినుత, సకల సుకవిజన వినుత అని పంప నన్నయలకు గల విశేషణములు సమానార్థకబోధకములయి యున్నవి.

చ. లలితపదం బ్రసన్న కవితాగుణ మిల్లదె పూణ్దుపేళ్దె బె
ళ్గళ కృతి బంధముం......... (పంప భా. 1-12)

ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కవితార్థయుక్తి లో
నారసి మేలునా, నితరు లక్షరరమ్యత నాదరింప, నా
నా రుచిరార్థ సూక్తినిధి........(ఆది ప. 1-26)

పంపడు పేర్కొన్న "లలిత పదప్రయోగము, ప్రసన్న కవితా గుణము" అను కవితాగుణములు నన్నయపద్యములో "ప్రసన్న కథా కవితార్థయుక్తి, అక్షరరమ్యత" అని యక్షరరూపమున పరిణమించి యున్నవి.

## పంప నన్నయల అనువాద వైఖరి :

పంపడు భారతానువాదపద్ధతిలో కొన్ని చోటుల స్వతంత్రించి కొన్ని మార్పులను గావించియున్నాడు. నన్నయ మూల విధేయముగా ఆంధ్రీకరించి యున్నాడు. ఉదాహరణముగా - ధర్మరాజు భీష్మాచార్యుల యనుమతిపడసి రాజసూయయాగాంతమున శ్రీ కృష్ణునకు అగ్రపూజ చేయును. అపుడు శిశుపాలు నాక్షేపించి, కృష్ణుని నిందించి, తుదకు అతనిచే నిహతుడగును.

ఈ సందర్భమును వ్యాసభారతమును ఇట్లున్నది :

శ్లో. సమ్మోహయిత్వా భగవాన్ చక్రం దివ్యం సమాదధే,
చిచ్ఛేద చ సునీథస్య శిరః చక్రేణ సంయుగే
స పపాత మహాబాహుః వజ్రాహత ఇవాచలః,
తతః చేదిపతేః దేహాత్ తేజోఽగ్ర్యం దదృశుః నృపాః.
(సభా. అధ్యా 46. శ్లో. 50,51)



## పంపని యనువాదము :

క. ముళిదు తనకర్ష్య మెత్తిద
తళిగెయొ ళిదె తిఱె తెఱదు తలె పఱిదాగళ్
కళకళసి నగుతు మిర్దుతు
తళిగెయ మేలసుర వనటి దే నచ్చరియో ! (6-64)

కృష్ణుడు కోపములో తన కర్ష్యముపట్టిన తట్టతో శిశుపాలుని తలను తెగ వ్రేసెను. అపుడు శిశుపాలుని ఖండితశిరము కలకల నవ్వుచు ఆ పళ్లెరమున పడియుండెను. ఏ మాశ్చర్య ! అని భావము.

## నన్నయగారి యాంధ్రీకరణము :

చ. అని శిశుపాలుఁ డొండొకట నప్రియముల్ వారిఁ బల్కుచున్నచో
నవలశిఖాళి దూల, దనుజాంతకచక్రము, రాజచక్ర మె
ల్లను భయమంద, మూర్ధవికలంబుగ నప్పుడు వేసెఁ, జేసినం
దనుతనువున్ బృహద్రుధిరధారలు బోరన మీఁది కొల్కఁగన్.

ఉ. ప్రల్లతమేది, యిట్లు శిశుపాలుఁడు వజ్రహతాద్రి తుల్యుఁడై
త్రెళ్లుడు, వానిదైన పృథుదేహము దెల్వాడి తేజ మంబరం
బెల్ల వెలుంగ వచ్చి పరమేశ్వరుదేహము సొచ్చె, విస్మయో
త్ఫుల్ల విశాలనేత్రులయి భూపతులెల్లను జూచుచుండఁగన్.
(సభా 2-69)

కృష్ణుడు దివ్యచక్రముచే శిశుపాలునిశిరమును భేధించెను. అపుడు శిశుపాలుడు వజ్రాపాతిచే తెగి పడిన పర్వతమువలె కనుపట్టెను. మూలభారతమందలి యింత భావము ఉదాత్త శైలీ విన్యాసముగల నన్నయపద్యములలో గలదు. పంపనికృష్ణుడు చక్రమును ధరింపక, చేతిలోనున్న పళ్లెరముతోడనె కార్యమును పూర్తి చేసెను. పైగా పళ్లెరమున శిశుపాలునితల నవ్వుచునుండునట్లు ఒక చిత్రమైన కల్పనము గావించెను.

ఛందోరీతుయి :

పంపడు తన భారతములో చంపకోత్పలిమాలలను, మత్తేభ శార్దూలవిక్రీడిత వృత్తములను, కందపద్యములను, విశేషముగ వాడి యున్నాడు. పైగా స్రగ్ధర, మహాస్రగ్ధర, తరళ, పృథ్వి, హరి ప్లుత, ఖచరప్లుత, హరిణీ, శిఖరిణీ. మాలిని, ద్రుతవిలంబిత, మందాక్రాంత యను విశేష వృత్తములును గలవు. ఒరియక్కర (మహాక్కర), అక్కర, ఉత్సాహ యను దేశీయచ్ఛందములును గలవు. మత్తకోకిల మల్లికామాల యని, చంద్రకళ ఖచరప్లుమని అథవన్యమని పేర్కొలబడి యున్నది. తేటగీతి, యాటవెలది, సీసము, తరువోజ ఇత్యాదులు కన్నడ భారతమున కానరావు. కన్నడ పద్యములలో ప్రాస గలదు. యతిలేదు.

నన్నయభట్టు భారతభాగములో - చంపకోత్పల శార్దూల మత్తేభవిక్రీడితములను, కంద గీత సీస తరువోజలను, తరలము, తోటకము, మత్తకోకిల, మాలిని, పృథ్వి, వసంతతిలక, మానిని, కవిరాజ విరాజితము, ద్రుతవిలంబితము, స్రగ్ధర, మహాస్రగ్ధర, లయగ్రాహి, పద్మకము, స్వాగతము, అంబురుహము, రథోద్ధతము, మణిభూషణము- ఇత్యాది విశేష వృత్తములను, ఉత్సాహ, మధ్యాక్కర దండకములను కూడ వాడి తన ఛందః పరిజ్ఞానమును వెల్లడించి యున్నాడు.

ఆంధ్రుడా ? కర్ణాటుడా ?

పంపకవి యాంధ్రుడనియు, అతని మాతృభాష తెలుగనియు భావించుట కదకాశము కలదు. నేడాంధ్రప్రదేశ్ లోని వేములవాడ పంపకవి నివాసస్థానమై యుండుటయు, పంపకవిసోదరుడగు జినవల్లభుడు వ్రాసి వేయించిన గంగాధరశాసనములో తెలుగుపద్యము లుండుటయు పంపకవి యాంధ్రుడనుటకు గల ప్రధాన కారణములు.

ఇక నన్నయ. నన్ని - అయ నన్నయ. నన్ని పదము తెలుగులో లేదు. నన్ని పదమునకు సత్యము మొదలుగా అనేకార్థములు



కన్నడమున గలవు. "నన్నియొళినతనయం" (భార. 14-64) అని పంపని ప్రయోగము. నన్నయ, చాళుక్యుల రాజధానియైన కల్యాణపుర ప్రాంతమునుండి వేంగికి వచ్చియుండునని కొందరి తలంపు. ఇదమిత్థమ్మని నిర్ణయించుటకు తగిన సాధనసంపత్తి లేదు. ఆ నాడు వేంగికి చేరిన వేములవాడ ద్విభాషాప్రాంతమై యుండినట్లు తెలియుచున్నది. అపుడు ఆంధ్రులు కర్ణాటులు నీర క్షీర న్యాయమున వర్తించుచుండిరి. ప్రాంతీయ విభేదములు ఆనాడంతగా లేవు.

పంపడు తెలుగు కావ్యకర్తయా ?

ఆంధ్రప్రదేశ్ లో కరీంనగర్ జిల్లాకు చెందిన వేములవాడ పంపకవి జన్మస్థలము. చాళుక్యరాజ్యము ప్రత్యేకముగా విభజింపబడక పూర్వము, వేములవాడ చాళుక్యరాజులకు రాజధాని. అక్కడ ఆంధ్ర కర్ణాటులకు సన్నిహిత సంబంధములుండినవి. పైగా పంపమహాకవి తెలుగులో కూడ గొప్పకవి యనుటకు ఆధారమున్నది. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రబంధరత్నావళి అను సంకలనగ్రంథమును ప్రకటించియున్నారు. అందులో పద్మకవి రచించిన జినేంద్రపురాణము నుండి ఒక సీసపద్యము ఉదాహరింపబడినవి. అది యమక శోభితమై కనుపట్టుచున్నది.

సీ. సా. హరినిలయంబును హరినిలయంబును
విషధిరాధ్యంబును విషధరాధ్య.........

కన్నడ శాసనములో తెలుగు పద్యము :

పద్మప శబ్దభవము పంప. పంపనిగురువు జినేంద్రుడను జైనముని. ఆ గురువుగొప్పదనమును వర్ణించు తెలుగు కావ్యమే జినేంద్రపురాణము. పంపమహాకవికి జినవల్లభుడను తమ్ముడు కలడు. అతడు వేయించిన యొక శాసనము, ఇటీవల ఆంధ్రప్రదేశ్ లోని కరీంనగర్ జిల్లాకు చెందిన గంగాధరం అనే గ్రామంవద్ద లభించినది. అందలి పద్య గద్యములను రచించినవాడు పంపకవియొక్క తమ్ముడు జినవల్లభుడు. అతడు

సంస్కృతాంధ్ర కర్ణాట భాషలలో శాసనపద్యములను వ్రాసి యున్నాడు. పంపమహాకవి అరికేసరిరాజువలన ధర్మపురమనే అగ్రహారమును పడసిన సంగతిని పేర్కొనియున్నాడు. ఈ శాసనము 10 శతాబ్దమునాటిది. కనుక, నన్నయకంటె సుమారు నూరుసంవత్సరములకు పూర్వము రచియింపబడినది. అందలి యొక తెలుగు పద్యమిది.

క. * జినభవనము లెత్తించుట,
జినపూజల్ సేయుచుంట, జినమునులకు నె
త్తిన యన్న దాన మీవుట,
జినవల్లభు పోలగలరె జినధర్మపరుల్.

పంప నన్నయలు ప్రామాణిక కవులు :

పంపకవి కన్నడ సాహిత్యములోని రత్నత్రయములో ఆద్యుడు. నన్నయభట్టు తెలుగువాఙ్మయములో కవిత్రయములో మొదటివాడు. పంపకవి, నన్నయభట్టు ఇరువురును వేంగీదేశమందలి వైదికకుటుంబమునకు చెందినవారు. ఇరువురును చాళుక్యరాజాస్థానకవులు. ఆ రాజుల ప్రేరణచే వ్యాసభారతమును చంపూ పద్ధతిలో తమ దేశభాషలలో అనువదించినవారు. నన్నయకు వైదిక సంస్కృతిపై అభిమానము. పంపకవి జైనుడు కావున, అతని దృష్టిలో భారతము కేవలము లౌకిక కావ్యము. ఈ విధముగా పంప నన్నయల రచనలలో సామ్య వైషమ్యములు కొంతవరకు కనుపట్టుచున్నవి.

ఆంధ్ర కర్ణాటకులకు గల పరస్పర సంబంధము మరి యే రెండు భాషలవారికిని లేదు. ఆంధ్ర కర్ణాటుల ఆచారవ్యవహారములు, సాహితీ సంస్కృతులు ఒకే తీరులో ఉన్నవి. ఇప్పటికిని ఈ రెండు భాషలకును లిపి సామ్యము స్థిరమై యున్నది. కాబట్టి కొంత పరిశ్రమ చేసినచో, ఆంధ్రులు కర్ణాటభాషను, కర్ణాటులు ఆంధ్రభాషనునేర్చుకొని ఉభయసాహిత్యఫలములను ఆస్వాదించి ఆనందింపవచ్చును.

---

* గంగాధర శాసనము ! శాసన సంపద – కన్నడ అధ్యయన పీఠ, కర్ణాటక – విశ్వవిద్యాలయ, ధారవాడ. 1974.



ఆ. కన్నడమ్ములోని కస్తూరి నెత్తావి,
తేట తెలుగులోని తియ్యందనము,
భారతముల నిడిన పంప నన్నయల
తరము లెన్ని చూడ దరమె నాకు ? (స్వీయము)

ఉపకృత గ్రంథములు :

1. పంపభారతం ఎంబ విక్రమార్జునవిజయం,
కన్నడ గ్రంథ మాలె,
మైసూరు విశ్వవిద్యాలయ,
మైసూరు, 1973.

2. పంప – ఒందు అధ్యయన,
సంపా : జి. ఎస్. శివరుద్రప్ప,
బెంగుళూరు విశ్వవిద్యాలయ,
బెంగుళూరు, 1974.

3. పంప – నన్నయ : ఒందు సమీక్షె,
శ్రీ కె. వెంకటరామప్ప,
కన్నడ అధ్యయన సంస్థె – 25,
మైసూరు విశ్వవిద్యాలయ,
మైసూరు, 1971.

4. మహాభారతము (సంస్కృతము), సం. 3.
సంపా : పి. పి. యస్. శాస్త్రి,
వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్,
మద్రాసు, 1932.

5. ఆంధ్ర మహాభారతము. సం. 1.
సంశోధిత ముద్రణము,
ఉస్మానియా విశ్వవిద్యాలయము,
హైదరాబాదు. 1968.

# నన్నయ వాగనుశాసనుడు

— జి. లలిత

ఆంధ్రమహాభారత కర్తగ, ఆదికవిగ, కవిత్రయంలో ఆద్యుడుగ ప్రసిద్ధికెక్కిన నన్నయ వాగనుశాసనుడుగ కూడ వినుతి కన్నాడు. ఒక ఇతిహాసరచయితకు కవికి, వాక్కును అను శాసించాడన్న ప్రసిద్ధి ఎలా కలిగిందో వితర్కించమని శీర్షిక అంతరార్థం కావచ్చు.

1. నన్నయ విరచిత భారతభాగంలో 'శబ్దశాసన' పదం నన్నయ పరంగ ఒకే ఒక మారు ప్రయుక్తం. తూర్పుచాళుక్యాధీశుడైన రాజరాజనరేంద్రుడు తన కులబ్రాహ్మణుడు, అనురక్తుడు, అవిరళ జపహోమ తత్పరుడు, విపుల శబ్దశాసనుడు అయిన నన్నపార్యుని వ్యాస భారతాన్ని ఆంధ్రీకరించమని అభ్యర్థిస్తాడు. ఈ సందర్భంలో నన్నయ శబ్దశాసనుడుగ మాత్రమే పేర్కొనబడ్డాడు. వాగనుశాసన పదం భారతంలో అప్రయుక్తం. కేవలం కవి అయిన వానిని శబ్దానుశాసనుడుగ లేక వాగశాసనుడుగ పరిగణించరు. వ్యాకర్తకు మాత్రమే ఈ విశేషణాలు వర్తించుతవి. కనుక నన్నయ వ్యాకర్తకా గలిగినపుడే ఈ పదాలు అన్వర్థాలు కాగలవు. నన్నయకు వైయాకరణునిగ గుర్తింపబడ్డాడా అన్నది పరిశీలనీయము.

2. జక్కన తన విక్రమార్కచరిత్రలో (1375-1404.) పూర్వకవులను సంస్మరించిన సందర్భంలో నన్నయను "శబ్దశాసనవరేణ్యునిగ సన్మానించాడు. జక్కన అనంతరం ఆంధ్రకవి రామయ్య (క్రీ. శ. 1500 ప్రాంతం) తన విష్ణుకాంచీ మాహాత్మ్య కావ్యపీఠికలో "శబ్దశాసన కావ్యసంఘట్టన క్రమానందిత బుధవర్యు నన్నపార్యు" అని ప్రస్తుతించాడు. కాకమాని గంగాధరకవి తన బాల భారతంలో (క్రీ. శ. 1560 పూర్వుడు) "శబ్దార్థ రస విశారదు. శాబ్దికమూర్ధన్యు



శబ్దశాసన బిరుదున్...నన్నపార్యుఁ దలంతున్" అని కీర్తించాడు. శబ్దశాసన శబ్దాన్ని బిరుదుగ ప్రయోగించిన ప్రథముడు గంగాధరకవి.

"వాగనుశాసనుఁడు" అన్న పదాన్ని నన్నయ పరంగ వాడిన ఆద్యుడు రామరాజభూషణుడు. "మహిమున్వాగనుశాసనుండు సృజియింపన్' [వసుచరిత్ర 1-10] అని బహుళాంధ్రోక్తిని వాగనుశాసనుడు సృజియించినట్లు పేర్కొన్నాడు. ఆ పిదప

"వాచామాంధ్రమయీనాం యః ప్రవక్తాప్రథమోఽభవత్
ఆచార్యం తం కవీంద్రాణాం, వందే వాగనుశాసనమ్'

1808 [బాలసరస్వతీయము]

అని బాలసరస్వతి (క్రీ. శ. 1600) నన్నయను వాగనుశాసకునిగ, ప్రథమాచార్యునిగ నుతించాడు. నన్నయ వ్యాకర్త అని. అతడే ఆంధ్రశబ్దచింతామణి అన్న వ్యాకరణ కర్త అని ప్రకటించిన ప్రథముడు బాలసరస్వతి. అతనికి లభించిన ఆంధ్ర శబ్దచింతామణి పరిచ్ఛేదాంతగద్యలో "ఇతి శ్రీ సకలభాషా వాగనుశాసన నన్నయభట్ట విరచితాన్ధ్రశబ్దచిన్తామణౌ..." అని వాగనుశాసన శబ్దం నన్నయకు బిరుదంగ ప్రయుక్తమైనది.

3. ఆంధ్రశబ్దచింతామణి వెలుగులోనికి వచ్చిన తరువాత 17, 18, 19 శతాబ్దాలలోని లాక్షణికులు, కవులు నన్నయను వ్యాకర్తగ గుర్తించి, శబ్దశాసన, వాగనుశాసన పదద్వయాన్ని ఆయనకు బిరుదుగ ప్రయోగించారు. అప్పకవి [17-వ శ. అప్పకవీయము 1-53; 56] వార్తాకవి రఘునాథయ్య [క్రీ. శ. 17 శ. లక్షణదీపిక- అముద్రితము] అహోబలుడు [క్రీ. శ. 1707. కవిశిరోభూషణము. 38, 64] కూచిమంచి తిమ్మకవి [క్రీ. శ. 18 వ శ. లక్షణసార సంగ్రహము. i-88, 100, 234, 364, 419] అడిదము సూరకవి [క్రీ. శ. 18-వ శ. కవిసంశయవిచ్ఛేదము 1-9, 24] పొత్తపి వేంకటరమణకవి [క్రీ. శ. 18 లక్షణ

శిరోమణి 4-వ అధికారము] ఈ ఉభయ పదాలను నన్నయ పరంగ తమ గ్రంథాలలో వాడారు. ఆంధ్రశబ్దచింతామణికి ప్రత్యేకంగ సంస్కృత వ్యాఖ్యానాన్ని సంతరించిన మంచెల్ల వాసుదేవుడు [క్రీ. శ. 18-వ శ.] "మద్వాగనుశాసన బిరుదాంచిత నన్నయభట్టారక విరచితః" [వాసుదేవవృత్తి.] అని వాగనుశాసన పదాన్ని బిరుదనామంగ గ్రహించాడు.

18 వ శతాబ్దినాటికి నన్నయ వాగనుశాసనుడుగ సుస్థిరుడయ్యాడు. ఆనాటి వారు ఆంధ్రశబ్దచింతామణికర్త నన్నయయే అని నిస్సందేహంగ నమ్మారు. అందువలననే వీర భూపాలీయ కర్త మాదయమాత్యుడు [18 శ. అముద్రితము] "సూత్రకారుఁడగు వాగనుశాసనుని నాశ్రయించెదఁ" "నన్నపార్యుని వరసూత్ర ఫక్కిక" అని నన్నయను వ్యాకర్తగ వినుతించాడు.

19-వ శతాబ్దికి చెందిన కిమ్మూరి నరసింహరాజు (కవిజనాంజనము) అల్లమరాజు రామకృష్ణకవి (రామకృష్ణీయము) సువర్ణ సుబ్రహ్మణ్యము (ఆంధ్ర వ్యాకరణ దండాన్వయము) గచ్ఛద్వ్యాఖ్యాత ఆంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యానాలను సమకూర్చి, నన్నయను తత్కర్తగ పేర్కొన్నారు.

పిండిప్రోలు లక్ష్మణకవి (1770-1840) తన రావణదమ్మీయ ద్వ్యర్థి కావ్యంలో తన్ను వాగనుశాసనునికి పోల్చుకున్నాడు.

గీ॥ ఒనరు మద్వాక్కులం దెలుంగునకు బద్ధుఁ
డగును వాగనుశాసనుఁడైన నమ్ము. [2-59]

"నేను తెనుఁగు కవిత్వము చెప్పితినా, ఆంధ్ర వ్యాకరణకర్త. భారతాంధ్రీకరణము చేసినవాడునైన నన్నయభట్టు అంతటి వాఁడు సమ్మతించును" వ్యాఖ్యాత వివరణము.

చిన్నయసూరికి ఇంచుక పూర్వులైన వేదం పట్టాభిరామశాస్త్రి [పట్టాభిరామ పండితీయము. 1825] పుదూరి సీతారామశాస్త్రి



[ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణము. 1834] రావిపాటి గురుమూర్తి శాస్త్రి [ఆంధ్ర వ్యాకరణము. 1836] నన్నయభట్టీయాన్నే[1] ఆధారంగ గాని తమ వ్యాకరణాలు రచించారు. వీరు నన్నయను వాగనుశాసనుడుగ అంగీకరించారు. చిన్నయసూరికూడ వీరితో ఏకీభవించాడు.

విదేశీయులలో ఏ. డి. క్యాంబెల్ (A. D. Campbell) ఆంధ్రశబ్దచింతామణిని నన్నయకృతంగ గుర్తించి, దానిని అనుసరిస్తూ ఇంగ్లీషు భాషలో "A Grammar of the Teloogoo Language" (1816) అన్న వ్యాకరణాన్ని సంతరించాడు. నన్నయ భట్టీయము. తద్వ్యాఖ్యానాలు తన వ్యాకరణానికి ఉపజీవ్యగ్రంథాలని తెలిపాడు.

సి. పి. బ్రౌన్ (C. P. Brown) నన్నయభట్టీయాన్ని రెండు మారులు ఇంగ్లీషులోనికి అనువదించాడు. "The Telugu Grammar Written by Nannaya Bhatt, which Stands first in this volume is deservedly celebrated for its great learning and exactitude' [D. 1236. ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము, మదరాసు.] అని ప్రశంసించాడు.

పైన పేర్కొన్న స్వదేశీయ, విదేశీయ పండితప్రకాండులందరూ ఏకగ్రీవంగ నన్నయ వాగనుశాసనుడని, అతడే ఆంధ్ర శబ్దచింతామణి కర్త అని వాకొన్నారు.

4. 20-వ శతాబ్దిలోని అర్వాచీన ఆంధ్రవాఙ్మయ చరిత్రకారులు తమ పూర్వుల అభిప్రాయంతో ఏకీభవించలేకపోయారు. ప్రాచీనులలో "చాలమందికి చారిత్రకదృష్టిగాని, శాస్త్రీయమైన ఆలోచనాధోరణిగాని మృగ్యంగా ఉండేది"[1] అని ఆధునిక పరిశోధకుల తీర్పు. అర్వాచీనులలో కొందరు నన్నయ వాగనుశాసన బిరుదాన్ని, ఆంధ్రశబ్ద

1. ఆంధ్రశబ్ద చింతామణికి నన్నయభట్టీయము, శబ్దానుశాసనము, ప్రక్రియాకౌముది, ఆంధ్రకౌముది, ఆంధ్ర వ్యాకరణము అని నామాంతరాలు,

చింతామణి కర్తృత్వాన్ని శంకించారు. ఈ వివాదానికి ఆద్యుడు కందుకూరి వీరేశలింగం. ఆయనకు అనుసరించి చిలుకూరి నారాయణ రావు, చాగంటి శేషయ్య, వడ్లమూడి గోపాలకృష్ణయ్య, శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి నన్నయ వాగనుశాసనత్వాన్ని నిరాకరించారు. ఇటీవల డా॥ అమరేశం రాజేశ్వర శర్మగారు [ఆంధ్ర వ్యాకరణ వికాసము] డా॥ ఆకురాతి పున్నారావుగారు [సంస్కృతంలోని ప్రసిద్ధాంధ్ర వ్యాకరణాలు] విషయాన్ని పర్యాప్తమైన పరిశోధనలు జరిపి, తత్ఫలితాలను ఉద్గ్రంథాలుగ ప్రకటించారు. వీరు నన్నయ చింతామణి కర్త కాదు అన్న అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

వజ్ఝల చిన సీతారామస్వామిశాస్త్రి, ఉద్యోతినీ కర్త పారనంది రామశాస్త్రి పై వారల వాదాలను పూర్వపక్షంచేసి నన్నయ వాగనుశాసనత్వాన్ని స్థిరీకరించిన ప్రధానులు.

ఇలా ఆధునికులలో విభిన్నాభిప్రాయాలు ఏర్పడినవి వీరిలో చింతామణికర్త నన్నయయే అని నిశ్చయంగ నిరూపించిన వారు ఉన్నారు. కానేరడని నిరూఢిగ నిర్ణయించిన వారు ఉన్నారు. ఈ ఇరు వర్గాలలోని వివాదాల సహేతుకత, సమంజసత సమాలోచనీయాలు.

5. ఈ క్రిందివి, చింతామణి నన్నయకృతంకాదని, నన్నయ వాగనుశాసకుడు కానేరడని నిరూపింప ప్రయత్నించిన అద్యతన పరిశోధకులు చూపిన కొన్ని ముఖ్య కారణాలు :

(i) నన్నయానంతరం ఆఱునూఱేండ్లకు బాలసరస్వతికి చింతామణి ప్రతిలభించిన తీరు నన్నయ కర్తృత్వాన్ని శంకించడానికి ప్రధానకారణం. బాలసరస్వతికి, అప్పకవికి వచ్చిన కలలు, అందలి కథలు విశ్వాసార్హంగ లేవు.

1. డా॥ పున్నారావు, ఆకురాతి : సంస్కృతంలోని ప్రసిద్ధాంధ్ర వ్యాకరణాలు. పుట. 21. 1982.



(ii) కేతన తన ఆంధ్రభాషాభూషణమే తెలుగులో తొలి వ్యాకరణంగ చెప్పుకోవడం.

(iii) చింతామణిలోని లక్షణాలకు భారతం లక్ష్యగ్రంథంగ లేకపోవడం.

(iv) చింతామణి విశ్లేషించిన భాషకు, నన్నయ నాటి భాషకు భేదముండడం.

(v) చింతామణిలోని కొన్ని సూత్రాలకు సూత్రకర్తయే వివరిస్తే గాని తెలియకపోవడం.

(vi) చింతామణిలోని ప్రాకృత సూత్రానుకరణ.

(vii) బాలసరస్వతి కన్న పూర్వలాక్షణికు లెవ్వరూ ప్రత్యక్షంగ నన్నయను వాగనుశాసనుడని గాని, చింతామణి కర్త అని గాని పేర్కొనక పోవడం.

(viii) బాలసరస్వతీయ, అప్పకవీయ చింతామణులకున్న పాఠభేదాలు.

(ix) బిరుదం ఒక్క రూపంలోనే ఉండాలి. విభిన్నంగ ఉండకూడదు.

(x) భారతగద్యలో నన్నయ ఈ విషయాన్ని ప్రస్తావించక పోవడం.

ఈ ఉపపత్తులు ఎంత బలవత్తరాలైనవో పరిశోధనీయాలు.

6. (i) కలలు రావడం అసహజమేమీ కాదు. ఆ కలల్లో అవాస్తవికమైనవి కనుపించడమూ అసత్యం కాదు. కొన్ని సందర్భాలలో ఆ కలలు నెరవేరడమూ కట్టు కథలు కావు. ఆంధ్ర

వాఙ్మయంలో కలలు కన్న కవులు లేకపోలేదు. తిక్కనకు హరిహరనాథుడు స్వప్నంలో సాక్షాత్కరించి భారతాన్ని ఆంధ్రీకరించమని ఆదేశించాడు. తిక్కన స్వప్నవృత్తాంతాన్ని కట్టుకథగ కొట్టి పారవేయడం లేదు. ఒక గ్రంథానికి మాహాత్మ్యాన్ని ఆపాదించడానికి ఇటువంటివి చెప్పడం హైందవ సంప్రదాయం. చింతామణి లభించిన ఉదంతం ఇప్పటివారికి ఎంత ఆశ్చర్యాన్ని కలిగించిందో, అప్పటి వాడైన బాలసరస్వతికి కూడ అంతే ఆశ్చర్యాన్ని కలిగించింది :

ఉ. ఏమిమహాద్భుతం బిది హరీ ! హరి ! యెక్కడి యాంధ్రశబ్దచిం
తామణి ఫక్కి ? యెక్కడి మతంగనగంబు ? యుగాది సంభవుం
డైమనిచన్న నన్నయ మహాకవి యెవ్వఁడు ? సిద్ధుఁ డెవ్వఁ ? డ
హా ! మదగణ్యపుణ్యసముదగ్రతఁ జేరుతెఁ గాదె యిన్నియున్.

మ. ఇలఁబ్రజ్ఞాధికులౌ కవుల్ మునువులేరే ! వారు వ్యాఖ్యానక
ర్తలుగానోపరె ; పెక్కు వత్సరము లంతర్భూతమైయున్న యీ
తెలుఁగు న్వ్యాకరణంబు నా కొసఁగెఁ బ్రీతిన్ డీకఁ గావింపుమం
చలసిద్ధుండు మదిష్టదేవత విరూపాక్షుండు నిక్కంబుగన్.

[బాలసరస్వతీయము - పీఠిక - 45,]

కల్పితకథలతో ప్రజలను వంచించాలన్న దురుద్దేశం బాలసరస్వతికి లేదు. వందలాదియేండ్లు అంతర్భూతంగ, అసూర్యంపశ్యంగ ఉన్న గ్రంథాలు నేడు వెలుగులోనికి వస్తున్నవి. ఆయా తాళపత్రప్రతుల్ని సేకరించి, సవరించి, ప్రకటించిన వారే వాటికర్తలనడం యుక్తి సహం కాదు. కౌటిల్యుని అర్థశాస్త్రం క్రీస్తుకుపూర్వమో లేక ప్రథమశతాబ్దికో చెందినది. అది ముఖస్థంగనే చెలామణి అవుతూ వచ్చింది. ఇటీవలి వరకు దాని ప్రతిని చూచినవారు లేరు. దాని ప్రతి ప్రప్రథమంగ 1909 లో కర్ణాటక రాష్ట్రంలో లభించి, ప్రకటింపబడింది.



కౌటిల్యుడు ఉత్తర హిందూదేశవాసి. ఉత్తరాదిలో ఆ ప్రతులు లభించలేదు. ఎంతో గాలించగ ప్రథమప్రతి తరువాత కేరళలో, తమిళనాడులో రెండు ప్రత్యంతరాలు దొరికినవి. [The Artha Sastra of Kautilya. Part I. with the commentary Srimula of T. Ganapati Sastri 1924. Introduction] ఇప్పటికీ ఇటువంటి సంభవిస్తూనే ఉన్నవి. వెల్లంకి తాతంభట్టు 'కవి చింతామణి' క్రీ. శ. 1500 సం. లో రచింపబడినా అది 1982 లో గాని ముద్రణకు నోచుకో లేదు. అది ప్రకటింపబడేవరకు అందులో అయిదవ అధికార మున్నదని విజ్ఞలోకానికి తెలియదు. ఈ 600 ఏండ్లు అజ్ఞాతంగ ఉన్న ఈ గణాధికారం ఇప్పుడు విజ్ఞాతం ఎలా అయినది ? కవి చింతామణి పరిష్కర్తలైన శ్రీరావూరి దొరస్వామి శర్మగారు దాని సృష్టికర్తలనాలా ? కనుక ఆఱు నూఱేండ్లు అదృశ్యంగ ఉన్న ఆంధ్రశబ్ద చింతామణి హఠాత్తుగ దృశ్యమానం కావడంలో అసంభావ్యమేమీ లేదు.

ii కేతన తన ఆంధ్రభాషాభూషణమే తొలి తెలుగు వ్యాకరణం అన్నాడు.

క. మున్ను తెనుఁగునకు లక్షణ
మెన్నడు నెవ్వరును జెప్పరేఁ జెప్పెదవి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయభట్టాది కవిజనంబుల కరుణన్.

తే. సంస్కృతప్రాకృతాది లక్షణముఁ జెప్పి
తెనుఁగునకు లక్షణముఁ జెప్పకునికి యెల్ల
గవిజనంబుల నేరమిగాదు నన్ను
ధన్యుఁగావింపఁ దలఁచిన తలఁపుగాని.

[ఆంధ్రభాషాభూషణము - ప. 6, 7.]

ఈ మాటలాధారంగ కేతన ఆది వ్యాకర్త. అయితే 1670 ప్రాంతాలలో ఆంధ్రకౌముది రచించిన గణపవరపు వేంకటకవి :

సీ॥ శ్రీకరమ్ముగను సంస్కృతమునకును బ్రాకృ
తమునకుఁ గల లక్షణములు చెప్పి
తెనుఁగున నా విధమ్మున లక్షణముచేయ
రాకున్కియదియు నేరంబుగాదు
తొల్లిటి సుకవుల కెల్లను నను ధన్యు
గావించు తలఁపింతె గానియనుచు
ఇల మున్ను తెనుఁగున నెవ్వా రెఱుంగని
యాంధ్రకౌముదియను నట్టికృతిని
సీసమాలికగాఁగఁ జేసితినిపుడు...

[ఆంధ్రకౌముది. పుట. 1.]

అని కేతనను యథాతథంగ అనుకరించాడు. వేంకటకవి చెప్పిన దానిని బట్టి ఆంధ్రకౌముది తెలుగుకు తొలి వ్యాకరణం కావాలి.

కేతన వాక్యాలనుబట్టి చింతామణి కేతనకు తరువాతిది అయినట్లే, వేంకటకవి మాటలననుసరించి ప్రాచీన లక్షణ గ్రంథాలన్నీ ఆతని తరువాతవి కావలసి వస్తుంది. ఈ నిర్ణయం సముచితం కాదు.

(iii) చింతామణి లక్షణాలకు భారతం లక్ష్యగ్రంథమేనని నిరూపింప బూనిన పారనంది రామశాస్త్రి తమ ఉద్ద్యోతినిలో ప్రతి సూత్రానికీ భారతలక్ష్యాలను ప్రదర్శించారు. దానిలో కూడ నెరసులను వెదకినవారు లేకపోలేదు.

ఇక్కడ ఒక విషయం గమనార్హం. లక్షణకర్త అయినప్పటికీ కవి స్వతంత్రుడు. భావావేశంలో ఆవిర్భవించే కవితాప్రవాహాన్ని అడ్డుకునే ఆనకట్టలేదు. ప్రాచీనాంధ్ర లాక్షణికులందరూ ఇంచుమించు కావ్యకర్తలే. కేతన దశకుమార చరిత్రలో ఆయన ఆంధ్రభాషాభూషణానికి లొంగని ప్రయోగాలున్నవి. అలాగే అహోబలుని కాళిందీకన్యాపరిణయం, కూచిమంచి తిమ్మకవి రసికజన మనోభిరామము. వారు చెప్పిన లక్షణానికి విరుద్ధంగ లక్ష్యగ్రంథం ఉంటే అది అలక్షణకర్తృకృతం కాదు అన్నసూత్రాన్ని అన్వయించితే పై వ్యాకర్తలెవ్వరూ



తమ వ్యాకరణాలు వ్రాయలేదని నిర్ణయించాలి. ఈ విషయాన్ని పరిశీలించిన శ్రీపాద పాపయ్యశాస్త్రిగారు "ఇద్దాన లక్ష్యలక్షణ గ్రంథముల నొక్క కవి రచించినప్పుడు రెండింటిఁ బరస్పర విరోధమున్నంతమాత్రమున నా గ్రంథము లొక్కరు రచియింప లేదను నూహ నిరాకరము." (కాళిందీకన్యాపరిణయము. పీఠిక. పుట. xiii,] అని తీర్పు చెప్పారు.

భారతము, చింతామణి రెండును నన్నయకృతాలే అని యీ క్రింది రెండు లక్ష్యాలు నిరూపిస్తవి.

(i) సంస్కృత హలంతపదాలు తత్సమాలయ్యే విధానాన్ని తెలుపుతూ చింతామణి రెండు సూత్రాలను విధించింది. "ద్విత్వోత్వే సర్వ హలాం హ్రస్వాత్." [ఆం. శ. చిం. హలం. సూ. 2] ఈ విషయాన్ని భాషాభూషణం కూడ ఇంతే స్పష్టంగ కాకపోయినా ఓ విధంగ పేర్కొన్నది. "దిక్పదము నకుఁ గుత్తుకఁ దెలియు దిక్కు." (ప. 41). చింతామణి మరొక లక్షణాన్ని నిర్దేశించింది. "ద్విత్వంతు దీర్ఘతో బహుళమ్." [ఆం. శ. చిం. హం. సూ. 3.] దీర్ఘంబు మీఁది హల్లునకు ద్విత్వఁబు బహుళంబుగా నగు. [బాల వ్యా. తత్స. సూ. 68.] దీనికి లక్ష్యం "వాకు" దీనిని ప్రప్రథమంగ ప్రయోగించినవాడు నన్నయ. ఇది చాల విరళ ప్రయోగం. "లోకనింద్యమగు నర్థము నీ వాకునకుఁ దెచ్చుటుచితమె."

[భారతము. ఆది. 30, 130.]

ఇది ప్రాసస్థాన నిబద్ధ నిర్ధారక ప్రయోగం. ఈ లక్షణం భాషాభూషణాదుల్లో లేదు.

(3) సంబుద్ధి డుజునకు ప్లుతాదేశాన్ని గురించిన ప్రసక్తి భాషాభూషణాదుల్లో లేనేలేదు. "డుజతౌతు న ప్లుతస్స్యాత్సం బుద్ధావిత్యూతాం విదుః కేచిత్ [ఆం. శ. చిం. అజం. సూ. 46]

ఉదంత సంస్కృత నామంబు మీఁది సంబుద్ధి డుజ్జునకు నూకారంబు ప్లుతం బాదేశంబు విభాషనగు. [బాల. వ్యా. తత్స. సూ. 35.] "జరత్కారూ శి జగన్మాన్యయికన్యాభిక్షఁ బరిగ్రహింపుము. జరత్కారున్ మదీయానుజన్." [భారతము. ఆది. 2 ; 152] అన్నది నన్నయ ప్రయోగం. ఇట్టిది మరెవరూ ప్రయోగించలేదు.

(iv) నన్నయనాటి భాషనుగురించి ఆ నాటి కావ్యసంపదను గురించి మనం తెలుసుకోడానికి ఉపలబ్ధ ఆధారాలు అత్యల్పం. నన్నయ నాటి శాసనాలు కతిపయం [150 కి మించి లేవు.] కావ్యాలు మృగ్యం. ఈ స్వల్పాధారాలతో ఆ నాటి భాషాస్వరూపాన్ని ఈ నాటి కోవిదులు కొంతవరకు ఊహిస్తున్నారు. కొందరు భావిస్తున్నట్లిది కృత్యాది అవస్థ మాత్రంకాదనిపిస్తుంది. నన్నయ భారతంలో రాజరాజనరేంద్రుని ఆస్థానాన్ని వర్ణించాడు. "అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులును, భారతరామాయణానేక పురాణప్రవీణులైన పౌరాణికులును, మృదుమధుర రసభావ భాసుర నవార్థవచన రచనా విశారదులయిన మహాకవులును." ఆదిగాగల విద్వజ్జనులు పరివేష్టించిన సభ అది. ఇందరు సాహిత్యవేత్తలున్నపుడు ఎంతో సారస్వతం వెల్లివిరిసి ఉండాలి. అదంతా కేవలం సంస్కృత ప్రాకృత భాషలకే పరిమితమై ఉండదు. తెలుగులోనూ మహాకావ్యాలు ఉండినవి. ఆ కావ్య సంపదనంతా పరికింపకుండానే ఆ నాటి భాషను చింతామణి అను శాసించలేదనడం యుక్తం కాదు. శాసన విషయాలు చాలవరకు దాన విషయాలు. లేక రాజస్తుతులు. వానిలోని భాష చాల పరిమితం. తెలుగు ప్రాచీన స్థితిని గురించి పరిశోధించిన డా॥ తూమాటి దోణప్పగారి అభిప్రాయమిది : "ధర్మం రాజానుమతం కాబట్టి ఆ నాటి పాలకుల ఆశ్రయంలోని కవి పండితులు దేశభాషలకు



పట్టం గట్టారు. శాస్త్ర చర్చలూ, సాహిత్య గోష్ఠులూ, దేశభాషలముఖంగా ప్రవర్తిల్లి రసవత్తరాలయిన మౌలిక కావ్యాలనేకం రచింపబడ్డాయి. గీర్వాణవాణీ రచనల స్థాయికి దీటురాగల లాక్షణిక వాఙ్మయం ఎంతో వర్ధిల్లింది. ఆ పూర్వ యుగాలలో జైన బౌద్ధమత ప్రచారకు లయిన విద్వత్కవులు తెలుగులో సృష్టించిన సాహిత్యం కొన్ని కారణాల వల్ల నష్టమయిపోయియుండ వచ్చునన్న కొందరి అభిప్రాయం తోసి రాజనరానిది. ఏది యేమైనా ఆ నాటి తెలుగు సాహిత్య సంపద మనదాకా సాగిరాలేదు. అందుచేత ఆ నాటి భాషా స్వరూప నిరూపణం అరగొరగా, అసమగ్రంగా ఉండక తప్పదు." [స్రవంతి. ఆగస్టు 1932 పుట. 33.] అవిజ్ఞాతమైన ఆ యుగపు భాషకు చింతామణి కొలబద్దగ గ్రహించటం సబబు కాదు.

(v) సూత్రకర్త తప్ప తదితరులెవ్వరూ వివరింపలేని సూత్రాలు చింతామణిలో కొన్ని ఉన్నవి. కనుక వాటిని వ్యాఖ్యానించిన బాలసరస్వతియే చింతామణి కర్త కావాలి అని సిద్ధాంతం. ఈ సూత్రాన్ని అన్వయించితే పాణినీయాన్ని వార్తికకారుడైన వరరుచి, భాష్యకారుడైన పతంజలి రచించి ఉండాలి. ప్రతి వ్యాకరణంలోను క్లిష్టమైన లక్షణాలుంటవి. "వానునకున్ వంతుండును, మానునకును మంతుడును గ్రమంబుననగు." అన్న ఆంధ్రభాషాభూషణసూత్రం వివరణ సాపేక్షం. భాషా భూషణానికి దివ్యప్రభా వివరణము సంతరించిన దేవినేని సూరయ్య వ్యాకర్త అని నిర్ణయించవచ్చునా? పద్యాంధ్ర వ్యాకరణాలలోను వ్యాఖ్యానాన్ని అపేక్షించే ఘట్టాలు పెక్కులు. సూత్రాన్ని వివరించినంతమాత్రాన కర్తృత్వాన్ని అంటగట్టడం యుక్తిసహంగ లేదు.

(vi) చింతామణిలో ప్రాకృత వ్యాకరణ సూత్రానుకరణ మున్నది. అయితే అదియే ప్రాకృతవ్యాకరణాన్ని అనుసరించిన దనడంలో

ఏకాభిప్రాయం లేదు. 13 వ శతాబ్దికి చెందిన త్రివిక్రమ వ్యాకరణ మని డా॥ ఆకురాతి పున్నారావుగారు [సంస్కృతం లోని ప్రసిద్ధ వ్యాకరణాలు పుట. 235.] ; త్రివిక్రమునికి పూర్వుడైన వాల్మీకి వ్యాకరణమని డా॥ అమరేశం రాజేశ్వరశర్మగారు [ఆంధ్ర వ్యాకరణ వికాసం ప్ర. భా.] అభిప్రాయపడ్డారు. కేతన నాటికే ఆంధ్రభాషలో ప్రాకృత వ్యాకరణాలు ప్రసిద్ధాలని తెలుస్తుంది. "సంస్కృత ప్రాకృతాది లక్షణముఁ జెప్పి తెలుఁగునకు లక్షణము" చెప్పలేదని కదా కేతన పిర్యాదు ? కనుక 11-వ శతాబ్దికి చెందిన ఏ ప్రాకృత వ్యాకరణాన్నయినా చింతామణి కర్త అనుసరించి ఉండవచ్చు. క్రీ. శ. 1250 సం. ప్రాంతానికి చెందిన అథర్వణుని త్రిలింగశబ్దానుశాసనమున "జీవనుస్వారస్య" వంటి ప్రాకృత వ్యాకరణ సూత్రాలు ఉన్నవి. అముద్రిత గ్రంథ పరిశీలన వలన మరికొన్ని నూతనాంశాలు వెలుగులోనికి వచ్చే అవకాశాలున్నవి.

ఆంధ్రశబ్దచింతామణి నన్నయకృతంకాదని, బాలసరస్వతిదే కావచ్చునన్న వాదాన్ని లేవదీసిన కందుకూరి వీరేశలింగం తమ కవులచరిత్రలో సులక్షణసారాన్ని గురించి వివరిస్తూ "ఇపుడుముద్రితమై యున్న సులక్షణసారమునకును నాయొద్దనున్న యముద్రిత పుస్తకమునకును మిక్కిలి వ్యత్యాసముకనబడుచున్నది." అని చెప్పిఁ అందులో ఆంధ్రశబ్దచింతామణి ఉదాహృతమయినట్లు పేర్కొన్నారు. [ఆం. క. చరిత్ర. ద్వి. భాగము. పుట. 304.] సులక్షణసారకర్త లింగము గుంటతిమ్మకవి క్రీ. శ. 1550 వాడు. బాలసరస్వతికి పూర్వుడు. ఇలా నూతులు తవ్వితే బేతాళాలు వెలికిరావచ్చు.

(vii) 16 వ శతాబ్దికి పూర్వమున్న లాక్షణికు లెవ్వరూ నన్నయను వాగనుశాసనుడని కాని, చింతామణి కర్త అని గాని పేర్కొనలేదు. ఇది నన్నయ విషయంలో మాత్రమే జరిగిన సంఘటన కాదు. దశకుమార చరిత్రను తిక్కనకు అంకితమిచ్చిన కేతన,



తను తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని ప్రస్తావించలేదు. నరస భూపాలీయకర్త విద్యానాథుని ప్రతాపరుద్రీయ లక్షణాలను యథాతథంగ అనువదించినప్పటికి నరసభూపాలీయమున ప్రతాపరుద్రుని ప్రసక్తి కానరాదు. అప్పకవి ఎంతో గొప్పకవి. అటువంటి అప్పకవి పేరున అనంతరిక ఛందఃకర్తలైన ఆనంద రంగకవిగాని, లక్షణమంజరీకర్త నైషధముతిమ్మకవిగాని పేర్కొనలేదు. మన కవులలో కొందరు స్వీయగ్రంథాలనే చెప్పుకోలేదు. తిక్కన తన నిర్వచనోత్తర రామాయణాన్ని గూర్చి భారతంలో ప్రస్తావించలేదు. పరిస్థితి ఇలా ఉన్నపుడు దీనినొక ప్రబలాధారంగ స్వీకరించలేము.

(vii) ఇక బాలసరస్వతీయ అప్పకవీయ చింతామణులలోని పాఠభేదాలు. ముద్రణాది సౌకర్యాలున్న ఈ కాలపుగ్రంథాలలోనూ తప్పొప్పుల పట్టికల ఆవశ్యకత ఏర్పడుతున్నది. ముద్రణ స్ఖాలిత్యాలవలన పాఠభేదాలు అర్థభేదాలు కూడ సంక్రమించడం సువిదితం. అటువంటప్పుడు ముఖస్థంగ ఆ నోట ఈ నోట చెలామణి అయిన గ్రంథాలలో పాఠభేదాలుండడం సహజం.

బాలసరస్వతికి అప్పకవికి మధ్య 50 సంవత్సరాల అంతరం మాత్రమే. ఈ కొద్దిపాటి వ్యవధిలో పాఠభేదాలు ఎలా ఏర్పడగలవని ప్రశ్న. పాణినీయంలో పాణిని ప్రవచన భేదంచేతనే పాఠాంతరాలు ఏర్పడినవి. పాణిని వేరు వేరు శిష్యగణానికి తన అష్టాధ్యాయిని బోధించినపుడు కొంచెం మార్పులు చేయడం వలన మూడు విధాలైన పాఠాలు ఏర్పడినవి. వ్యాకర్త జీవితకాలంలోనే అలా జరిగినప్పుడు యాభై ఏండ్ల కాల వ్యవధిలో పాఠ భేదాలురాకుండా ఉండగలవా ? అయితే ఈ వాదానికి చెందిన వర్గం తమకు సాధకంగ ఉన్నపాఠాలు నిక్షిప్తాలని, బాధకంగ ఉన్నవి ప్రక్షిప్తాలని వాదించడం హేతుసహం కాదు.

(ix) శబ్దశాసనుడు, వాగనుశాసనుడు అన్నవి విభిన్న పదాలని, బిరుదమయితే ఒక్కరూపంలోనే ఉండాలని వాదన. నామ వాచకాలకు పర్యాయరూపాలుండడం సర్వ సాధారణం. "హస్తినాపురి, గజపురి, కరిపురి" అని వ్యవహరించితే ఆక్షేపణ లేదు. ఒకే ఊరిపేరు అలా మారుతుందా అన్న ప్రశ్న ఉదయించలేదు. శబ్దశాసనుడు, వాగను శాసనుడు కూడ నామ వాచకాలే. ఛందోనురోధం వలన శ్లేషనిర్బంధంచేత ఆ నాటి కవులు బిరుదునామాలను విభిన్నంగ చెప్పుకోవడం కనిపిస్తుంది. పల్నాటివీరచరిత్రలో శ్రీనాథుడు "కవిరాజరాజు"ను అని చెప్పుకున్నాడు. శృంగార నైషథంలో "కవిసార్వభౌముడ"ను అన్నాడు. వసుచరిత్ర ఆశ్వాసాంతగద్యలో "రామ రాజ భూషణుడు" అని ఉన్నా. పద్యంలో "రామభూషణకవి" [వసుచరిత్ర 1-17] అని. హరిశ్చంద్రనలోపాఖ్యానంలో "రామనృపభూషణాఖ్యసుకవి" [అవతారిక. ప. 12] అని విభిన్నంగ చెప్పుకోవడం జరిగింది. "రాజరాజు"కు "సార్వభౌముడు", "రాజు, నృపుడు" పర్యాయపదాలు. అలాగే శబ్దాన్ని అనుశాసించేవాడన్నా, వాక్కును అనుశాసించే వాడన్నా ఒక్కటే.

(x) భారత ఆశ్వాసాంతగద్యలో నన్నయ తన బిరుదును కాని, చింతామణి కృతినిగాని పేర్కొన లేదన్నది మరొక ఆక్షేపణ. నన్నయ భారత భాగ ఆశ్వాసాంతగద్యలను, తదనంతర కావ్య ప్రబంధాల ఆశ్వాసాంతగద్యలను పరిశీలించితే గద్యలలో ఏర్పడిన క్రమపరిణామం ద్యోతకమవుతుంది. నన్నయభారత ఆశ్వాసాంత గద్యలో స్వవిషయాలు ఏవీ చెప్పుకో లేదు. తన తల్లిదండ్రులు, గురువు, బిరుదులు, ఇతరకృతులు ఇత్యాది విశేషాలను తెలుపలేదు. ఆ గద్యలను ఆయన విషయ సూచి కలుగ ఉపయోగించి ఆశ్వాసగత విషయ నిర్దేశ మొనర్చాడు.



నన్నెచోడుడు కుమార సంభవగద్యలో గురువును, బిరుదును పేర్కొని, ఆశ్వాస విషయాన్ని సూచించలేదు. పాల్కురికి సోమన నన్నెచోడుని అనుగమించాడు. కాలక్రమంగ ఈ గద్యలలో వంశాన్ని, తల్లిదండ్రులను, తోబుట్టువులను, ఇష్ట దైవాన్ని, బిరుదులను, ఇతరకృతులను పేర్కొనడం పరిపాటి అయినది. పెద్దన మనుచరిత్ర గద్య: "...నందవరపుర వంశోత్తంస, శఠకోపతాపస ప్రసాదాసాదిత చతుర్విధ కవితామతల్లి, చొక్కయామాత్యపుత్ర".

బిరుదానికి ముందు విశేషణం ఉండరాదని మరొక అక్షేపణ "విపులశబ్దశాసనుడు" అన్నపుడు "విపుల" విశేషణం. కనుక ఇది బిరుదుకాదని వాదన. నన్నయ సీస పద్యాలను శ్రద్ధగా పరిశీలించి, పరిశోధించిన వారు గుర్తించిన దేమంటే నన్నయ సీస పద్యరచనలో ఒక నియమాన్ని పాటించాడు. సీసపాదాలలో యతిని వాడితే యతిని, ప్రాసయతిని వాడితే ప్రాస యతిని ఆద్యంతం కొనసాగిస్తాడు. ఈ రెంటి సాంకర్యం పొరపాటున కూడ సంక్రమించలేదు. ఈ సీస పాదంలో ప్రాసయతినియతి ఉన్నది, "జపహోమ... విపులశబ్ద" కనుక 'విపుల' శబ్దం ప్రాస నియమానికై ఉపయుక్తం.

7. చారిత్రక దృష్టితో, శాస్త్రీయంగ, భాషాక్రమ పరిణామంలో ఆస్తగలిగి పరిశీలించిచూపిన ఆధారాలు నిశిత పరీక్షకు నిలిచేవిగ లేవు. స్థాలీపులాకంగ ఈ ఉపపత్తులలోని దుర్బలతను చూపాను. ఇంతటి పరిశోధనలు జరిపిన వీ రెవ్వరూ ఒకటి రెండు ప్రశ్నలకు సంతృప్తి కరమైన సమాధానాలు ఇవ్వలేదు,

"ప్రయోజన మనుద్దిశ్య నమందోపి ప్రవర్తతే", అన్నది లోకనిరూఢి. బాలసరస్వతి మహోపాధ్యాయుడు ఏ ప్రయోజనాన్ని ఆశించి కేవలం 89 ఆర్యల చింతామణికి నన్నయ పేరు ఆపాదించాలి? ఆ ఆర్యల వ్యాఖ్యాత తానేనని స్పష్టంగ నిర్దేశించాడు. ఆదికవికున్న పసిద్ధిని ఆశించి, ప్రచారం నిమిత్తం చింతామణి కర్తృత్వాన్ని

నన్నయకు అంటగట్టాడన్నది విశ్వసనీయం కాదు. బాలసరస్వతియేసు గృహీతనామధేయుడు. మహామహోపాధ్యాయుడు. సకలకవితా స్వతంత్రభట్టారకుడు. యాదవరాఘవ పాండవీయ త్ర్యర్థి కావ్యకర్త. చంద్రికాపరిణయ సత్కృతిస్రష్టి. ప్రాకృత షడ్భాషా చంద్రికా వ్యాకర్త. ఇంతటి పాండితీ శౌండిర్యుడైన బాలసరస్వతికి మరొకరి పేరు అరువు తెచ్చుకోవలసిన ఆవశ్యకత లేదు.

మరొకవిషయం. కేతనయే తొలి తెనుగు వ్యాకర్త అయితే నన్నయ, శివకవులు, తిక్కన తెలుగునకు లక్షణం లేకుండానే తమ ఉద్గ్రంథ రచన కొనసాగించారా ? అది సాధ్యమా ?

3. పై చర్చవలన తేలిన సారాంశం నన్నయ వాగనుశాసనుడని ప్రాచీనుల ప్రగాఢవిశ్వాసం. కానేరడని కొందరు నవీనుల నిరూఢి అయిన నమ్మకం. ఇవి కాల ప్రభావం వలన ఏర్పడిన భిన్నదృక్పథాలు.

వాదన అన్నది ఓ శక్తి. దానితో ఏ విషయాన్ని అయినా ఎట్లయినా రూపుదిద్దవచ్చు. తెలివిగలవాడు, ఎదుటి వ్యక్తికన్న విషయాలు అధికంగ తెలిసినవాడు, ప్రత్యర్థులచేత ఏ విషయాన్నయినా ఒప్పించగలడు. అంతమాత్రాన సత్యం ఎన్నడూ అసత్యం కాదు. కనుక అలవరచుకోవలసినది సత్యదృష్టికాని, వాదనాచాతుర్యం కాదు.

"మురారేః తృతీయః పంథాః" అన్నట్లు ఈ ఇరుపక్షాల వారికి భిన్నంగ అన్నంభట్టు ఆంధ్రశబ్దచింతామణి కర్త అని ప్రతిపాదించబోవడం లేదు. అన్నంభట్టును చింతామణికర్తగ పేర్కొన్న కవులు, లాక్షణికులు ఉన్నారు.

1. ఉ. అన్నయభట్టు తిక్కన మహామహుం బోతన భాస్కరాఖ్యు.

ఆంధ్రీకవీంద్రుల నెంచి...



[నంబెరుమాళ్ళపురుష కారి కేశవయ్యప్రదీత దాశరథి చరిత్ర

1784-1819.......].

2. అన్నంభట్టారక వ్యాకరణే...[మండలక్ష్మీ నరసింహకవి త్రిలింగలక్షణ శాసనం.

3. సీ. ఆదిమసుకవి భీమనకు దండముపెట్టి యన్నయభట్టకు నర్థిమ్రొక్కి.

[రంగరాట్ఛందము. 1-9]

నన్నయ వ్యాకర్త కనుకే వాగనుశాసనుడు. కావ్యప్రబంధాలకున్న ప్రచారం శాస్త్రగ్రంథాలకు, వ్యాకరణ శాస్త్రాలకు ఉండదు. తెలుగుదేశం ఒక భాగంలో వెలువడిన గ్రంథాలు మరొక భాగానికి తెలియనికాలముండినది. నన్నయ వాగనుశాసనుడు కాడనే ఉపపత్తులు ఇప్పటికి బలవత్తరమైనవి కావు. నూతనాధారాలు వెలుగుకు వచ్చేంతవరకు నన్నయ వాగనుశాసనుడే.

శ్రీః

# నన్నయ భట్టారకుల వారి కవిత్వ తత్త్వము-

—తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు

ఈనాడు నన్నయ భట్టారకుల వారి జయంతి ఉత్సవమును నిర్వహించుచున్న కార్యనిర్వాహకులు నన్ను ఆయన కవిత్వతత్త్వ విచారణ చేయుమన్నారు.

కవిత్వ తత్త్వమనగా నేమి? తస్య భావః తత్త్వమ్. తచ్ఛబ్దమువలన చెప్పబడునది సచ్చిదానందమయిన పరమార్థమే. భావమనగా రూపమని అను సంధించుకొనవలెను. విశ్లేషణము చేయునప్పుడు సాక్షాత్తుగ - లేక పారంపరికముగ పరమార్థ తత్త్వ స్వరూపమునే వివేచింపవలయును.

'రసోవైసః' 'రసగ్ంహ్యే వాయం లబ్ధ్వాఽఽనందీభవతి' మొదలగు శ్రుతి ప్రమాణములచేత - ఆప్తవాక్యములచేత - కావ్యప్రతిపాద్య విషయాస్వాద జనితానందము బ్రహ్మానంద సబ్రహ్మచారి యని విద్వాంసులు కొందఱు అభిప్రాయపడుచుండగా - మరికొందఱు ఆలంకారికులది బ్రహ్మానంద అభిన్నమని, కావ్యప్రతిపాద్య విషయాస్వాద జనితానందమున కలుగుచున్నదిస్వాత్మదర్శనమని పలుకుచున్నారు. కావ్య ప్రకాశికాకారుడు మొదలగువారిదేగాక - ఆలంకారికశిరోమణియైన, ఆనందవర్ధనాచార్యుల వారు, ధ్వని ప్రస్థాన వ్యాఖ్యాతయైన - అభినవ గుప్తపాదాచార్యులవారు - యీ అభిన్నవాదముచేసినవారు. అయితే అక్కడ బ్రహ్మానందము నిత్యముకాగా యిక్కడ క్షణికము.

కావ్యప్రతిపాద్యవిషయాస్వాద జనితానందము బ్రహ్మానంద అభిన్నమగుటచేతనే కల్మషచిత్తులకది సాధ్యముకాదని - అట్టివారికి అనుభవమున కగుచున్నది. ఆభాసమాత్రమేనని చెప్పుచున్నారు అట్టి



ఆలంకారికులు కవిత్వమును సరస్వతీదేవియేయనుట పండితులందరకు అనుభవములోని విషయము. ఉత్తర రామచరిత నాటకంలో (ద్వితీయాంకంలో) భవభూతిమహాకవి సరస్వతీదేవి ఆకస్మికప్రత్యవభాసమైనదని చెప్పాడు.

ఆకస్మికప్రత్యవభాసాం దేవీం వాచమనతికర్ణరూపా
మానుష్టుభేన ఛందసా పరిచ్ఛిన్నా మభ్యుదైరయత్ ॥

భామహుడన్న ఆలంకారికుడు ఎవడో ఒక ప్రతిభావంతుని నుండే కావ్యము ఆవిర్భవిస్తుందనినాడు. "కావ్యంతుజాయతేజాతుకస్యచిత్ ప్రతిభావతః".

కావ్యమీమాంసయనున్న ఆలంకారిక గ్రంథమున దశవిధకవులను గురించి వివరించి వీరందరిలో 'కవిరాజు' అత్యున్నతుడని నిర్ణయించి "తే యదిజగతనపికతిపయే" (ఇట్టి కవిరాజులు లోకమున కొంతమంది మాత్రమే) అని రాజశేఖరుడనినాడు. ఆయన తరువాత మాటగా "మహాప్రబంధేతు కవిరేకోద్వౌ దుర్లభాస్త్రయః" (మహాప్రబంధకర్తలైన కవులు ఒకరో - యిద్దరో - మూడవవాడు దొరకడం దుర్లభం) అన్నాడు. ఈ మాట ఆంధ్ర మహాభారతమున కెంత చక్కగా సమన్వయించున్నది!

కావ్యప్రతిపాద్య విషయాస్వాదజనితానందము భావుకులకు స్వానుభవగోచరమైన విషయము. అందుచేతకాదనరానిది. అస్తి, సత్తు 'నాకృషిః కురుతేకావ్యమ్' మొదలగు శ్రుతి ప్రమాణముల చేత ఋషివలె క్రాంతదర్శియగు కవియొక్క చిదంశమగు ప్రతిభా ప్రభవమగుటచేతను - కార్యకారణముల కభిన్నత్వముండుటచేతను కావ్యానందమును 'చిత్' అని అంగీకరింపవలెను. అయితే దాని వాస్తవరూపము ఆనందము. కావున కావ్యప్రతిపాద్య విషయాస్వాద

జనితానందము సచ్చిదానందమే యన్నచో పరిహరణీయము కానే కాదు. రసఖండమైన మహాభారతమునందీ సకలమును దర్శనీయము.

కవితాతత్త్వమన్నదానిని రెండు విధములుగా విశ్లేషింప వచ్చును. కావ్య ప్రతిపాద్యవిషయము. కావ్యవస్తువును నిర్వహించు చున్న కవితాస్వరూపము. ఇవి రెండును భిన్నములుగానే సంభావన. మేఘము, మేఘములోని జలము - ఉపమానముకూడ చాలదీ భిన్నత్వ మును నిరూపణచేయుటకు. ఆలంకారికులీ భిన్నత్వమును వెల్లడించి — వస్తువును కవితావైఖరితో ప్రతిపాదించు పద్ధతులను ప్రభుసమ్మితమని, మిత్రసమ్మితమని, కాంతాసమ్మితమని వర్గీకరించినారు.

నన్నయ భట్టారకులవారి కవితావస్తువు మహాభారతేతిహాస గాథ. ఆ మహాభారతమును రచించినది విష్ణుసన్నిభుడైన శ్రీకృష్ణ ద్వైపాయనుడు. ఆయన 'భారత భారతీ శుభగభస్తిచయముతో ఘోర సంసార వికార సంతమసజాల విజృంభణమునాపి సూరిచేతో రుచిరాబ్జ బోధనరతుడైన యంభోరుహమిత్రుడు. ముని పూజితుడు. విద్వత్సంస్తవ నీయ భవ్యకవితావేశుడు. విజ్ఞాన సంపద్విఖ్యాతుడు. సంయమిప్రకర సంభావ్యానుభావుడు. లోకహితనిష్ఠవలన లేఖ్యమైన యామ్నాయ మును రచించిన చరితార్థజీవనుడు.

శ్రీకృష్ణద్వైపాయన మహామనీషి సమాహిత చిత్తముతో రచిం చిన మహాభారతము - పురాఽపి నవమ్' అగుటవలన పురాణమును ప్రాచీన మహారాజుల వంశ చరితమును తెలుపుచు నితిహాసమును, వ్యంగ్యముగా తోచు నీతులట్లుంచి సూటిగా పెక్కు విషయములు మాన వునిసద్గతికి ఆధారములైనది అనుశాసింపబడుటవలన శాస్త్రజాతికి చెందిన ధర్మశాస్త్ర గ్రంథమును, కాంతాసమ్మితమై వ్యంగ్యముగా నదుపదేశ ములను గావించుచు రమణీయార్థము ప్రతిపాదకమై సహృదయులకు రసానందమును సమృద్ధిగా లభింపజేయుటచేత మహాకావ్యము నగు చున్నది.



నన్నయ భట్టారకులవారు భారతగ్రంథ వస్తువును గురించి వివరించిరి.

సీ॥ "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని కవి
వృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియుఁ
బరమ పౌరాణికుల్ మహు పురాణ స
ముచ్చయంబని మహిఁ గొనియాడుచుండ

వివిధ వేద తత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతంబు".

తిక్కన సోమయాజులవారు మహాభారతము నిట్లు ప్రశంసించిరి.

కం. "వేదములకు నఖిల స్మృతి
వాదములకు బహుపురాణవరంబులకున్
వాదైన చోటులను దా
మూదల ధర్మార్థ కామ మోక్షస్థితికిన్."

నన్నయభట్టారక తిక్కన సోమయాజుల ప్రశంసలు శ్రీ మహా భారత ప్రాభవ పరమార్థములను స్ఫుటముగా వక్కాణించుచున్నవి.

వేదవ్యాసరచిత మహాభారతములోని లక్షణములు పుష్టిగానుండ తాను రచనచేయుచున్నట్లు విష్ణుసన్నిభుడగు వేదవ్యాసుని రచనలోని విశ్వజనీనత్వమును తాను భంగముచేయకుండ కాపాడుచునన్నట్లు తన

రచన శ్రీ వ్యాసుని రచనాతత్త్వానుయాయియే యని నన్నయ భట్టారకులవారు వెల్లడించిరి.

'ధర్మేచార్థే చ కామేచ మోక్షేచ భరతర్షభ।
యదిహాస్తి తదన్యత్రయన్నేహాస్తిన తత్ క్వచిత్' (18-5-38)

ఇది వేదవ్యాసులవారన్న మాటయే.

మహాభారత వ్యాఖ్యాతలు, విమర్శకులు - ఏకగ్రీవముగా సంగీకరించున్న విషయమేమనగా మహాభారతము ధర్మమును కథారూపముగా - వ్యంగ్యంగా - వ్యాఖ్యానముగా ప్రతిపాదించుచున్నదని, 'ధర్మమనగా' పూర్వమీమాంసా ప్రవృత్తిమార్గ మొక్కటే కాదు. సామాన్య ధర్మములు, ప్రత్యేక ధర్మములు, వర్ణాశ్రమ ధర్మములు, వృత్తి ధర్మములు, నివృత్తి ధర్మములు, మొదలగు సకలధర్మసమాహార స్వరూపము. ఈ విషయమున విద్వాంసులలో అభిప్రాయభేదములేదు. ఇట్టి మహాభారతమును నన్నయభట్టారకులవారు వ్యాసుని అడుగుజాడలలో దక్షతతో తెనుగున అనువదించిరి. కాబట్టి మహాభారత తత్త్వమైన యీయంతయు పన్నయభట్టారకులవారి కవితా వస్తుతత్త్వమే.

ఇంతకును వేదవ్యాసుని అనుకరించి అనువదించుటలో కృతకృత్యుడగుటకు నన్నయభట్టారకుల యోగ్యతయేమి?

ఆయన తాను రాజరాజవరేంద్రుని కులబ్రాహ్మణుడనని చెప్పికొనెను. కులబ్రాహ్మణ శబ్దార్థమును గురించి పెక్కుచర్చలు సాగినవి. నన్నిచోడుడు - నన్నయభట్టారకులవారికి సమీపకాలమువాడు - తన కుమారసంభవ మహాకావ్యమున - రాయబారమునకు పంపుటకు యోగ్యులైనవారి లోకుల విప్రుడొకడని చెప్పినట్లు బయటపడిన నాటినుండి చర్చలు మరొకమలుపు తిరిగినవి. ఈ చర్చలలో తుదిమాట నేటివరకు వినబడలేదు. ప్రసక్తి వచ్చినది కావున కొంత చెప్పవలెను.



ఆగమ సంప్రదాయమున 'కులబ్రాహ్మణ' శబ్దమున కొక రూఢియర్థమున్నది. నేటికిని వైష్ణవులందు, ఆంధ్రదేశమున ఆరాధ్యశైవులందు - బ్రాహ్మణులకు కొన్ని వంశములు శిష్యవంశములుగా నుండుటయు - యీ గురువంశములవారు సంచారములుచేసి శిష్యకుటుంబములవారి సేవలు గ్రహించుటయు కలదు. అట్లే పూర్వము స్మార్తబ్రాహ్మణులుకూడ శిష్యవంశములను కలిగియుండి, ఆచారవిచారము, ఉపదేశాదులు చేయుచుండెడివారు. స్మార్తులందీ ఆచారమును శ్రీ శకర భగవత్పాదులవారు తొలగించి ఆంధ్ర ద్రవిడ కర్ణాట కేరళాది దేశప్రభేదములకు గురుస్థాముగా దంక్షిణమున శృంగేరిలో దక్షిణామ్నాయ సంజ్ఞిక శారదాపీఠమును నెలకొల్పిరి. అయినను స్మార్తబ్రాహ్మణ వంశములు కొన్ని - యెడనెడ - సకృత్తుగా - యీ ఆచారమును నిలిపియుంచుకొనుట కలదు. రాజరాజనరేంద్రునికి శన్నయభట్టారకులవారిట్టి గురువంశములోని బ్రాహ్మణుడు. మంత్రోపదేశాదులు గురువంశములోని బ్రాహ్మణునియొద్దనుండియే - అనగా కులబ్రాహ్మణునుండియే గ్రహింపవలయునని ఆగమ - తాంత్రిక - ఆచారము, సంప్రదాయము. రాజరాజనరేంద్రుడు తన కులబ్రాహ్మణునుండియే - పంచమవేదమైన మహాభారత సంహితా వ్యాఖ్యానరూపమైన ఆంధ్రానువాదమును నవిదలిచెను. కులబ్రాహ్మణుడన్నట్టే కులదైవము - ఇలవేల్పు. నేటికిని దీని అర్థము అనుభవములో మనకందరకునున్నది.

నన్నయభట్టారకులవారు రాజరాజనరేంద్రునికి కులబ్రాహ్మణుడు మాత్రమేకాదు. అవిరళజపహోమతత్పరుడు. అనగా అవిరళ జపముచేతను హోమక్రియలచేతను బాహ్యాభ్యంతర నాచనిష్ఠుడైన పావిత్ర్యమూర్తి. మహాకావ్య రచనాదక్షత్వ సామర్థ్యములను సంతరించుకొన్న విపులశబ్దశాసనుడు. సంహితాభ్యాసుడైన కారణమువరన 'వాచమర్థానుధావతి' అన్న అభియుక్తోక్తికి నిదర్శనమైన వాక్పావిత్ర్య పటుత్వములను సాధించుకొన్నవాడు. బ్రహ్మాండాదినానా పురాణవిజ్ఞాన నిరతుడైనవాడగుటవలన కావ్యరచనకు ఆధారభూతమైన వ్యుత్పత్తిని పుష్టిగా సము

కూర్చుకొన్నవాడు. సద్వినుతావదాతచరితుడైనవాడనగా - వంకలు లేని - స్తుతిపాత్రమైన ప్రవర్తనకలవాడనుట. అనగా యథార్థమైన త్రికరణశుద్ధి కలవాడని. అట్టివాడే గురుస్థానమునందుండి ఉపదేశము చేయుటకు యోగ్యతకల దేశికుడు. లోకజ్ఞుడు. కావ్యఘట్టనిర్వాహణకు లోకజ్ఞత మిక్కిలి అవసరమైనది. లోకజ్ఞత లేనిదే మహాకావ్యసృష్టిని నిర్వహింపవలనుపడదు. ఆయన పూర్వమే ఉభయభాషా కావ్యరచనా శోభితుడు. అనగా కావ్యరచనా వ్యాసంగము, అభ్యాసము కలవాడు. నిత్యపరిచయమువలన కుంటుపడని పద్యధార - గాంగనిర్ఝర సదృక్ ధారాళ వాగ్ధాటిగలవాడు. కావ్యరచన ఆయనకు కూసువిద్య. సమగ్రముగా స్వాధీనమునందుచున్నది. ఇక ఆయనను ఆశ్రయించిన నిత్యసత్యవచనతయు, మతి అమరాధిపాచార్యతయు కావ్యకరణమున సమాధి కలిగించు గుణములు.

ఈ గుణములన్నియు నన్నయభట్టారకుల కావ్యరచనపైన ప్రభావముద్ర చూపినవి. ఆయన కవితాతత్త్వమును రూపుకట్టించినవి. ఈ లక్షణములవలన ఆయన రచనలో శబ్దమాధుర్యము, అర్థగౌరవము- వేదమంత్రములవలె - పావిత్ర్య మధురనాదము సమ్మేళనపొంది ఆంధ్ర మహాభారత రూప అమృతప్రవాహముగా వెలువడినవి.

కావ్యమునకు ఆదియేది? అన్న అన్వేషణమున ఆలంకారికులు, అలంకారములని, గుణములని, రీతియని, వక్రోక్తియని మరేవోయని బహుముఖములుగా బహువిధములుగా నిర్ణయములు సాగి - తుదకు అందరకు దిగ్భ్రమ కలుగునట్లు ఆనందవర్ధనాచార్యులవారు అలంకార శాస్త్రమునందు పరమసిద్ధాంతమును ప్రవచించి ధ్వనికి సామ్రాజ్యము కట్టిరి. ధ్వనియనగా రసధ్వనియని. కావ్యమునందు ఆత్మభూతమైనది రసధ్వని కనుక మనకు పరమప్రమాణమైన ఆంధ్రమహాభారతము ధ్వని విహారభూమియైనప్పుడే అది మహాకావ్యమని ఆలంకారికులు అంగీకరింతురు. ఆంధ్ర మహాభారతమున ధ్వని సిద్ధాంతసమన్వయమున్నది కావుననే - అది మధురతరనిబంధముల కాలవాలమైనది.



నన్నయభట్టారకుల కవితాస్వరూపమును తిక్కన సోమయాజిగారు వర్ణించినవిధము - ఆంధ్రకవిత్వ విశారదుడని, మహితాత్ముడని, విద్యాదయితుడని - ఈ లక్షణములు ఆయన రచగా శిల్పమునకు అన్వయించునవి.

ఉ॥ ఆదరణీయసార వివిధార్థగతి స్ఫురణంబుగల్గి య
ష్టాదశ పర్వనిర్వహణ సంభృతమై పెనుపొందియుండ నం
దాదిఁ దొడంగి మూడుకృతు లాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముడు నన్నయభట్టు దక్షతన్॥

1808

ఎఱ్ఱాప్రెగ్గడ నన్నయభట్టారకులవారిని స్తుతించినది - నన్నయగారు కవికుంజరుడని - ఆయన నిరంకుశుడైన కవియని

ఉ॥ ఉన్నతగోత్ర సంభవము నూర్జిత సత్త్వము భద్రజాతి సం
పన్నము నుద్ధతాన్య పరిభావిమదోత్కటమున్ నరేంద్రపూ
జోన్నయనోచితంబునయి యొప్పెడు నన్నయభట్టు కుంబరం
బెన్న నిరంకుశోక్తి గతినెందును గ్రాలుట సన్నుతించెదన్॥

శ్రీనాథ మహాకవి అభిప్రాయమున నన్నయగారు ఉపాధ్యాయ సార్వభౌములు, కవితాపట్టాభిషిక్తులు, భారతఘట్టములన్న సముద్రమును దాటుటకు తగిన పటిష్ఠమైన గాఢమైన ప్రతిభకలవాడని.

కం॥ నెట్టుకొని కొల్తునన్నయ భట్టోపాధ్యాయ సార్వభౌముని గవితా
పట్టాభిషిక్త భారత ఘట్టోల్లంఘన పటిష్ఠు గాఢప్రతిభున్.

మార్కండేయ పురాణకర్త మారనగారు నన్నపార్యుని విద్యారమణీయుడని, ఆంధ్రకవితాగురువని స్తులించెను. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు శ్రీనాథుని భావములనే తన మాటలలో చెప్పెను. తెనాలిరామకృష్ణుడు కీర్తిభవుడని, రామరాజభూషణుడు నాగశాసనుడని, కరళీపాకమాధుర్య కవితాబుధుడని పింగళసూరనగారు ఆరాధించిరి. అప్పకవి, అయ్యలరాజు లామభద్రుడుకూడ శబ్దశాసనుడన్నారు. వాక్సుమేరువన్నాడు మంచవ

(కేయూరబాహు చరిత్ర) 'నవ్యమంజుల వాగ్ధుర్య నన్నపార్య' అని మృదువుగా పొగడినది మొల్ల.

విక్రమార్కచరిత్రను రచించిన జక్కన దృష్టిలో నన్నయభట్టారకులవారు రసబంధురభావ భవాభిరామ ధౌరేయులు, శబ్దశాసన వరేణ్యులు.

ఉ॥ వేయివిధంబులందుఁ బది వేవురు పెద్దలు సుప్రబంధముల్
పాయక చెప్పిరట్లు రసబంధురభావ భవాభిరామధౌ
రేయులు శబ్దశాసనవరేణ్యులు నాఁగఁబ్రశస్తికెక్కిదే
యేమెడ నన్నపార్యగతినిద్ధరనట్టి మహాత్ముఁ గొల్చెదన్.

అద్యతనాంధ్రకవి ప్రపంచనిర్మాతయైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారు "మూగుదియందు నన్నయ నమున్నతుడై కడులక్షణంపు ప్రోలై గుడిగూర్చుకొన్న నేర్పుకలడై" అని ప్రశంసించగా కవిసమ్రాట్టులు 'ఋషివంటి నన్నయ రెండవ వాల్మీకి' అని ప్రణామాలుచేశారు. ఒక మధురమైన కవితా మార్గదర్శియని భావము.

తిక్కనగారు, ఎఱ్ఱాప్రెగ్గడ, శ్రీనాథ జక్కన మొదలగువారు ప్రశంసించిన నన్నయగారి కవితాగుణములు ఆయన కవిత్వతత్త్వమునకు సంబంధించినవే. "విశ్వశ్రేయః కావ్యమ్ - సావాగ్యారసవృత్తిః" అని సూత్రీకరించినది నన్నయభట్టారకులనియే మన విద్వాంసులు విశ్వసించుచున్నారు.

తన కవితా లక్షణములను గురించి నన్నయభట్టారకులవారు స్వాయముగా చెప్పుకొనిరి.

ఉ॥ సారమతిన్ గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగుసన్ మహా
భారత సంహితారచన బంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్.



తన కవిత్వమునందు ప్రసన్న కథా కవితార్థయుక్తి, అక్షర రమ్యత, రుచిరార్థసూక్తిమత్త్వము అను మూడు లక్షణములున్నవని ఆయన కంఠోక్తిగా చెప్పెను.

సారమతులైన కవీంద్రులు లోనారసి ప్రసన్న కథా కవితార్థ యుక్తిని మేలుమేలు అందురట. ఇతరులు అక్షరరమ్యతను ఆదరింతురట. ప్రసన్నకథా కవితార్థయుక్తియన్న విశిష్టగుణము సామాన్య పాఠకులకు సంవేద్యముకాదట. కవులే దానిని ఆరయవలెనట. (కవి యనగా సంస్కృత సాహిత్యమున మేధావి అను అర్థమున పెక్కు గ్రంథములందు ప్రయోగింపబడినది). సామాన్య కవి శబ్దవాచ్యులుకూడ కాదు. ఉత్తమ కవులైన కవీంద్రులే దానిని ఆరయుటలో సమర్థులట. అట్టి కవీంద్రులైనను - ఏదో చూచితిమని చూచుటకాదు. సారమతితో చూడవలెను. పైపై చూచుటయైనచో నది అందదు. లోతుగా చూడవలెను. అనగా మిక్కిలి శ్రద్ధతో చూడవలెను. అప్పుడు వారు మేలుమేలు అని ప్రశస్తి పలుకగలరు. ఆలోచనామధురమన్న వచనమున కిదియే తాత్పర్యము కావలయును. ఇట్లు చెప్పుట - ప్రసన్నకథా కవితార్థయుక్తి యొక్క పరమగాంభీర్యమును ప్రతీయమానము చేయుటకు.

అయితే ఆ లోతులు చూడలేనివారికీ గ్రంథము యొక్క ప్రయోజనమున్నదా? లేదా? అన్న ప్రశ్నకు సమాధానముగా - కవీంద్రులు కాని ఇతరులకు - కావ్యమున అంతర్వాహినిగా ప్రవహించుచున్న అక్షర రమ్యత యొకటి కలదు. అది వారికి ఆహ్లాదమును కలిగించును. వారికి, వీరికి, అందరు పాఠకులకు ఆదరణీయ భావమును కలిగించు నానా రుచిరార్థ సూక్తులున్నవట. భావుకతలోని అధికార తారతమ్యమును బట్టి తన కవిత యథోచితముగా ఆదరింపబడుచున్నదన్న వ్యంగ్యముతోపాటు నన్నయభట్టారకులకు తన కవిత్వతత్త్వమునందుగల ఆత్మవిశ్వాస మిచ్చట ధ్వనిగా వేద్యమగుచున్నది. అంతియేకాదు యీ మూడు గుణములు తన కవితయందు ప్రధానమైనవనికూడ ధ్వని. ఇతర గుణ

Tel. 1808



ములు శివనికాదు. అవియన్నియు తొలుత చెప్పిన ప్రసన్న కథాకవితార్థయుక్తి అన్న లక్షణమునకు అంగములవంటివనియు ధ్వని. నిజమునకు తన కవితయందు నానారుచిరార్థసూక్తులుండుటను ఆయన తనకొక బిరుదుగా భావించినట్లే తోచును.

ఆలంకారికముగా చూచినచో యీ మూడు లక్షణములలో ప్రసన్నకథా కవితార్థయుక్తియు నానా రుచిరార్థసూక్తి మత్త్వము - అక్షర రమ్యతకంటె తరతమములుగా తోచుచున్నవి. భట్టారకులవారి అభిప్రాయము కూడ నట్టిదనియే తోచును.

నానారుచిరార్థసూక్తిని నిత్యమున సూక్తియనగా ఆదరింపదగిన రమ్యవాక్కు. మంచిమాట. రుచిరార్థ సూక్తియనగా బహుధర్మములను కడురమ్యముగా చెప్పుట. ఇది లోకమున సూక్తులుగా - అభియుక్తోక్తులుగా వెలయుచునున్నవి.

"ప్రియము పలికెడువారిన పెద్ద యెత్తుమెత్తు రప్రియంబును
పథ్యంబునైన పలుకు వినగనొల్లరు'' 2-2-191

ధీరుడు ధర్మాధర్మ విశారదుడు బహుశ్రుతుండు సముచితుడు వా
ణీ రమణీశ్రిత వదన సరోరుహజన జనునె నీ పురోహితుడనిపా ॥
2-1-29

కం॥ అలిగిన నలుగక యెగ్గులు వడికిన మఱి వినని యట్లు
ప్రతి వచనంబుల్
వలుకక బిన్నము వడియెడఁ దలఁపక యున్నతఁడె చూవె
ధర్మజ్ఞుఁడిలన్ ॥ (1-8-147)

కం॥ మతిఁ దలఁపఁగ సంసారం బతి చంచల మెండమావు
లట్టులు సంప
త్ప్రితతుల తత్క్షణికంబులు గతకాలము మేలువచ్చు
కాలముకంటెన్ ॥ (1-5-159)



ఉ॥ నుతజల పూరితంబులగు నూతులు నూరిటికంటె సూనృత
వ్రతయొక బావిమేలు...సూనృతవాక్యము మేలుసూడగన్.

కం॥ వగవగ సాంగోపాంగములగు నాలుగువేదములయు
నధ్యయనము పొ
ల్పుగ నొకసత్యముతో నెనయుగునే యెవ్వియును
బోలవటె సత్యంబున్॥

ఇట్టివి భట్టారకులవారి రచనలో అసంఖ్యాకములైన సూక్తులు. ఆయన యీ సూక్తులు కథాసందర్భమును సముచిత రమణీయముగా ప్రతిపాదించుచున్నవి. సూనృత వాక్యమును గురించి చెప్పిన పద్యము తన్ను స్వీకరింప నొల్లని దుష్యంతునితో శకుంతల చెప్పినది. పుత్రుని ప్రాశస్త్యమును చెప్పి - అంతకంటె ఒక యథార్థవాక్య ప్రాశస్త్యమెట్టిదో ఆమె చెప్పినది. కథా సన్నివేశమునందీ సూక్తి కవితాశక్తిని మించి శిల్ప జగత్తును వెల్లడించినది. నాలుగు వేదముల అధ్యయనముకంటె సత్యమధికమన్న మాటలు అడవిలో నలుడు చీరచించుకొని పోయినతర్వాత దమయంతి చేసికొన్న మననము.

భట్టారకులవారు రుచిరార్థ సూక్తులను కథా సన్నివేశ ఔచిత్య పోషకములుగా శిల్పాభిరామములుగా ప్రయోగించినారు. అందుకనియే బిరుదు గద్యగా చెప్పికొనుట.

అక్షర రమ్యత యనగా పెక్కు సమన్వయములు చేయవచ్చును బహువిధములుగా తోచుచున్నది. అక్షరములు కూర్పుటలోని - పొందికలోని - సొగసు. నిజముగా ఛందోబద్ధముగా అక్షరములను కూర్పుట - అనగా పద్యములను వ్రాయుటలో నొక సొగసున్నది. అందుకనియే కవిత పద్యరూపమున వెలువడుట. నన్నయభట్టారకుల వారు చెప్పిన అక్షరరమ్యత అంతమాత్రముకాదు. రసభావానుగుణ అక్షర విన్యాసమును అక్షర రమ్యతగా చెప్పుకొందమన్నచో నన్నయ భట్టారకుల

వారి రచన యంతయు ఉదాహరణమే. అక్షరములను కూర్చుటవలన వ్యక్తమగుచున్న ఒకానొక సౌందర్యలక్షణమును అక్షర రమ్యతగా చెప్పుకొందమన్నచో నన్నయ భట్టారకుల వారి రచన యంతయు ఉదాహరణమే. అక్షరములను కూర్చుటవలన వ్యక్తమగుచున్న ఒకానొక సౌందర్యలక్షణమును అక్షర రమ్యతగా స్థూలముగా, సామాన్యముగా చెప్పుకొందమన్నను - అక్షర సౌందర్యమునకు భట్టారకులవారి రచన నుండి పెక్కు ఉదాహరణములనీయవచ్చును. అక్షర సౌందర్యమేర్పడుటకు పెక్కు కారణములుండవచ్చును. పద్యపాదమునందు ఏకవర్గాక్షరములను దగ్గర దగ్గరగా ప్రయోగించుటవలన నొక అంతర్వాహినియైన సుందరనాద మొకటి ప్రవహించును. అసలు యతి, ప్రాసలు - యిట్టి అనులయవాహినీ రమణీయమైన వాదావిర్భావమునకే కదా! ఇట్టి ఏకవర్గాక్షరప్రయోగసంపుటీకరణమునకు కూడ నన్నయభట్టారకుల వారి రచనయందు అనేకములైన ఉదాహరణములు

రాజకులైకభూషణుడు రాజమనోహరుదన్యరాజతే
జోజయశాలి శౌర్యుడు విశుద్ధయశశ్శరదిందు చంద్రికా
రాజిత సర్వలోకుడపరాజిత భూరిభుజాకృపాణ ధా
రాజల శాంతశాత్రవపరాగుడు రాజమహేంద్రుడున్నతిన్.

" విమలాదిత్యతనూజుడు విమలవిచారుడు కుమారవిద్యాధరుడు
త్తమ చాళుక్యుడు "

రమణీయాక్షర విన్యాస శోభితముగా వసంతర్తువున మలయానిలుని ఆ మందగమనమునుచూడుడు.

చందనతమాల తరులందు నగరుద్రుమములందుఁ
గదళీవనములందు లవలీ
కంద తరుషండములయందునవిమీలదరవింద
సరసీవనములందు వనరాజీ



కందళిత పుష్పమకరంద రసముందగులుచుం దనువు
సౌరభమునొంది జనచిత్తా
నందముగఁ బ్రోషితుల డెందములలందురఁగ మంద
మనియానిలమమ్మంద గతివీచెక్. (1-5-139)

ఈ పద్యమున నున్న అక్షర రమ్యత మధుమాస సౌందర్యమును అర్థ విచారమవసరము లేకుండ నిరూపించుచున్నది.

అక్షరరమ్యత యనగా మరియొక అభిప్రాయమున్నది. అక్షరములను కూర్చుటలోని సొగసు అన్నివిధములందు ననుస్యూతమై యొకానొక మాధుర్యముగా నన్నయభట్టారకులవారి సర్వరచన యందు భాసించుచున్నది. కథానుకూలముగ, రసానుగుణముగ, సందర్భానుసారముగ ఈ మాధుర్యము రూపురేఖలను మార్పుచేసికొనుచుండును. ఇది రచనా శిల్పములోని అంతర్భావము. ఇట్టి మాధుర్యమునే పూర్వ ఆలంకారిక శిరోమణులు రసధ్వనికి ప్రభవస్థానముగా నిర్వచించినారు. కథానుకూల, రసానుగుణ, సందర్భానుసారమైన శిల్పమునకు నన్నయగారి రచన యంతయు ఉదాహరణమే. గ్రంథవిస్తరభీతిచేత - ఒకటి రెండు ఉదాహరణలు మాత్రము.

రౌద్రరస సన్నివేశమున క్లిష్టాక్షరములు, సంయుక్తాక్షరములు, పరుషములు, తాలవ్యములు. ఇట్టి అక్షర సంయోగముచేత రసమును వ్యంజితము చేయుట.

'కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులనేకుల్' — యీ పద్యమునందున్న రౌద్రరసమునం దీవిధమైన శిల్పము. శృంగార రస సన్నివేశమున సరళాక్షరములతో నొక సుకుమారమైన రచన. (1-3-144)

యయాతి నూతిలో వస్త్రములు లేకుండనున్న దేవయానిని చూచినాడు. ఆమెను తన కుడిచేయి నూతగానిచ్చి ప్రీతితో పైకి తీసినాడు. ఆ యయాతి చేయి — 'జలధి విలోలవీచి విలసక్కలకాంచి సమంచితావనీతల వహనక్షమంబయిన'దట. జలధి యనగా సముద్రము

నందు కదలుచున్న కెరటములచేత ప్రకాశించుచున్నట్టి యొడ్డాణముతో నొప్పుచున్న భూతలమును వహించుటకు సమర్థమైనదట. ఆయన పట్టుకున్న దేవయాని చేయి 'ఉన్నమద్గళదురు ఘర్మవారి కణక్రమకరాబ్జమట - చెమ్మటచేత మనోహరముగా నున్న చేయి ఆమెది. ఈ మనోహరత్వమువలన సాత్త్విక భావోదయము వ్యంగ్యమగుచున్నది. ఫలము శృంగార రసధ్వని. అంత సమర్థవంతమైన చేయిని పట్టుకొనుచు ఆతడు రాజని ఆమెకు తెలిసియుండుటచేత - చెమట పట్టుట యన్న సాత్త్విక భావముచేత ఆమెకు అతనియందున్న కోరిక ధ్వనితము. చెమటక్రమమనుటచేత శ్రమజనితముకాదని ధ్వని. యయాతి ఆమె సౌందర్యమును పూర్తిగా చూచినాడు. మనోహరముగా నున్న చేతినికదా పట్టుకొని ప్రీతితో పైకెత్తినాడు. ఆమె యందాయనకున్న అభిప్రాయము కూడ ధ్వనితము. ఇచ్చట భావోదయ ధ్వని పుష్టికలదు. ఇట్లు సామాన్య దృష్టికి మధురాక్షర సంయుతముగా - అక్షరరమ్యతగా నుండినచోట - రసము ధ్వనితమై, రసానుకూల రచనాపుష్టి.

'ప్రసన్నకథా కలితార్థయుక్తి' యనగా నెట్టిదో పరిశీలింతము. 'ప్రసన్న కవితార్థయుక్తి' అన్న మరొక పాఠముకలదు. అయితే సాహిత్య భావుకులందరు కలితార్థయుక్తి యన్న పాఠమే సాధువని మిక్కిలి సామంజస్యమని నిర్ణయములు చేసిరి. సత్కవుల శిరోరత్నమును, వ్యాఖ్యాతలలో శిరోమణియునైన శ్రీ విశ్వనాథ సన్నయ్యాగారి ప్రసన్నకథా కలితార్థయుక్తి'ని విపులముగా గ్రంథరూపమున వెలువరించిరి. ఆయన ప్రతిపాదించినదేమనగా ప్రసన్నకథా కలితార్థయుక్తి యనగా నొక రచనాశిల్పప్రాగల్భ్యమని. కథతో కూడికొన్నదై యొక మహార్థ ప్రకాశించుట. నన్నయగారి రచనలోని పెక్కు ఘట్టములను శ్రీ విశ్వనాథవారు విపులముగా వ్యాఖ్యానించి ప్రసన్నకలితార్థయుక్తి యైన నన్నయగారి యుపజ్ఞను - మహాశిల్పమును వెల్లడించిరి. తెలియని వారు నన్నపార్యుని యశస్సును కలుషీభూతము చేయగా తాను కృతకలుష నిష్కాసన పటువునన్నాడు.



ఈ ప్రసన్నమైన కథాకలితమగు అర్థయుక్తి పెక్కు భంగులని, ఋషులను గురించిన కథాసందర్భమైన అర్థయుక్తి, రాజులను గురించిన కథాసందర్భమైన అర్థయుక్తి, ఇతర ఉపాఖ్యానముల సందర్భముగా నున్న అర్థయుక్తి - ప్రధాన కథాసందర్భమైన అర్థయుక్తియు భిన్న భిన్నములుగా నున్నవని - అనగా భిన్నభిన్న కథాసందర్భములందు భిన్నభిన్నమైన శిల్పాభిరామత కన్పించుచున్నదని శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి వ్యాఖ్యానము. ప్రసన్నకథా కలితార్థయుక్తి అను సమాసమునకు శ్రీ విశ్వనాథవారి విగ్రహము ప్రసన్నమైన కథతో కూడిన అర్థముల యోజనయని. 'అచటనున్న యర్థములను చక్కగా పరిశీలించినచో కథ పాఠమునకు ప్రసన్నమగును' అనిరి. కథారచనా కాలమున కవి హృదయమునందున్న భావములెల్ల పాఠకునికి తోచుట. ఇది ధ్వనికారుల దృష్టిలో సహృదయత. కాబట్టి శ్రీ విశ్వనాథవారి దృష్టిలో ప్రసన్నకథా కలితార్థయుక్తియన్నది ధ్వనిమార్గముతో సంవదించుచున్నదే.

మరియొక పరిశీలన చేయుటకు నాట్యశాస్త్రమున ప్రసాదమన నేమియో నిర్వచింపబడినది.

> అప్యనుక్తోబుధైర్యత్ర శబ్దార్థోవా ప్రతీయతే।
> సుఖశబ్దార్థ సంయోగాత్ప్రసాదః సతుకీర్త్యతే।

ప్రసాదము రసమునకు గుణము. సర్వరస సాధారణము. నానారసమయములైన కథలనే ప్రసన్నకథ లనవలెను. అందుచేత ప్రసన్నకథా కలితార్థయుక్తి యనగా వాచ్యార్థము ప్రసన్నమైయుండగా మనోహరములైన వ్యంగ్యార్థముల యోజన సహృదయుని హృదయమునకు గోచరించుట యన వచ్చును. ధ్వనిమార్గ సంపూర్ణమని తాత్పర్యము. కాల వ్యవధి దృష్టిలో నుంచుకొని - దీనికొక యుదాహరణము మాత్రము చూపుచున్నాను.

శంతనుడు సత్యవతిని చూచి ఆమెయందనురక్తుడై పెండ్లాడుదు ననగా ఆమె తండ్రి దాశరాజామె కాతనివలన పుట్టిన సంతానమునకు

రాజ్యాధికారము కావలయుననెను. శంతనుడు గాంగేయుని స్మరించి - అందుల కంగీకరింపలేక గృహమునకు తిరిగివచ్చి - సత్యవతిని తలంచుచు చింతాక్రాంతుడై కార్యములను చూడకుండనుండెను. తండ్రి దుఃఖమును అరసి ప్రతివిధానమాచరించు తలంపుతో గాంగేయుడు తండ్రిని సమీపించి యిట్లు పలికెను.

“ భవదభిరక్షితక్షితికి బాధ యొనర్పగ నోపునట్టి శా
త్రవనివహంబు లేదు ; వసుధాప్రజకెల్ల ననంత సంతతో
త్సవముల ; రాజులెల్ల ననిశంబు విధేయుల ; నీకునిట్లు మా
నవ వృషభేంద్ర ! యేలొకో మనః పరితాపము నొంది యుండగాన్”

వ॥ అనిన విని పెద్దయుం బ్రొద్దు చింతించి శంతనుండు కొడుకున
కిట్లనియె ”.

కం॥ వినవయ్య ; యేకపుత్రుడు ననపత్యుడు నొక్కరూప యని
ధర్మ్మవులన్
వినినీకుఁదోడుపుత్త్రుల ననఘా ! పడయంగ నిష్టమయినది నాకున్

మ॥ జనవినుత ! యగ్నిహోత్రంబును సంతానమును వేదములు
నెడ తెగఁగాఁ
జనదుత్తమవంశజులకు ననిరి మహాధర్మ నిపుణులైన
మునీంద్రుల్ ॥

కం॥ నీ వస్త్రశస్త్రవిద్యా కోవిదుడవు రణములందు గ్రూరుడవరిలి
ద్రావణసాహసికుండవు గావున నీ యునికి నమ్మగా
నోప నెడన్ ॥

వ॥ బహుపుత్రార్థంబు యత్నంబుసేయవలయు ; వివాహంబయ్యెద ॥
(1-4-178 to 183)

గాంగేయుడు తనతండ్రి వీతకార్యావసరుడై చింతాక్రాంతుడై యుండుటకు కొన్ని కారణములను ఊహించెను. ఉత్తమ



చక్రవర్తి - ప్రజాపాలన యందు శ్రద్ధాళువు - సామ్రాజ్యమునకు బాధ కలిగింపగల శత్రువులులేకుండుట - ప్రజలు సంతతోత్సవములు చేసికొనుట - సామంతు లందరు విధేయులై యుండుట - ఇక చక్రవర్తి పరితాపమునకు కారణమే ముండును ? దేవవ్రతుడు తండ్రిని అడిగెను. శంతనుడు మిక్కిలి క్షాత్రధర్మ దీక్షాశీలి. కుమారుడు అడిగిన హేతువు లేమియు తన పరితాపమునకు కారణములు కావు. అసలు కారణము ఆ కుమారుని ముందు నోరు విప్పి చెప్పతగినది కాకపోవుట వలన ఆ తండ్రి చాలసేపు - పెద్దయుంబ్రొద్దు - చింతించెను. తరువాత బహుపుత్రార్థంబు ప్రయత్నముచేయుదుననెను. “ రాజానో బహువల్లభాః ” మరియొక వివాహముచేసికొనుటకు - చక్రవర్తి చింతపడవలసిన హేతువులేదు. తండ్రి చెప్పిన సమాధానమువలననే ఏదో మర్మమైన కీలకమున్నదని గాంగేయుడు కొంతయూహించి - తనతో ముడిపడియున్నదొకటి కలదనిగ్రహించి- వృద్ధామాత్యపురోహిత సుహృజ్జనమును విచారించెను. హేతువు తెలిసిపోయినది. దేవవ్రతుడొక నిశ్చయముచేసికొని ‘ అనేక రాజన్య సైన్యసమేతుడై ’ వెడలి దాశరాజునుచేరెను. అతని జయించుటకు కాదీ సైనికార్భాటము. కానున్న మహారాజ్ఞికి - తల్లికి గౌరవ లాంఛనము. ఇట్టి ఉదాత్త రమణీయ ప్రసన్న భావ శిల్పాభిరామములు నన్నయగారి కవితలో అనంతములు.

## అంగిరసము

ధ్వని ప్రస్థాన నిర్మాతయైన ఆనందవర్ధనాచార్యులవారు మహాభారతమునందున్న అంగిరసము శాంతమని సిద్ధాంతీకరించిరి. ఇది అనుల్లంఘనీయమైన నిర్ణయము. శాంతమను రసమున్నదా అను ఆశంక అనవసరము. శాంతము ప్రకృతి రసమని, మిగిలినవివికృతి రసములని నిశ్చయ విషయము. ఈ విషయమును చర్చించి శాంత రస

స్థాయీ భావములను వివరించి దాని అస్తిత్వ నిరూపణమున కిది స్థానముకాదు. విద్వాంసులైన ఆలంకారికులు శాంతము యొక్క అస్తిత్వమును అంగీకరించి - అది సంస్కృత మహాభారతమునందువలె - ఆంధ్రమహాభారతమునందును శాంతరసమే అంగియని సమ్మతించిన విషయము. మరొకటి - మహాభారతమున ప్రతిపాద్యవిషయము ధర్మమని ముందు చెప్పుకున్నాము. ఈ రెండు సంగతులును నన్నయ భట్టారకులు మంగళాచరణమునందెట్లు ప్రతిపాదించిరో చూతము.

శ్రీ వాణీ గిరిజాశ్చిరాయదధతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితిమావహన్త్యవిహతాం స్త్రీ పుంస
యోగోద్భవామ్
తే వేదత్రయ మూర్తయస్త్రి పురుషా స్సంపూజితా వస్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజ భవ శ్రీకంధరాః శ్రేయసే ॥

శ్రీని, వాణిని, గిరిజను, క్రమముగా వక్షస్సు, ముఖము, దేహమునందు చిరకాలము ధరించుచున్న వేదత్రయ మూర్తులు, పురుషోత్తమ అంబుజభవశ్రీకంధరులు - భావుకునికి - శ్రేయస్సుకోసము అగుదురని - నన్నయగారు పాఠకునికి శ్రేయస్సే ఫలముగా చెప్పెను. 'శ్రేయస్సు' అనగా అమరమున "ముక్తిః కైవల్యనిర్వాణ శ్రేయోనిశ్శ్రేయ సామృతమ్" అని ముక్తిగా చెప్పబడినది. అయితే శ్రేయస్సునకు పుణ్యమని, శుభమని మఱియొక యర్థములేకపోలేదు. స్యోద్ధర్మ మస్త్రియాం పుణ్యశ్రేయసే సుకృతం వృషః - అని కూడ అమరమే. అయితే శాంతరసమునకు స్థాయీ భావములుగా శమము, సమ్యగ్జ్ఞానము, తృష్ణాక్షయసుఖము, సర్వచిత్తవృత్తి ప్రశమము, నిర్విశేష చిత్తవృత్తి, నిత్యసంతుష్టిరూపధృతి. తత్త్వజ్ఞానజన్యమైన నిర్వేదము, మోక్షప్రాప్తియత్నోత్సాహము, ఆత్మరతి - మొదలగు వెన్నియో చెప్పబడినవి. కావున నన్నయ భట్టారకుల వారు శాంతరస పర్యవసాయియైన మోక్షప్రాప్తినే ఆకాంక్షించిరని అంగీకరింపవలెను. ఇక ధర్మమన్న వస్తు ప్రతిపాదన విషయము.



ధర్మ మనగా నేమి? పెక్కు అర్థము లున్నవి. పైన శ్రేయస్సును ఫలముగా చెప్పుచున్నాము కదా! శ్రేయస్సును సాధించుటకైనది ధర్మమని "శ్రేయస్సాధన భూతః అర్థః ధర్మః" సామాన్య నిర్వచనము. శ్రేయస్సు అన్న శబ్దప్రయోగము వలననే - దానికి సాధనమైన ధర్మము వ్యంజిత మగుచున్నది. ప్రతిపాదిత మగుచున్నది.

'ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా లోకేధర్మిష్ఠం ప్రజా ఉపసర్పంతి, ధర్మేణ పాప మపనుదతి, ధర్మే సర్వం ప్రతిష్ఠితమ్ తస్మాద్ధర్మం పరమం వదంతి' అని తైత్తిరీయ ఆరణ్యకమంత్రము. 'ధరతీతి ధర్మః' అన్న విగ్రహ వాక్యము ననుసరించి యీ కర్త్రర్థక వ్యుత్పత్తినే ఆరణ్యక మంత్రము - శ్రుతి - ప్రశంసించినది. త్రిమూర్తులు తమ తమ ధర్మములను చిరకాలము - దధతో - ధరించుచున్నా రని నన్నయగారి శ్లోకము. ఈ త్రిమూర్తులు వేదత్రయ మూర్తులట. అయితే వేదము - 'వేదో ధర్మ మూలమ్' అని గౌతమ సూత్రము. వేద్యతే - జ్ఞాయతే అనేన ధర్మాది స్వరూప మితి వేదః - మనువు కూడ 'వేదోఽఖిలో ధర్మ మూలమ్' అని సంగ్రహించెను. త్రిమూర్తులు - వేదత్రయమూర్తులనగా - ధర్మమూర్తు లని వ్యంజితమగుచున్నది. ధర్మము - ప్రతిపాదన జరుగుచున్నది.

శక్తులు లేని త్రిమూర్తులవలన ప్రయోజన మేమియు లేదని శ్రీ భగవత్పాదులు సౌందర్యలహరి (శివశ్శక్త్యా యుక్తో) యందనిరి. అందుచేతనే నన్నయభట్టారకులవారు తమ తమ శక్తులను ధరించిన - సశక్తులైన త్రిమూర్తులను మంగళాచరణ చేయుచున్నారు.

పద్యవిద్యకు ఆద్యుడైన నన్నయ భట్టారకులవారి మహాభారతమున బహుముఖ శిల్పత్వము - అనేక గుణములు. ఇది కాలవ్యవధిని బట్టి కొంచెముగా స్పృశించుట వంటిది మాత్రమే.

చాముండికా విలాసము, ఆంధ్ర శబ్ద చింతామణి, ఇంద్ర విజయము, లక్షణసారము, రాఘవాభ్యుదయము అను గ్రంథములు కూడ నన్నయగారు రచించినవన్న దొక వాద మున్నది. ఇందు రెండు వ్యాకరణ గ్రంథములు. మిగిలినవి పద్యరచనలు. ఇవి ఆయన రచనలా? అది వివాదగ్రస్త మైనది. రూఢి కాదు. అందుచేత-

శ్రీదములై కవిత్వ రస రీతులకున్ దొలి బీజ మూర్తులై
వేదపు గ్రొంజివుళ్లు ప్రభవించిన దివ్యమహాశ్శరీర మ
ర్యాదను స్వీకరించిన మహాత్ములు-ఆంధ్ర కవిత్రయంబు-వి
ద్యా దయితుల్ ప్రమాణ కవితాత్ములు మాకుఁ
బ్రసన్నులయ్యెడిన్ - ఇతి శమ్!

---

# నన్నయ నుడులు

— బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

'నుడులు' అంటే మాటలు, శబ్దాలు. 'నన్నయ నుడులు' అంటే - నన్నయగారి కవిత్వంలో కనిపించే శబ్ద ప్రయోగ దక్షత-అని.

కవిత్వం శబ్ద ప్రధానమైంది. కవిత్వం కంటె భిన్నమైన రచనలలో శబ్దాలూ, అర్థాలూ విడి విడిగా ఉంటాయి. సంకేతితమైన ఒకానొక అర్థాన్ని బోధించడం వరకే అక్కడ శబ్దం చేసే పని! ఒక శబ్ద సముదాయంతో చెప్పిన అర్థాన్నే మరో శబ్ద సముదాయంతో మార్చి చెప్పినా చెప్పవచ్చు. కవిత్వంలో శబ్దం అలా కాదు. శబ్దం అర్థం విడదీయడానికి వీలులేకుండా మమేకంగా కలిసి పెనవేసుకుపోతాయి. కవిత్వంలో కనిపించే ఇలాంటి శబ్దార్థాల కలయికనే 'వాగర్థ సంపృక్తత' అంటాడు కాళిదాసు.

ఇక - వైయాకరణులకు శబ్దం సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపమే! "ఏకః శబ్దః సుష్ఠు ప్రయుక్తః స్వర్గే లోకే కామధుక్ భవతి" (శబ్దం స్వరూపం తెలిసి ప్రయోగిస్తే స్వర్గంలో సమస్తమైన అభీష్టాలనూ అది సమకూరుస్తుంది) అని వారి నమ్మకం!

మొట్టమొదటిసారిగా తెలుగు శబ్దాలను కవిత్వానికి అనుగుణంగా మలచడానికి భారీ ఎత్తున పూనుకున్న నన్నయ భట్టారకులకు కూడా శబ్దం పట్ల అలాంటి విశిష్ట ప్రతిపత్తి ఉన్నట్లు కనిపిస్తుంది.

'ఉచ్చారణ దక్షుడైన వాడు ఉచ్చరిస్తే శబ్దం సంజీవితమై ప్రకాశిస్తుంది' అంటారు ఆయన.

కచ దేవయాని కథలో రాక్షసులు కచుణ్ణి చంపి బూడిద చేసి ఆ బూడిదను మద్యంలో కలిపి శుక్రాచార్యుల వారిచేత త్రాగిం

చారు. కూతురు దేవయాని మాట త్రోసివేయలేక సంజీవి మంత్రం మహిమతో శుక్రుడు తన కడుపులో ఉన్న కచుణ్ణి బ్రదికించాడు. అయితే - అతడు తన కడుపుచీల్చుకొని బయటికి వస్తే, మళ్లీ తనను ఎవరు బ్రదికిస్తారు? అందుచేత - తన కడుపులో ఉన్న కచునికి సంజీవి మంత్రం ఆయన ఉపదేశించాడు. తరువాత కచుడు బయటికి వచ్చి సంజీవి మంత్రం ఉచ్చరించి ఆయనను బ్రదికించాడు. ఈ మాట నన్నయగారు చెప్పిన విధం చూడండి :

"విగత జీవుడై పడియున్న వేదమూర్తి
అతనిచేత సంజీవితుడై వెలింగె
దనుజ మంత్రి - ఉచ్చారణ దక్షు చేత
అభిహితం బగు శబ్దంబు నట్లపోలె !" (భార. 1-3-127)

ఉచ్చారణ దక్షుడైన వానిచేత అభిహితమైన (పలుకబడిన) శబ్దంలాగ శుక్రాచార్యులు సంజీవితు డయాడు - అని పైకి ఇది ఉపమాలంకారం అనిపిస్తుంది. కాని, నిదానంగా చూస్తే ఇది ఉపమ కాదు; యథావద్వస్తువర్ణన - స్వభావోక్తి !

ఎలా అంటారా? దనుజ మంత్రి ఎవరు? వేదమూర్తి. వేదం శబ్దరూపం. ఉచ్చరితం కానంత వరకూ అవ్యక్తంగా ఉన్న ఆ శబ్దం ఉచ్చారణ దక్షుడైన కచుడు ఉచ్చరించడంతోనే సంజీవితమై వెలిసింది. సంజీవి మంత్రం అయింది !

కవిత్వంలో శబ్దాన్ని దక్షతతో ఉచ్చరించి, మంత్రంగా మలచడం నన్నయగారి ధ్యేయం అనవచ్చు. కనీసం - (అనంతుడు, వాసుకి, ఫణిరాజులు, తక్షకుడు) 'మాకు ప్రసన్నుడయ్యెడున్ !' అనే మకుటంతో చెప్పిన "బహు వనపాదపాబ్ధి కుల..." ఇత్యాది (1-1-105 మొదలు 108) పద్యాల వంటివి కొన్నైనా నన్నయగారి రచనలో మంత్ర ప్రశస్తి పొందాయి. ఆ పద్యాలు చదువుకుంటే సర్ప



భయం ఉండదని ఇటీవలి వరకూ తెలుగు వారు వాటిని పారాయణ చేస్తూ వచ్చారు.

నన్నయ భట్టారకుల రచనలో ఆయన శబ్ద ప్రయోగ దక్షత నాలుగు ముఖాలుగా మనకు దర్శనం ఇస్తుంది : ఒకటి - అక్షరాల కూర్పు, రెండు - పదాలపొందిక, మూడు - వాక్య విన్యాసం, నాలుగు- కథా కథనం.

అక్షర రమ్యత : ఒక అక్షరమో, అక్షర సముదాయమో తిరిగి తిరిగి వినిపిస్తూ ఉండడం కవిత్వంలో శ్రవణ శుభగత్వాన్నీ, అక్షర రమ్యతనూ చేకూరుస్తుంది. ప్రతి కవికీ ఒక విలక్షణమైన అక్షరాల కూర్పు ఉంటుంది. వ్యక్త చేతనలో కవి కావాలని ఉద్దేశించి చేసేది కాదు. ఆ అక్షరాల కూర్పు. అతని కవితా వ్యక్తిత్వ ప్రతిబింబం అది. అప్రయత్న సిద్ధంగా ఒక్కొక్క కవికి ఒక్కొక్క శైలి అలవడుతుంది.

స్థూలంగా - యమకం, అనుప్రాస అని రెండే శబ్దాలంకారాలను అలంకారికులు పేర్కొన్నా, నిజానికి వాటిలో ఎన్నెన్నో అవాంతర భేదా లున్నాయి. ఒక్కొక్క కవిలో ఒక్కొక్క విలక్షణమైన తీరులో శబ్దాలంకారాలు మనకు వినిపిస్తాయి. అలంకారం అనేది దేహంలో లీనమైపోయి దేహశోభను ఇనుమడింప చెయ్యాలే గాని కొట్టొచ్చినట్టు ప్రముఖంగా కనిపించకూడదు. అలా కనిపించే శబ్దాలంకారాలను 'ఉల్బణాలు' అనీ, సహజ సౌందర్యాన్ని పెంపొందించే వాటిని 'అనుల్బణాలు' అనీ వామనుడు అంటాడు. నన్నయగారి కవిత్వంలోని శబ్దాలంకారాలు అనుల్బణాలు. ఝుటిత్యర్థస్ఫూర్తికీ, రసాస్వాదానికీ దోహదం చేస్తూ, గాయకుని పాటను మింగివేయకుండా అప్రధానంగా వినిపించే ప్రక్కవాద్యంలాగ ఆ అలంకారాలు నన్నయ రచనను ఆస్వాద్యతరం చేస్తున్నాయి- వినండి :

మ. వివిధోత్తుంగ తరంగ ఘట్టన చల ద్వేలా వనై లావలీ
లవతీ లుంగ లవంగ సంగత లతా లాస్యంబు వీక్షించుచున్

ధవళాక్షుల్ చని కాంచి రంత నెదురన్ దత్తీర దేశంబునం
దవదాతాంబుజ ఫేన పుంజ నిభు నయ్యశ్వోత్తమున్
దవ్వులన్." (భార. 1-2-30)

చం. జలధి విలోల వీచి విలసత్ కల కాంచి సమంచి తావనీ
తల వహన క్షమం బయిన దక్షిణ హస్తమునన్ దదున్నమ
ద్గళ దురు ఘర్మ వారి కణ క్రమ కరాబ్జము వట్టి నూతిలో
వెలువడఁ గోమలిన్ దిగిచె విశ్రుత కీర్తి
యయాతి ప్రీతితోన్." (భార. 1-3-144)

మ. మద మాతంగ తురంగ కాంచన లస న్మాణిక్య గాణిక్య సం
పద లోలిన్ గొనివచ్చి యిచ్చి ముద మొప్పన్ గాంచి సేవించి ర
య్యుద యాస్త్రాచల సేతు శీత నగ మధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణ ప్రతాపోదయున్"
(భార. 2-1-19)

కం. ధ్యేయుఁడవు, సకల లోక
స్థేయుఁడవు, వినమ్రులకు విధేయుఁడవు, నయో
పాయజ్ఞుడ విజ్జగముల
నీ యెఱుఁగనియవియుఁ గలవె నీరజనాభా!
(భార. 2-1-106)

వందలు పద్యాలు ఇలా ఉదాహరించవచ్చు - వ్యవధి ఉంటే! పద్యాలు ఉదాహరించడం కాదు ముఖ్యం. ఆ పద్యాలలోని వివిధ శబ్దాలంకార విన్యాసాలను శాస్త్రీయంగా విశ్లేషించి, నన్నయగారి 'అక్షర రమ్యత' స్వరూపాన్ని ఇదమిత్థమని స్పష్టంగా నిరూపించడం అవసరం. అందుకు ఏ విశ్వవిద్యాలయంవారైనా ఒక డాక్టరల్ థీసిస్ తయారు చేయించి పుణ్యం కట్టుకోవాలి!



భవభూతి అంటాడు:

"లౌకికానాం హి సాధూనాం అర్థం వాగనువర్తతే।
ఋషీణాం పున రాద్యానాం వాచ మర్థోఽనుధావతి॥

లోకంలో సాధుజనుల మాటలు వారు చెప్పదలుచుకున్న అర్థాన్ని అనుసరించి ఉంటాయి. ఋషుల విషయం వేరు. అప్రయత్న సిద్ధంగా వారి నోటివెంట ఏవో మాటలు వెలువడుతాయి. ఆ మాటల వెంట ఒకటికాదు; నానా మనోహరార్థాలు పరుగులు పెడుతూ వచ్చి స్ఫురిస్తాయి. "నాఽఽనృషిః కురుతే కావ్యమ్" - ఋషి కానివాడు కావ్యం చెప్పలేడు - అన్నమాట తెలుగు కవులలో ఇతరులెవరికి వర్తించినా, వర్తించకపోయినా, నన్నయగారికి మాత్రం అక్షరాలా వర్తిస్తుంది. ఆర్షవాక్కులు అనిపించే పద్యాలు నన్నయగారి రచనలో అనేకం కనిపిస్తాయి. 1808

పదాల పొందిక: ఒక పద్యం తీసుకోండి. దానిలో ఒక మాట తీసి మరోమాట పెట్టినా దాని అర్థం, అందం చెడకుండా ఉన్నపక్షంలో ఆ పద్యంలో తగినంతగా 'పదాల పొందిక' లేదని అనవచ్చు. పోతన గారి పద్యం ఒకటి చూద్దాం.

"గీ. చేతులారంగ శివునిఁబూజింపఁ డేని
నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువఁ డేని
దయయు, సత్యంబు లోనుగాఁ దలఁపఁ డేని
కలుగనేటికిఁ దల్లుల కడుపు చేటు!" (భాగ)

దీనిలో 'శివునిఁ' బదులు 'హరునిఁ' అని మార్చినా, 'సత్యంబు' బదులు 'ధర్మంబు' అన్నా, 'కలుగనేటికి'ని 'పొడమనేటికి' అని మార్చినా పద్యశోభకు ఏమంత హాని కలుగదు. ఇప్పుడు నన్నయగారి పద్యం ఒకటి చూద్దాం:

"గీ. యజ్ఞ దీక్షితు డయిన ధర్మాత్మజునకు
గౌడ కాంభోజ పతు లనేక ప్రకార
వర్ణ కంబళములు, శుక వర్ణ వాహ
నివహములుఁ దెచ్చి యిచ్చిరి నెమ్మితోడ". (భార. 2-2-109)

దీనిలో 'యజ్ఞ'ను 'యాగ' అనీ, నాలుగో పాదాన్ని 'సముదయముఁ దెచ్చి యిచ్చిరి సమ్మదమున' అనీ మార్చి చూడండి- ఆ పద్యం నన్నయగారిది కాకుండా పోతుంది. ఈ విధమైన పదాల పొందిక తెలుగుకవులలో తిక్కన, నాచన సోమన, తెనాలిరామకృష్ణుడు మొదలైన కొద్దిమంది కవులలోనే కనిపిస్తుంది.

వాక్య విన్యాసం: "ఏక వాక్యంబునం దొకానొకండు తక్క సర్వపదంబులు క్రమ నిరపేక్షంబుగం బ్రయోగింపంజను ("బాల. కారక. 37 వ సూత్రం) అన్న చిన్నయసూరి సూత్రం సంస్కృతానికి వర్తించినట్టుగా తెలుగుభాషకు వర్తించదు. "ఎప్పుడు వచ్చావు?" అనే వాక్యాన్ని "వచ్చావు ఎప్పుడు?" అని పదాల క్రమం మార్చి అంటే అది తెలుగులాగ అనిపించదు.

నన్నయగారి వాక్యాలు చూడండి -

"చం. ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి,
మిచ్చిన దీనికే మొదం
బడ మని దుర్జనత్వమునఁ బల్కెడు వీరుల మస్తకంబుపై
నిడియెద నంచుఁ దాఁ జరణ మెత్తె సభన్
సహదేవుఁ డట్టిచో
నుడిగి సభాసదుల్ పలుకకుండిరి తద్దయు భీతచిత్తులై".
(భార. 2-2-30)

"అర్ఘ్యం అచ్యుతునికి ఇచ్చాం" అన్న వాక్యాన్ని "అచ్యుతునికి అర్ఘ్యం ఇచ్చాం" అని మరొక్క విధంగా మాత్రమే మార్చవచ్చు. ఇంకే విధంగా మార్చినా కృతకం అవుతుంది; తెలుగు నుడికారానికి విరుద్ధం అవుతుంది.



ఇక ఆ తరువాతి వాక్యం: "ఇచ్చిన దీనికే మొదంబడమని దుర్జనత్వమునఁ బల్కెడు వీరుల మస్తకంబుపై నిడియెదనంచుఁ దాఁ జరణమిత్తె సభన్ సహదేవుఁడు." ఈ వాక్యాన్ని మాటల క్రమం మార్చకుండా ఈనాటి వ్యావహారిక భాషలోకి అనువదించి చూద్దాం: "ఇస్తే దీనికి మేము ఒప్పుకోము అని దుర్జనత్వంతో పలికే వీరుల నెత్తిమీద పెడతాను అని కాలు పైకెత్తాడు సభలో సహదేవుడు." ఈ వాక్య విన్యాసంలో కృతకత్వంగాని ప్రాతబడిన లక్షణంగాని ఏమైనా కనిపిస్తాందేమో చిత్తగించండి!

నన్నయగారి నాటికీ, ఇప్పటికీ తెలుగుభాష ఎంతో మారింది - నిజమే! కాని, ఏ అంశాలలో మారింది? పదజాలం మారింది. ప్రత్యయాలు మారాయి. అంతే! వాక్య విన్యాసంలో ఎక్కువ మార్పు కనిపించదు.

నన్నయగారి నాటికే వాడుకలో ఉన్న మరో చిత్రమైన వాక్య విన్యాసం చూద్దాం: చేసిన మేలు మరచిపోయి, తనో గొప్ప ఆఫీసరు నయాననే అహంభావంతో తన ఉన్నతికి కారణమైన వ్యక్తే ఏదో పని ఉండి తనదగ్గరికి వస్తే ఆయనకును ఎరగనట్టు నటించి, అవమానించాడనుకోండి. రోజులు తారుమారై ఆ ఆఫీసరు మళ్లీ ఆ మహానుభావుణ్ణి ఆశ్రయించవలసివస్తే ఆయన ఏమంటాడు? "ఓహో - ఫలానా ఆఫీసరుగారా? ఏవిఁటి ఇలా దయచేశారు?" అని ఎత్తిపొడుస్తాడు. అవునా? సరిగ్గా ఇలాంటి ఎత్తిపొడుపు పద్ధతే నన్నయగారి కాలంలో కూడా వాడుకలో ఉండడం ఆశ్చర్యం!

ద్రుపదుణ్ణి ద్రోణుడు ఎత్తిపొడిచే తీరు చూడండి:

"కం. వీ రెవరయ్యా! ద్రుపద మ
హారాజులె? యిట్లు కృపణులయి పట్టుపడన్
వీరికి వలసెనె? మహహ! మ
హారాజ్య మదాంధకార మది పాసెనొకో?" (భార. 1.6.90)

తెలుగు కవిత్వభాషలో - పదజాలం విషయంలో ఎలాంటి స్వేచ్ఛ వహించినా, వాక్యంలో పదాల క్రమం, వాక్య విన్యాసం వ్యావహారిక వాక్యరూపానికి అనుగుణంగా ఉండాలి - అనే విషయంలో అనంతర కవులకు ఒరవడి పెట్టినవాడు నన్నయగారు.

కథా కథనం: ఎవరు ఎప్పుడు కథ చెప్పినా ఏదో ఒక ప్రయోజనాన్ని ఉద్దేశించే కథ చెబుతారు. ప్రతినిత్యం మనం చేసే ప్రసంగాలలో కూడా "వెనకటికి ఒకాయన ఏంచేశాడంటే......" అంటూ మొదలుపెట్టి anaccotes లాంటి చిన్ని చిన్ని కథలు చెబుతూ ఉంటాం. ఒక విషయాన్ని మామూలు మాటలలో సూటిగా చెప్పడం కంటె ఒక కథద్వారా చెబితే అది మనస్సుకు మరింత గాఢంగా హత్తుకుపోతుంది అనే ఉద్దేశంతోనే అలా చెప్పడం జరుగుతుంది. కేవలం ఉబుసుపోక కోసం, వినోదపరచడంకోసం చిన్ని పిల్లలకు ముసలమ్మలు చెప్పే కథలలో కూడా వారిని వీరులుగానూ, సత్పురుషులుగానూ మలచాలనే ఆకాంక్ష గర్భితంగా ఉండనే ఉంటుంది.

నన్నయగారిని రాజరాజ నరేంద్రుడు ఒక ప్రత్యేక ప్రయోజనం కోరి భారతం తెలుగులో వ్రాయమన్నారు:

"కం. జననుత! కృష్ణ ద్వైపా
యన ముని వృషభాభి హిత మహాభారత బ
ద్ధ నిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్."

(భార. 1-1-16)

కృతిపతి కోరికను అనుసరించి భారత కథా కలితములైన నిగూఢార్థాలు పాఠకుల మనస్సులకు ప్రసన్నంగా బోధపడే విధంగా ఆ కథలను యోజన చేశాననీ, లోచూపు గల సారమతులైన కవీంద్రులు కథాకథనంలో తాను ప్రదర్శించిన శిల్పాలనూ, ప్రసన్న యోజననూ

Acc. 24447. Tel. 1808



గుర్తించి 'సెబాష్' అంటారనీ నన్నయగారు చెప్పుచున్నారు. నన్నయగారి ఆ 'ప్రసన్న కథా కవితార్థయుక్తి'ని తలస్పర్శిగా పరిశీలనచేసి, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఇదే గ్రంథం వ్రాశారు. ఆ విషయమైన ఇంక ఎవరు ఏమి చెప్పినా, ఆయన మాటలు పునశ్చరణ చెయ్యడమే అవుతుంది.

ఒక్క చిన్న ఉదాహరణ - అరణ్యపర్వంలో భీముని చేత రామాయణ కథ అంతటినీ మూడు చిన్న కంద పద్యాలలో చెప్పించారు నన్నయగారు. ఆయన కథా సంగ్రహణ దక్షత ఆ పద్యాలలో మనకు విశదం అవుతుంది వినండి:

"కం. అలఘు యశుం డిక్ష్వాకుని
కులతిలకుడు రాఘవుండు గురువచనమిలన్
నిలిపి వన వాసియై తన
అలనన్ గోల్పడియె నట్టె లంకేశ్వరుచేన్."

"కం. సీతాన్వేషణ పరులై
నీతిఁ గపి ప్రవరు లరిగి నియతంబుగ సం
పాతి యను పక్షిచేత మ
హీ తనయ సువార్తలెల్ల నెఱిఁగి కడంవన్."

"కం. వారలు వారిధిఁ గడవఁగ
నేరక తా రున్నయెడ ననిల సత్త్వమునన్
వారిధి లంఘించే మహా
వీరుఁడు హనుమంతుఁ డనఁగ విందుఁ గపీంద్రా!

(భార. 3-3-325 మొదలు 327)

మహాసముద్రం లాంటి 'నన్నయ నుడులను' గురించీ, ఆయన శబ్దప్రయోగ దక్షతను గురించీ అల్పజ్ఞుణ్ణైన నేను 15 నిముషాల అల్ప కాలం ఏమి చెప్పగలను – స్థూలంగా కొన్ని కొండ గుర్తులవేపు వేలు చూపించడం తప్ప !

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి అంటారు: "'నీ అభిమాన కవి ఎవరు?' అని అడిగితే నన్నయ భట్టారకులు అని చెప్పడం 'నీ ఆప్త మిత్రు లెవ?' రని అడిగితే 'మా తండ్రిగారు!' అని చెప్పడం లాంటిదే!" అని. ఆయన మాట అక్షరాలా నిజం. అనంతర ఆంధ్ర కవులందరికీ నన్నయగారు నిజంగా తండ్రి వంటి వాడే!

ఈ బహుళాంధ్రోక్తిమయ మహాసౌధానికి అట్ట అడుగుని నిలిచిన సుదృఢమైన పునాది నన్నయ్యగారు!

---

# నన్నయ భారత రచన - లోకజ్ఞత

— డా॥ కొండవీటి వేంకటకవి

ఉ. వీతవిమోహుఁడై జగతి వేదవిభాగము సల్పుదాశక
న్యాతనయుం డొనర్చిన మహత్తరభారత మాంధ్రభాషలోఁ
జేతము పొంగిపోవ విరచింప నుపక్రమముంబొనర్చు వి
ఖ్యాతికిఁ దావలంబగు మహాకవి నన్నయ నాత్మనెన్నదన్.

చాళుక్యవంశము ఇరుపాయలై 1) పూర్వ చాళుక్యులు 2) పశ్చిమ చాళుక్యులను భాగములతో విలసిల్లెను. అందు పూర్వ చాళుక్య వర్గమునకు చెందినవాఁడు రాజరాజ నరేంద్రుఁడు. పశ్చిమ చాళుక్య వంశమునకు చెందినవాఁడు త్రైలోక్యమల్లుఁడు.

త్రైలోక్యమల్లునితో ఓడింపఁబడిన రాజరాజనరేంద్రుఁడు ఆ త్రైలోక్యమల్లుని యాస్థానపండితుని నారాయణభట్టును పోషించు భారము వహించి, నందంపూడిని సర్వదుంబాళముగా సమ్మానించెను. క్రొత్తగా వచ్చిచేరిన నారాయణభట్టుకు నన్నయభట్టు, నన్నయభట్టు కవితా వ్యాసంగమునకు నారాయణభట్టు సహాయకారులుగా నుండిరి.

లౌకికాలౌకిక వాఙ్మయమున కంతటికిని మూలాధారమై పంచమ వేదముగాఁ బరఁగిన భారత సంహితి నాంధ్రీకరింపజేయు సంకల్పము రాజమహేంద్రవరపురాధీశ్వరునకు కలిగెను. దానికిఁ గారణము తమ వంశీయుల చరిత్రయగుటయే. మఱియు ఆనాఁటికి భీముని, అర్జునుని - ప్రత్యేక నాయకులుగా నెన్నుకొని పంపఁడు, రన్నఁడు అను కవులు కన్నడమున వ్రాసి తత్రత్య ప్రజలచే మన్ననలందుట మఱొక విశేషము.

అసలు నన్ని + అయ్య = అందమైన అయ్య, నన్ని + అవ = నన్నపార్య. సుందరతార్థబోధకమైన నన్నిశబ్దము, సాధారణముగా పదాంతమందలి అప్పశబ్దము కన్నడ సంప్రదాయమగుటచే ఈ నన్నయసైతము తొలుదొలుత కన్నడీఁడుగా కన్పట్టుచున్నాఁడు. ఏమైన నేమి? కన్నడమున భారతాంధ్రీకరణము మూలానుసారముగా ముచ్చటగా జరుగలేదని, అది వైదిక ధర్మబద్ధము కాదని తలఁచి తానీ రచనకు కడంగినట్లు స్పష్టము. దీనికి ప్రభుసమాశ్రయము ప్రాప్యము.

భారత రచన :- నన్నయకుఁ బూర్వము యుద్ధమల్లుని బెజవాడ శాసనములోని పద్యభాగములు దక్క మఱి యితరములు కానిపింపవు. ఆ కాలమున - అంతకు ముందు జైన బౌద్ధమతములు విస్తరించిన వగుటచే ఆ వాఙ్మయ ముండనోపు. అది మతవాదుల మారణ హోమకుండములో మసియై యుండనోపు. పండితుల హుంకారారావములకు పల్లెపదాల హృదయాలు పగిలియుండనోపు. ఏమైన నేమి? భారతమాది కావ్యము, నన్నయ ఆదికవి అయినాఁడు.

ఈ నన్నయ కర్తృత్వమును గుఱించి కుంశకలు కొన్ని లేకపోలేదు.

ఉ. పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా
రాయణునట్లు వాసిగధరామరవంశ విభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుఁడున్ దనకిష్టుఁడున్ సహా
ధ్యాయుఁడు నైనవాఁ డభిమతస్థితిఁ దోడయి నిర్వహింపఁగన్.

భారతయుద్ధమున పార్థుఁడు నామమాత్రుఁడైనట్లు భారత రచనమున నన్నయయు నామమాత్రుఁ డాయె ననియు - దీని కుపోద్బలకముగా బ్రహ్మశ్రీ కొట్టరువు తిక్కనామాత్యులు విరాటాదిలో "నన్నయభట్టు దతుతన్" అనుదళమును గ్రహించి నన్నయ అను విభాగమును



విడఁదీసి భట్టు దక్షుతన్ అను ఖండమును జీల్చి నారాయణభట్టు దక్షుతతో నని విపరీతార్థమును గుంజుచుండిరి.

ఈ పైవాదమే గాక రాజరాజనరేంద్రుఁడు తమ వంశీయుల గాథను దానే రచించుచుండఁ బుణ్యకాలమునఁ బితృపితామహులకుఁ బిండోదకముల నిచ్చుతరుణమునఁ దన పురోహితుఁడగు నన్నయభట్టును దనకు సమ్మతమైన దానమును గోరుకొమ్మని ప్రభువడుగ నాంధ్రమహాభారతమును దనరచనయ కా వాంఛించెననియు, సత్యవ్రతుఁడగు రాజు దాని కంగీకరించె ననియుఁ గొందఱు చెప్పుచున్నారు.

ఈ రీతిగా గోనబుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణమును రంగనాథుఁడు రచించెననియు, కంకంటి పాపరాజు విరచించిన ఉత్తర రామాయణమును సమీరకుమార విజయకర్తయగు పుష్పగిరి తిమ్మనామాత్యుఁడు రచించెననియు కొప్పర్తి అబ్బయామాత్య తనూభవుఁడగు సరసకవి రచించిన రుక్మిణ పరిణయ మహాకావ్యమును రాపూరి సంజీవరాయకవి రచించెననియు, చిత్రకవి సింగరార్య రచితమగు బిల్హణీయమును పండిపెద్ది కృష్ణస్వామి రచించెననియు, వల్లభామాత్య ప్రణీతమగు క్రీడాభిరామమును శ్రీనాథకవి రచించెననియు, సాహితీ సమరాంగణ సార్వభౌముఁడగు శ్రీ శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యదను అల్లసాని పెద్దనార్యుఁడు రచించెననియు మొదలగు దుర్వాదములు ప్రబలినవి. ఇవి ధర్మసమ్మతములు కావు. భారతరచన నన్నయభట్టారకునిదే అనుట నిస్సందేహము.

ఈ నన్నయ విషయమున మఱియొక వింత వాదము గలదు. "తన కులబ్రాహ్మణు, ననురక్తు" నను రెండు దళముల గ్రహించి విశ్వబ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ, కమ్మ బ్రాహ్మణు లున్నట్లే క్షత్రియ బ్రాహ్మణులు గలరనియు దీనిని బలపఱచునదిగా 'అనురక్తు' అను విశేషణముచే రక్తపార్శ్వ సంబంధ బాంధవ్యము గలదనుచుఁ గొందఱు తెల్పుచున్నారు. క్రీ. శ. 1011 లో అయిదవ పశ్చిమ చాళుక్య విక్రమాదిత్యుని అలూరి శాసనములో

"ఆసీచ్ఛిముఖి వా స్తవ్యో దేవార్యో దేవసన్నిభః
భరద్వాజా న్వయః కమ్మకులః కులవర్ధనః
తస్యాం భవత్సుత శ్రీమాన్ గోవిందో గురునందనః
శ్రౌతస్మార్త క్రియాధార స్సత్తమ స్స ద్విజో త్తమః"

మఱియు నందే—

"విప్రకుళ కమళ భాస్కరం పార్వరోల్లండం
స ప్త గ్రామాగ్రగణ్యం కమ్మకుళోద్భవం
ధీత గోత్రం దిండిపండిత గోత్రం ఛాత్రక
మిత్రం పండిత మండనం వెణ్ణియభట్టు-

అనియు నుండెను.

ఈ శాసనముల బ్రహ్మశ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులు గారు శారద 2-వ సంచిక 3-వ సంఖ్యలో ప్రకటించిరి. ఇందు 'వెణ్ణియ భట్టు' అను భట్టశబ్దము సర్వకులముల పండితులకుండునట్లుగా కన్పట్టు చున్నది. మఱియు "నేఁడు శూద్రులని వ్యవహరింపఁబడుచున్న వారిలో తెలగయను నొక శాఖవారు గలరు. ఈ శాఖ చాల పురాతనమైనది. శంకరాచార్యులవారి కాలమున నీ తెగవారధిక సంఖ్యాకులుదను, సమస్త బలసంపన్నులునై యుండిరి. అందువలన వీరిలోఁ గొందఱి నాయన తమ మతములో చేర్చికొని తెలగాణ్యులని పేరిడి ద్విజులుగ నంగీకరించెను. ఈ విషయమును శంకర శిష్యులొకరు పాదజద్విజప్రవృత్తి అను తమ గ్రంథమున వివరముగ వ్రాసియున్నారు." ఇది శ్రీమాన్ వేదాంతం శ్రీనివాసాచార్యులవారిచే రచింపఁబడిన నంబితంబళ చరిత్రలో 5-వ పుట.

ఇట్లే బెస్తలను బ్రాహ్మణులుగా పరశురాముఁడు చేసినట్లు స్కాందపురాణమున, క్షత్రియుఁడైన విశ్వామిత్రుఁడు బ్రాహ్మణుఁడై నట్లును వాల్మీకమున నితని ప్రసంగము వచ్చినపుడెల్ల బ్రాహ్మణ సంబో



ధనములే కానిపించును. కణ్వుఁడను క్షత్రియుఁడు బ్రాహ్మణుఁడైనట్లు విష్ణుపురాణము, వీతహవ్యుఁడను రాజు బ్రహ్మవాదియైనట్లు ఇందే అనుశాసనికపర్వ ప్రథమాశ్వాసమునఁ గలదు. భిన్నజాతులలోఁ బుట్టి ద్విజులైనట్లు వజ్రసూచికోపనిషత్తులోఁ గలదు. భాగవతమున పలు చోట్ల కులము మార్పిడి కనిపించుచున్నది. ఆయా కారణములవలన కులము మార్పిడి కనిపించుచున్నది. ఇట్లే నన్నయభట్టు నయితము క్షత్రియ బ్రాహ్మణుఁడైనట్లును, అందువలననే రాజు తన కుల బ్రాహ్మణుఁడని సంబోధించినట్లు చెప్పుదురు.

'తన కుల బ్రాహ్మణు' నను పద్యములో "లోకజ్ఞు" దళమును మాత్రము గ్రహించి శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిగారు బ్రాహ్మణులలో వైదికులు - నియోగులు ముఖ్యులని, యిందు మొదటి తెగవారు అలౌకికులు, రెండవ తెగవారు లౌకికులని విశదీకరించి నన్నయ లోకజ్ఞుఁడనుటచే నియోగియై యుండవచ్చునని తెలిపి, నన్నయ భట్ట పురోహితత్వమును వదలించిరి. దీనినే చాగంటి శేషయ్యగారు గ్రహించి తమ ఆంధ్ర కవి తరంగిణిలో ప్రథమభాగము చాలమట్టుకు వైదికనియోగి భేదములు వివరించిరి.

అసలీ పద్యమంతటికి గౌతమధర్మ సూత్రములలోని ప్రథమ ప్రశ్నమున 'సూ. ద్వాలోకే ధృతవ్రతౌ రాజా బ్రాహ్మణశ్చ బహుశ్రుతః'[1] అని బహుశ్రుతుఁడని చెప్పిన నన్నయ సీసమునకు వివరణ మగును. ఇంతటి యర్థసందర్భమును వదలి శాఖాభేదములలోనికి దిగుట మానవమస్తిష్కమునకు మాలిన్యము నాపాదించుకొనుటయే యగును. నన్నయ కులవిచారమును గాక ఆయన రచనాప్రాగల్భ్యమునే పరిగణించుట పండితుల కర్తవ్యము.

---

# నన్నయ లోకజ్ఞత

లోకశబ్దము 1) చూపు 2) ప్రపంచము 3) జనము అని అర్థబోధక మగుచున్నది. వీనిని తెలిసికొను భావమే లోకజ్ఞత అందురు. ఇందు మున్ముందటిది చూపు. జైన బౌద్ధాదిమతముల ప్రభావముచే ఆర్షమత మడుగంటి పోవుచున్న కాలమది. కర్మసన్న్యాసుల సందడి దండదించు కాలమది. భ్రష్టమగుచున్న వైదికమతము సముద్ధరించు ప్రయత్నమునఁ గృతనిశ్చయుఁడైన నన్నపార్యుఁడు ఇనాలోకయోగము లేక ప్రకాశింపని వేటికాంతర్గతమగు మణివలె మఱుఁగుపడి తుదకుఁ దన సంకల్పమున కనువగు సత్ప్రభువు సంప్రాప్తింప ప్రబంధరచనా ధురంధరుఁ డాయెను. వర్ణాశ్రమ ధర్మరక్షణకు దీక్షాకంకణుఁడగు ప్రభువునకు-

మ. ఇవి యేనున్ సతతంబు నా యెడఁ గరం బిష్టంబులై

యుండుఁ బా

యవు భూదేవకులాభితర్పణ మహీయః ప్రీతియున్ భారత

శ్రవణాశక్తియు । బార్వతీపతిపదాబ్జధ్యానపూజామహో

త్సవమున్ సంతతదానశీలతయు శశ్వత్సాధుసాంగత్యమున్.

1. భూదేవకులాభితర్పణ 2) భారతశ్రవణాసక్తి. 3) సాంబశివపదార్చన 4) దానశీలత. 5) సాధుసాంగత్యము ప్రియములు. వర్ణాశ్రమాచారధర్మముల పాటించుచు జపతపోనుష్ఠానపరులై, సత్యశీలసంపన్నులై, క్రమాగతధర్మపరిరక్షకులైన సద్బ్రాహ్మణ సమారాధనము - భారతవీరుల పారలౌకిక ధర్మశ్రవణాశక్తి - సర్వేశ్వరపద సమారాధనము - ముంజేతికంకణము తడియాఱక యిచ్చుదానశౌండిమము-సజ్జనసాంగత్యము ప్రభువులవుఁ బ్రీతి యగునట్లే రచయితకును ముఖ్యములు. ఈ ధర్మరక్షణ నన్నయ ప్రతి పదమునందును గన్పట్టును.



రచనావిశేషము : ఆదిపర్వప్రథమాశ్వాస మంతయు పర్యానుక్రమణిక. ద్వితీయాశ్వాసము గరుడోపాఖ్యానముతో ప్రారంభమైనది. ఈ గరుడోపాఖ్యానము భారతకథా సూచకము. కద్రువగాంధారిగా, తత్సంతతి గాంధారేయులుగా; వినతకుంతిగా, తత్సంతి కౌంతేయులుగా; సర్వత్రసూచింపఁ బడెను. కాద్రవేయులు ఉపద్రవకారులైనట్లే కౌరవులు కాపురుషులైరి*. వినతతొలిచూలు సూర్యుని చేరినట్లే కుంతితొలిచూలు కర్ణుఁడు సూర్యుని నుండి వచ్చి సూర్యునిలోనే లీనమైనట్లు తోఁచును. వినతాపుత్రుఁడగు గరుడుఁడు శ్రీమన్నారాయణునకు వాహనమైనట్లే అర్జునుఁడు నయితము అమరేంద్రువ కనుంగుసుతుఁ డాయెను. కద్రువ బిడ్డల శపించినట్లే గాంధారి కృష్ణుని శపించెను. ఇట్టి కథా సూచనలు సూక్ష్మతరములుగానెన్నో కన్పట్టును. కావ్యములోని కథాభాగమంతయు నిండిమిడి యున్నది. ఈ కథనే దాదాపు శాంతిపరమగు శాంతి పర్వానంతరమైన ఆనుశాసనికపర్వ ప్రథమాశ్వాసమున భీష్ముఁడు ధర్మజునకు చెప్పుట 116 పద్యములలోఁ గలదు. ఆద్యంతముల యందు ఒకే కథ రెండుసారులు వచ్చుట నన్నయ తిక్కన లీ రచనలకు కర్తలగుట విశేషము.

క. రయమున మ్రింగుడు గాలము

క్రియ నెవ్వఁడు కంఠబిలము క్రిందికిఁ జన క

గ్నియపోలె నేర్చుచుండును

భయరహితా! వాని నెఱుఁగు బ్రాహ్మణకులుఁగాన్.

గీ. కోపితుండైన విప్రుఁడు ఘోర శస్త్ర

మగు మహావిషమగు నగ్నియగు, నతండ

యర్చితుండైన జనులకు నభిమతార్థ

సిద్ధికరుఁడగు గురుఁడగుఁ జేయుఁ బ్రీతి

---

* కద్రువ కుమారులలో కౌరవ, ధృతరాష్ట్ర, హలిక మొదలగువారు కౌరవులను స్ఫురింపఁ జేయుచున్నారు. కౌరవకకులము, ధృతరాష్ట్రకులము నుగ జాతిలోఁ గలదు. ఒందు పరాశరుడు గలఁడు. విశేషించి రా రాజునకు సర్పధ్వజము.

అని యుపాఖ్యాన మధ్యమున వర్ణాధిక్యమున వర్ణించుట ప్రత్యేక గమనార్హము.

ధర్మజుఁడు మయసభలో నుండ నారదుడు వచ్చి రాజకీయములఁ ప్రబోధించు పట్టున మూలమున మూలమున లేని పెక్కు విషయములఁ జెప్పుటయే కాక "హీనులగు కర్షకులకును" (సభా. 1-44), "కడు భయమంది వానికిఁ దగన్ మఱి వైశ్యులపోలె వశ్యులై" (సభా. 2-96) యిట్లు కర్షకుల, వైశ్యులవిషయమై తన యభిప్రాయమును వెల్లడించెను.

ఆరణ్యపర్వమున నొకచో "శూద్రాన్నంబునందలి దుగ్ధంబునుం బోలె" (1-252) నని శూద్రుల విషయము చెప్పియుండెను. ఇందే "ధర్మవర్తులైన ... గంగా యమునా సంగమంబును నాడియందు బ్రాహ్మణులకు గోహిరణ్య దానంబులు సేసి" (2-317) యనెను. అరణ్యవాస మొనర్చునాఁడును బ్రాహ్మణులకీయ గోహిరణ్యములు పాండవులకెట్లు సంప్రాప్తించెనా? యని పాఠకు లాలోచించినను నన్నయకు మాత్రము నదీ స్నానానంతరము గోహిరణ్య దానములు గావించుట ముఖ్యమైన దృష్టి.

ప్రపంచము :

క. తగునిది తగదని మెదలో
వగవక సాధులకు బీదవారల కెగ్గుల్
మొగిఁజేయు దుర్వినీతుల
కగు ననిమిత్తాగమంబులైన భయంబుల్. (ఆది. 1-86)

ఇది త్రికాలావచ్ఛేద్యమగు ధర్మము. దీనినే 'కట్టడ' మందురు. ఆకాశమార్గమున నారదుఁడు వచ్చుచుండ

ఉ. నీరజమిత్రుఁ డేల ధరణీగతుఁ డయ్యెడు నొక్కొ-యంచు వి
స్మేరమనస్కులై జనులు మెచ్చి నిజద్యుతి చూచుచుండఁగా



నారదుఁడే గుదించె గగనంబున నుండి సురేంద్ర మందిర
స్ఫార విలాసహాసియగు పార్థ గృహంబునకుం బ్రియంబునన్.
(సభా. 1-23

ఇట పార్థ గృహంబున కన ధర్మజు నింటికి లేదా అర్జుననింటికని వచ్చును. అర్జును నిమిత్తముగా సభ సంప్రాప్తించినను జ్యేష్ఠుఁడగు ధర్మజుని యధికారములోనిదిగా భావింపవలెను. తమ్ముల సంపాదన అన్నకగుట ప్రపంచ ధర్మము. "కడు నిమ్ముగా దున్ని బీజములు చల్లి" (ఆరణ్య. 1-235) "జాతసస్యమైన వసుధతోయ సంప్రాప్తి నాప్యాయితమైనట్లు" (ఆరణ్య. 2-220) "భూమి కనావృష్టియైనఁ గడునల్లి పురుహూతుతోడ" (ఆర. 3-206) ఇత్యాదులు రైతు జీవితమును, నన్నయ ప్రపంచానుభవమును వెల్లడించుచున్నవి.

జనము :

క. చను బొంకగఁ బ్రాణాత్యయ
మున, సర్వధనాపహరణమున, వధగా వ
చ్చిన విప్రార్థమున, వధూ
జన సంగమమున, వివాహసమయములందున్. (ఆది. 3-189)

'ఈ యేనింటియందు నసత్యభాషంబు లేదు.' ఇట్లే పోతన భాగవతములో "వారిజాక్షులందు..." అని యున్నది. సత్యాసత్యములు రెండును సమయానుకూలముగా పలుకవచ్చునని యజుర్వేదములోని యగ్నికాండమున మంత్ర మొకటి గలదు. దానినాధారముగా ప్రజలకీ బోధ గావింపఁబడెను.

క. పతిహీనలైన భామిను
లతిధనవతులయ్యుఁ గులజలయ్యు నవలం
కృతలయ్యెదు మాంగల్య ర
హితలయ్యెదుఁ గృపణవృత్తి నివియు మొదలుగాన్.
(ఆది. 4-230

దీర్ఘతముని శాపనెపమున భర్తృహీన లిట్లుండవలెనని ప్రజల కిచ్చిన సూచన.

క. కడు నధికులతోఁడఁ దొడరినఁ
బొడిచిన నొడిచినను బురుషు పురుషగుణం బే
ర్పడుఁ గాక హీను నొడుచుట
కడిఁదియె పౌరుషము దానఁ గలుగునె చెపుమా!

(సభా. 1-124)

కయ్యము నెయ్యము వియ్యము సమమైన వారలలో నని యున్నను కడునధికులతోఁడఁబోరాడిన మేలని, హీనుతోడ తగదని చెప్పుట మానవధర్మమును బోధించుటయే.

నన్నయరచనలోని యుపాఖ్యానములెల్ల ప్రత్యేకప్రబంధములే యైనను ఆరణ్యపర్వద్వితీయాశ్వాసములోని నలోపాఖ్యానము ప్రత్యేక ప్రబంధరాజమని పండితప్రశంసల నందుకొన్నది. అందు భార్యనుగురించి

తే. అధికదుఃఖ రోగార్తున కౌషధఁబు
సురుచిరఁబుగ భార్యయ చూవె; యెందు
నొనవ భార్యసమేతుఁడై యున్నవాని
కెంత లయ్యును నాపద లెఱుకపడవు. (ఆర. 2-74)

క. అలసినెడ, డస్సినెడ నాఁ
కలి దప్పియు నైనయెడలఁ గడుకొని ధరణీ
తలనాథ! పురుషునకు ని
మ్ముల భార్యయ పాచుఁ జిత్తమున దుఃఖంబుల్.

(ఆర. 2-75)

స్త్రీ లేనిపురుషుఁడు, పురుషుఁడులేని స్త్రీ సంపూర్ణతనందలేరని సృష్టి కరించిన యిప్పట్టులు సకలజనశిరోధార్యములు.



ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకవితాకలితార్థయుక్తి లో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప చా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారతసంహితా రచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్.

నన్నయలోని యీ విశేషములుగాని "ధర్మతత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని" పలువురు పలువిధములుగా భావించు భారతపరమార్థ మును గాని పలుకుట సముద్రమునకేతా మెత్తుటయే యగును.

నన్నయ కన్నడీఁడు. రాజరాజనరేంద్రుఁడు తమిళుఁడు. భారతరనచ తెలుఁగు. ఈ మూఁట పమ్మేళన త్రివేణీ సంఘమము. ఇందు కవితారస రసావగాహనముగాలించినవారు చరితార్థులు కృతా ర్థులు పూతచరితులగుటలో నెట్టి సందేహమును లేదు.

ఈ బృహత్తరకార్యమును నిర్వహించు మదరాసు విశ్వవిద్యాల మాధిపతులు, ఆంధ్ర శాఖీయులు సుకృతులు.

- రచయిత -

కొండవీటి వేంకటకవి

మదరాసు - సోమ. 29-11-198.

Office of the Curator
14 FEB 199
Madras-600 005
Govt. Oriental Manuscripts

# నన్నయ భాష

**Dr. L. B. SANKARA RAO,** M.A., Ph.D.,
Professor of Telugu,
Presidency College, MADRAS-5.

నన్నయ విపుల శబ్దశాసనుడు. తర్వాత వెలుగొందిన తిక్కన ఎఱ్ఱనాది మహాకవులకు ఈ వాగనుశాసనుని భాష మార్గదర్శకప్రాయం. అనంతరం వెలసిన వ్యాకర్తలకు ఆదికవి భాష లక్ష్యప్రాయమైంది. నన్నయ భాషావైశిష్ట్యం ఎంతటిదంటే మొన మొన్నటి చిన్నయ సూర్యాది వ్యాకర్తలు కూడా ఇతని భాషకే ప్రధానంగా లక్షణాలు చెప్పారు. అందరికి ఒజ్జబంతియైన నన్నయభాషా విషయక వివిధాంగాల లోని విభిన్నాంశాలను దిఙ్మాత్రంగా పరిశీలించటమే ప్రస్తుతం నా యీ కర్తవ్యం.

ధ్వనులు :

1. నన్నయ ఋ-రి లకు యతిమైత్రిని పాటించాడు - ఋత్విజుండని విచారించి పూజించితే (2-2-11). కాబట్టి ఆకాలంలో 'ఋ' ని 'రి' గా ఉచ్చరించేవారని మనం ఊహింపవచ్చు. ఆనాటి శాసన భాషను పరిశీలిస్తే ఈ విషయం సుబోధకమవుతుంది - పృథ్విని ప్రిధ్విగా శాసనాల్లో రాశారు. తర్వాతి కాలంలో 'ఋ'ను 'రు' గా ఉచ్చరించటం జరిగింది. పండితారాధ్య చరిత్రలో ఈ యతి వుంది - రురు వర్ణదేహంబు ఋగ్వేదమునకు (పు. 523)

2. నన్నయ యతిలోగాని, ప్రాసలోగాని సాధుశకట రేఫలకు సాంకర్యం చేయలేదు - కాని ఒకే పదం ఒకసారి సాధురేఫతో మరొక సారి శకటరేఫతో రాయబడింది - నెరయఁగ (1-8-157), నెఱయంగ (1-6-161); రాయి (1-7-120), ఱాయి (1-6-115) అంటే ఆనాటికే సాధుశకట రేఫల విషయంలో తబ్బిబ్బు బయలుదేరిందన్నమాట,

అందువల్లే తర్వాతి లక్షణకర్తలు సాధుశకట రేఫల పదపట్టికలు తయారుచేయటం జరిగింది.

3. క్ష అనే సంయుక్తాక్షరంలో మొదటి ధ్వనియైన కకారానికే ఆనాడు ఉచ్చారణలో ప్రాధాన్యం ఉన్నట్లు నన్నయ వేసిన యతిని బట్టి చెప్పవచ్చు. ఇతడు క్షకారంతో క వర్గాక్షరాలకే యతి వేశాడు. ఉదా:- "సాక్షాద్విష్ణుండవు నీవు భూపతులలో కౌరవ్య వంశోత్తమా" (1-2-228), క్షత్త్రియుడుద్భవిల్లియు నఘక్షయకారణుడున్ మహా తపః (3-3-136).

4. జ్ఞ అనే సంయుక్తాక్షరంలోని 'జ' తో చవర్గానికి, ఊష్మాలకే ఇతడు యతి పాటించాడు - ఉదా: జామదగ్న్యుండు నిర్మల జ్ఞాన దృష్టి (3-3-128), జ్ఞానము సర్వ భూతహిత సంహిత బుద్ధియు జిత్త శాంతియున్ (1-1-57). తిక్కననాటికే దీని ఉచ్చారణ 'గ్న'గా మారిందని అతడు వేసిన యతిని బట్టి చెప్పవచ్చు - అజ్ఞానికి నుపదేశ విధి ప్రకాశము సేయన్ (12-4-255), ఇప్పుడిది 'గ్న'యే.

5. ఆ కాలంలో అద్రుచు, విద్రుచు పదాల్లోని రేఫను తేల్చి పల్కేవారని ఛందస్సును బట్టి చెప్పవచ్చు - ఉదా: క. కొనిన విచింత్యుండు గూలె గుతలం బద్రువన్ (3-1-162).

వర్ణములు: కంఠ్యానునాసికమైన 'ఙ'కారానికి దంతమూలీయ 'న'కారానికి, అల్లే తాలవ్య 'ఞ'కు దంతమూలీయ 'న'కు అన్యోన్య పరిపూరక వ్యాప్తి [Complimentary distribution] లేదు - ఉదా: ఉఙ (1-6-270), విన్చిన్ (1-5-138) (Telugu Verbal Bases P-2) కాబట్టి వీటిని వేరే వర్ణాలుగా పరిగణించాల్సి వస్తోంది. అయితే ఈ రెండు అనునాసికాలకు అర్థభేదం సూచించే కనిష్ఠ పదాల జంట (Minimal Pairs) లేవు. నన్నెచోడునిలోను ఈ లక్షణం ఇలాగే వుంది. ('A study of the language of Nannechodadeva's Kumarasambhavamu') (P. 2).



సంధి: 1. నన్నయలో మధ్యమ పురుష క్రియలందిత్తునకు సంధి నిత్యంగా జరిగింది - చేసితివది (1-1-140). ప్రథమోత్తమ పురుషల్లో ఈ సంధి వికల్పంగా జరిగింది.

2. బహువచన లకారం మీద కనబడే షష్ఠీ అకారం సంధిలో లోపిస్తున్నది - ఉర్వీశులొద్ద (1-7-233), వృద్ధరాజులొద్ద (1-6-120).

3. గసడదవాదేశం తత్సమ పదాలపై కూడ కనబడుతోంది - ధారుణి వాలింతే (2-1-42), ధర్మును దపంబు నేసిన (3-2-270).

4. అను, చను మున్నగు తద్ధర్మార్థక విశేషణాలలోని అచ్చు హల్లు పరమైతే లోపిస్తున్నది - గిరివ్రజ మన్పురంబులో (2-1-119), నూఱు వేడ జన్వరములు (2-2-263) (ప్రౌఢ సంధి - 14).

1808

5. సామాన్యంగా ద్రుత ప్రకృతికంలోని పొల్లు నకారం అజాది పదం పరమైనపుడు లోపించటమో, లేక అచ్చుతో కలిసిపోవటమో జరుగుతుంది. కాని భారత భాగంలో కొన్నిచోట్ల ద్రుతద్విత్వం కనబడుతోంది - ఎన్నడున్నేది (1-7-142), (ప్రౌఢ సంధి). ఈ సామ్యంచేత కాబోలు శబ్దసహజమైన నకారానికి ద్విత్వం వచ్చింది - ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యంలో మణ్ణాస, పొన్నాస, పెణ్ణాస లున్నాయి. (3-185), మరో విశేష మేమిటంటే నన్నయలో అన్నిష్టసఖ (1-3-140) ఉంది. (ప్రౌఢ సంధి - 9), ఈరూప సాధన ఎలాగంటే అను + ఇష్టసఖ - నుగాగమం వచ్చి అనునిష్టసఖ అయి ఆ తర్వాత పదమధ్యాజ్లోపం వచ్చి అన్నిష్టసఖ అవుతుంది. నన్నెచోడునిలో మన్యాన (10-142) ఉంది.

6. నన్నయలో పుంప్వాదేశం వచ్చిన రూపాలు ఐదే వున్నాయి. వాటిలో రెంటికి పాఠాంతరాలున్నాయట (History of the Telugu Language P. 1351). తర్వాతి కాలపు కవుల్లో పుంప్వాదేశ రూపాలు చాల సహజమయ్యాయి.

నామములు: 1. సాధారణంగా విశేషణంగా వుండే 'నల్ల' అనే రూపం నన్నయలో విశేష్యంగా వుంది - ధవళ దేహంబు నందు నల్ల గలిగిన......అందు నల్ల లేదయ్యేనేని (1-2-32)

2. అదంతమై పుంలింగంబయిన మహద్వాచకానికి - డుజ్ పర మైనపుడు అచ్చుల పరస్పరాకర్షణవల్ల (Vowel Harmony) అ > ఉ గా మారుతుంది. నన్నయలో అలా మారని రూపం గరుడడు (1-2-76) వుంది.

3. కద్రూ శబ్దాలో దీర్ఘం లోపించి, ఉచ్చారణార్థం ఒక 'వు' వర్ణం జేరి కద్రువు కావాలి. కాని ఇతనిలో నాగమాతను బోధించే ఈ శబ్దం కద్రువ (1-2-42)గా వుంది. (బాల-తత్సమ - 51).

4. బహువచనంపై మరో బహువచనం చేరిన రూపాలున్నాయి- ఊళ్లుల (1-6-267) కోడండ్రుర యందు (2-2-257), వారలు (1-5-65), వీరలు (1-4-239) (ప్రౌఢ - శబ్ద - 48). గౌరవార్థక బహువచన రూపాలు కొన్ని కనబడుతున్నాయి - వీరు కుంతి మహాదేవులు (1-7-239), గౌరవ బహువచనాన్ని వ్యంగ్యంగా పరిహాస ధోరణిలో వాడటం వుంది - వీరెవరయ్య ద్రుపద మహారాజులె (1-6-90).

విభక్తి: 1. ప్రథమా విభక్తిలో 'కూతురు'గా వున్న రూపం ప్రథమేతర విభక్తిలో 'రు' వర్ణాన్ని జార్చటం వుంది - కూతులన్ (1-7-87).

2. ద్వితీయా విభక్తిలో గుఱించి (3-4-52), గుఱిచి (1-7-24) రూపాలేగాని గూర్చి రూపం కనబడదు.

3. తృతీయా విభక్తి ప్రత్యయమైన నకారంపై 'చేసి' చేరి తృతీయా విభక్త్యర్థం వ్యక్తం చేస్తున్నది - ఏక విప్ర సంబోధన జేసి (1-1-24) (ప్రౌఢ - కారక - 4).

Tel. 1808



4. చతుర్థిలో పొంటెన్ విభక్తి ప్రత్యయం వుంది - కార్య సంప్రయోగము పొంటెన్ (2-1-26) (ప్రౌఢ - కారక-9) మరో విశేష మేమంటే 'తదర్థం' అనే పదం చతుర్థీ విభక్త్యర్థంలో ప్రయోగింపబడి వుంది - నీ తదర్థంబులై నిఖిల వేదంబులు వర్తిల్లు లోకపావనములగుచు (2-1-259).

5. పంచమిలో కోలెన్ ప్రయుక్తం. ఇది కాల, దూర ప్రమాణ వాచకాలపై చేరింది - నాటంగోలె (1-6-308), యోజనంబునం గోలె (1-3-41), విన్నటం గోలె (1-8-118). పంచమ్యర్థంలో కతమున (< కృతమున) వాడబడింది - నీ కతమున నా దాస్యము ప్రాకటముగ బాయున్ (1-2-51).

6. ఒక విభక్తికి మరొక విభక్తి రావటం భాషలో సహజం (బాల-కారక - 21), ద్వితీయకు బదులు ప్రథమ రావటం సర్వ సామాన్యం (బాల. కారక - 24), అయితే ప్రాణి వాచక అమహత్తు ద్వితీయకు ప్రథమ రావటం ఇక్కడ విశేషం - అమ్మదనాగ మొదిర్చి క్రమ్మరించిన వరికాడువోలె (1-4-206) (మదనాగమును) (ప్రౌఢ - కారక - 19). చతుర్థికి బదులు ప్రథమ వాడటం వుంది - తచ్ఛీకరాంబుకణముల చల్లని గాడ్పున పడి వాని జెంది సుఖంబున్న సింహములును (1-4-23) (చల్లని గాడ్పు కొఱకు) చతుర్థికి బదులు ద్వితీయ రావటం - పురోహితులన్వేషించుచు (1-1-86) (పురోహితుని కొఱకు) షష్ఠీ విభక్తికి బదులు ప్రథమ రావటం చక్కని విశేషం - పరాశరసుతుం బ్రణమిల్లి (1-1-76) (పరాశరసుతునకు).

సర్వనామములు: 1. ఉత్తమ పురుషైక వచనంలో ఏను రూపాలు చాల ఎక్కువ. నేను రూపాలు ఐదు మాత్రమే వున్నాయి. (Descriptive analysis of Nannaya's usage P. 68) ఉన్న ఐదు రూపాలు కూడ ద్రుతాంత పదాలపై వచ్చాయని అందువల్ల నన్నయ హలాది పదాలు వాడలేదంటున్నారు. (HTL. P. 1408) బహువచనంలో కూడ ఏము రూపాలెక్కువ. మేము రూపాలు ఐదే.

2. మధ్యమ పురుషైక వచనంలో కూడ హలాది రూపాలు కంటె అజాది రూపాలెక్కువ. అయితే బహువచనంలో మాత్రం అజాది రూపాల కంటె హలాది రూపాలెక్కువ (DAN. P. 70) అంటే హలాది రూపాల వాడుక కాలూనుతున్నదన్న మాట.

3. వాడు, ఎవ్వడు, దాని మున్నగు సర్వనామములు న్యూనార్థంలో వాడబడలేదు. వాడు రెండవ యింద్రుండయ్యెడు (1-2-37), ఇమ్మనుజుం డెందుల వాడెవ్వడనినన్ (3-1-372) (అర్జునుని) కవలు దాని పల్లవ తామ్ర పాద తలంబులు.....ఒత్తుచుండిరి (3-3-298) (ద్రౌపదిని).

4. మధ్యస్థతా బోధకమైన నిర్దేశ సర్వనామ ప్రాచీన రూపం ఒకటి ఉంది - ఉల్ల తెల్లని తురగోత్తము వాలంబు (1-2-34) తర్వాతి కవుల్లో ఈ రూపమెక్కడా కనబడదు.

సంఖ్యావాచకములు: 1. ఒక్కడు అనే సంఖ్యా వాచక రూపం మహదమహదర్థం రెంటిలోను వాడబడింది. మహత్ - భీము డొక్కండ (3-4-104), అమహత్ - ఒండొంటితో జక్కనంటి రెండు నొక్కడయ్యె (2-1-148). ఒకటి సంఖ్యా వాచక రూపం కూడ అమహత్తులో వుంది - అబ్ద మొకటి (3-4-98) బలహీను లొక్కలై కూడి (3-1-351). ఒకటి రూపాలకు పాఠాంతరాలున్నాయని, నన్నయ దీన్ని వాడలేదని కీ. శే. చిలుకూరి నారాయణ రావు (HTL. P. 1411).

2. సంఖ్యేయ వాచకాలు (Ordinals) అగు, అవ చేర్చటం వల్ల ఏర్పడ్డాయి - రెండగు (1-7-225), పదియగు (1-6-284), రెండవ (1-2-7), నాల్గవ (1-1-42). నేటికిది ఓ - రెండో, మూడోగా మారిపోయింది.

క్రియలు: 1. దేశ్య క్రియల్లో ఉఱు, వారు మున్నగునవి కేవలం వ్యతిరేకమునందే ప్రయోగింప బడ్డాయి - ఉఱక (1-2-48), ఉఱదె (1-5-111); వారక (I-3-114), వారని (1-5-42).



2. కొన్ని క్రియా ధాతువులు ప్రాచీన రూపాలతో వున్నాయి. తోడు - పొలుపుగ పూలికట్టి తోడి (1-8-174). మెఱయు (1-6-97), ధాతువు మెఱచు (3-3-177) అనే రూపాంతరంతో వుంది.

3. తత్సమ క్రియాధాతు నిర్మాణంలో రుగాగమ మున్న తేజరిల్లు (1-1-41) ఒక ప్రయోగముంది.

4. తద్ధర్మార్థక క్రియారూపాలు (DAN. P.), వ్యతిరేక క్రియా రూపాలు (తెలుగు భాషా చరిత్ర పు. 229) మూడు కాలాలలోను ప్రయోగింపబడ్డాయి.

5. కొన్ని క్రియలు అకర్మకంగాను, సకర్మకంగాను ప్రయోగింపబడినాయి - అకర్మకంగా - వాన......కురిసి (3-3-298) సకర్మకంగా - అంగార వృష్టి గురియుచు (1-7-107).

6. అకర్మక క్రియలు కొన్ని సకర్మక ప్రత్యయాలను తీసికొనకుండా సకర్మకార్థంలో వాడబడ్డాయి - మహా విభవంబు మెఱసి (1-3-24) (మెఱయించుచు). అగ్నులు విహరింపుమని పంచి (1-1-129) (DAN. P. 109) నన్నెచోడునిలోను ఇటువంటి ప్రయోగాలున్నాయి. (LNK. P. 112)

పదకల్పకములు: [CLITICS] 1. నన్నయలో ఏవార్థయం ప్రత్యయం (Emphatic) అ. ఎ - సర్వలోకములకు వల్లభుండతడ కావున (1-5-120), భూరిభుజుడు దానై పోయెనో (3-3-372).

2. ప్రశ్నార్థక ప్రత్యయం - ఎ, ఏ - నీకు ననార్యులు చుట్టములె (3-1-227), శాఖాగ్రమున నన్న పక్షి శిరము దెల్లముగ జూచితే (1-5-249) నన్నెచోడునిలోను ఈ ప్రత్యయాలిలాగే వున్నాయి. (LNK. P. 137). నేటికిది మారిపోయి ఏవార్థకంలో - ఏ, ప్రశ్నార్థకంలో 'ఆ'గా మార్పుచెందాయి.

భావార్థకము : భారతంలో భావార్థక ప్రత్యయం - డు, - ట రెండూ వున్నాయి. అయితే 'డు' రూపాల కంటె 'ట' రూపాలే ఎక్కువ - చూచుట (3-3-351), పలుకుట (3-1-364), అగుడు (3-3-14), నన్నెచోడునిలో కూడ 'డు' రూపాలకంటె 'ట' రూపాలే ఎక్కువ. (LNK. P. 129) తర్వాతి తెలుగులో 'డు' రూపాలు లోపించాయి. ఆధునికాంధ్రంలో - టం, - డం, చేయటం, వండడం ఉన్నాయి.

అర్థవిపరిణామము : నన్నయ భాషను నేటి కాలపు భాషతో పోల్చి చూచినపుడు ముఖ్యంగా అర్థం విషయంలో కొంత భేదం కనబడుతోంది. నన్నయ వాడిన పదాలు కొన్ని అర్థవ్యాకోచంతో వున్నాయి.

1. అర్థసంకోచము : కొప్పు అంటే ఆ రోజుల్లో జుట్టుముడి, వేనలి, కొన. వాని గొప్పు వట్టి ఈడ్చికొని వచ్చె ధర్మజు కడకు (1-7-45) పడియున్న పాములం దన వింటి కొప్పున నెత్తి (1-2-166). నేడు స్త్రీల కొప్పే కొప్పు. వేరే కొప్పు లేదు. అవ్వ అంటే నాడు స్త్రీ సామాన్య వాచి - అంతి పురంబున నున్న ముదుసలి యవ్వలెల్ల బఱతెంచి (2-1-150), భీష్ముడు ద్రౌపదిని - అవ్వా నీ ప్రశ్నంబునకు నుత్తరంబయ్యుధిష్ఠిరుండు సెప్పవలయు (2-2-245) అని సంబోధిస్తాడు. నేటికి కూడా కన్నడంలో అవ్వ స్త్రీ సామాన్య వాచియే. నేడు అవ్వ అంటే వృద్ధ స్త్రీ. కొన్ని ప్రాంతాల్లో నాయనమ్మ. గాడ్పు = గాలి అనే ఆ రోజుల్లో అర్థం - గాడ్పుతోడి వాన పెద్దయుం బ్రొద్దు గురిసి (3-3-298). నేడు వేసవికాలపు వేడిగాలినే గాడ్పంటాం.

2. అర్థాపకర్ష : అర్థాపకర్ష పొందిన రూపాలూ ఉన్నాయి. కంపు = వాసన అనే ఆనాడర్థం - కుసుమ తతులు......తమ కంపు విఱువక యుండు (3-2-197). నన్నెచోడునిలో కూడ ఇదే అర్థంలో ప్రయుక్తం - కంపులేని కనకరుచి యేల (3-9). నేడీ పదానికి దుర్వాసన అని అర్థం. నన్నయలో బూతు అనగా పొగడేవాడు - అంటే భట్రాజన్న మాట - బూతు పొగడినట్లు పొగడెను (2-2-48). నేడు బూతు అంటే అశ్లీలార్థం.



3. అర్థోత్కర్ష : మర్యాద అనే పదం హద్దు, పద్ధతి, ఆచారమనే అర్థాల్లో ప్రయుక్తం - చేసితి మర్యాద దీని జేకొనుడు జనుల్ (1-3-121). నేడు మర్యాదంటే గౌరవంగా జూడటం.

4. లక్ష్యార్థము : జీవితమంటే నాడు జీవిత భత్యమని అర్థం - భృత్యకోటికి సమానముగా దగు జీవితంబు లాయత్తము సేసి యిత్తె (2-1-37), నూరు గద్యాణంబులు జీవితంబు వాడు (3-2-159). నేడు జీవితమంటే బ్రతుకు, మనుగడ, మనికి అనీ అర్థం. మతమంటే ఆరోజుల్లో అభిప్రాయం అని అర్థం - విదురు మతము పాండవేయ హితార్థంబు (2-2-150). నేడు మతమంటే Religion. లావు అంటే ఆనాడు బలం (అలవు > లావు) - భూవలయంబు నెల్ల నా లావునఁ బూని తాల్తున్ (1-2-115) నేడు బొద్దుగా వుండటం, stoutness, స్థూలం.

జాతీయములు : నన్నయ భారత భాగంలో హృదయాని కింపైన జాతీయాలెన్నో వున్నాయి. కొన్ని చూడండి - నీవే కన్నులం జూచితే యక్క (1-2-31), రోయు తీగ కాళ్లం బెనగెన్ (1-5-220), కుంతి కడుపు చల్లగా బుట్టిన ఘనభుజుండు (1-6-19), రొమ్మున జేయిడి నిద్రవోయె (1-6-63), ఆలఅచి నట్లుఅచెన్ (1-6-169), వంటయిల్ కుందేలు జొచ్చె (1-6-187), జము కుత్తుక జొచ్చి వెలువడునట్లు (1-6-195), కుడిచిన చోటికి కూర్పవేపుడు (2-2-188), కన్ను మూయదు నాకున్ (3-1-270), దుర్యోధనుండు దుర్బుద్ధి యని యేమో సెప్పవలయు (3-1-370) నీకు నేనే నాటి తల్లిని నిజము సెప్పుము (3-1-362), సూక్తులు, లోకోక్తులు నన్నయ భారత భాగంలో కోకొల్లలు-శూరుల జన్మంబు సురల జన్మంబును నేఱుల జన్మంబు నెఱుగంగ నగునె (1-6-60), పురుషహీనమయిన యువతి జూచి ఎల్లవారు చులుకన పేక్షింతురు (1-6-257), కాముశక్తి యుడివింపగ శక్యమై యెట్టి వారికిన్ (1-7-59), పెద్దల చరితం బల్పులకు నెఱుగ శక్యమే యెందున్ (2-2-19), ఎఱుక గలరె మగువలెందు (1-2-34), వేదు వెంతయు కష్టము (1-5-218), వృద్ధుల బుద్ధులు సంచరింపవే (2-2-9).

వాక్య నిర్మాణము: 1. ప్రాఙ్నన్నయ శాసనాల్లో వలెనే ఇతనిలో కూడ క్రియా విరహిత రచన వుంది - నిండు మనంబు నవ్య నవనీత సమానము, పల్కు దారుణా ఖండల శస్త్ర తుల్యము జగన్నుత విప్రుల యందు, నిక్క మీ రెండును రాజులందు విపరీతము (1-1-100). మరొక చక్కని ఉదాహరణ.

నుతజల పూరితంబులగు నూతులు నూటికంటె సూనృత
వ్రత యొక బావిమేలు, మఱి బావులు నూటికంటె నొక్కస
త్క్రతు వది మేలు, తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు, త
త్సుత శతంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్
(1-4-94)

ఈ పద్యంలో సమాపక క్రియ లేనే లేదుగదా!

2. అమహత్తులో బహువచన క్రియకు బదులు ఏకవచన క్రియ నుపయోగించుట ద్రావిడ భాషల్లో సహజం, భారతంలో - కులిశధారల్ కుంఠితంబయ్యె (1-2-81) (బాల-కారక - 20) అని ఉంది. ఇందులో క్రియే కాకుండా కుంఠితంబులు అని బహువచనం కూడా ఉండాలి.

3. అమహదేక వచనం క్రియకు - మహద్బహువచనక్రియ వాడటం విశేషం - గీర్వాణ ప్రభుడాదిగ గీర్వాణ గణంబు కాలకేయుల తోడం గర్వించి రణము సేసిరి (3-3-41) (ప్రౌఢ-శబ్ద - 17).

4. సహార్థంలో యుష్మదస్మదర్థక సర్వనామాలలో ఒకదానికే ఏకవచన క్రియ వాడాడు - విప్రకులుండ! వెల్వడుము వేగమ నీవును నీ నిషాదియున్ (1-2-63) (ప్రౌఢ-క్రియ - 26).

5. నన్నయలో షష్ఠ్యర్థక రచన మెండు - నా నేర్చువిధంబున నికావ్యంబు రచియించెద (1-1-20) (నేను), తమ విహరించుచున్న యవ్వనంబునకు మృగయా వినోదార్థంబు యయాతి వచ్చుటం జేసి (1-3-141) (తాము).



6. కర్మణ్యర్థక రచనా రీతి సంస్కృతం నుండి ద్రావిడ భాషల్లోకి దిగుమతయ్యింది. నన్నయలో ఈ కర్మణ్యర్థక రచన ఎక్కువ. ఉదా. నిష్ఠమెయిన్ భవదగ్ని హోత్రముల్ పోడిగా వేల్వగా బడియె (1-3-112), భామ భరియింపబడు గాన భార్యయయ్యె (1-4-228), ధారుణినట్టి యపూర్వ సభా రచనలు వినగ జూడబడ వెవ్వరిచేన్ (2-2-139).

7. యత్తదర్థక సర్వనామ రచన సంస్కృత ప్రభావంచే తెలుగులోకి వచ్చింది - యత్ - తత్ - నీకు నభివాంఛిత మెయ్యది దాని జెవుము చేయుదుననినన్ (1-1-109). యావత్ - తావత్, ఎంత-అంత - ఎంతకాలము నీ శరీరంబున నా విషంబుండు నంత కాలంబును (3-2-128), యదా - తదా, ఎన్నడు - నాడు - నాకు నీవెన్నండేని యవమానంబు దలంతువు నాడ నిన్నుం బాసిపోవుదు (1-2-155). ఈ రచన నన్నెచోడునిలోను ఉంది - ఎవ్వని - అతడు - నీవెవ్వని మనమున దగవర్తించి తతడు ముక్తుండగు (7-82). ఎవ్వని - వాని రచన పోతన భాగవతంలో పరాకాష్ఠ పొందింది పరిశీలించండి -

"ఎవ్వనిచే జనించు జగమె, వ్వని లోపల నుండు లీనమై,
ఎవ్వని యందు డిందు, బరమేశ్వరు డెవ్వడు, మూలకారణం
బెవ్వడ, నాది మధ్యలయు డెవ్వడు, సర్వము దానయైన వా
డెవ్వడు, వాని, నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్.
(రిస్క - 78)

నన్నయ ప్రయోగించిన భాషా విషయక విభిన్నాంశాలు లాక్షణికాలై తర్వాతి మహాకవులకు శిరోధార్యాలయ్యాయి. నన్నయ వయనించిన మార్గం తర్వాతివారందరికి అవశ్యం అనుసరణయోగ్యమైంది. అందువల్లే లక్షణకర్తలు

ఆ మూడు పర్వములలో
నామాన్యుడు నుడువు తెలుగులరసికొని కృతుల్

దాము రచించిరి తిక్కన-సు
ధీమణి మొదలైన తొంటి తెనుగు కవీంద్రుల్.

(అప్ప. పీఠిక. 47)

అన్నారు. కాలభేదం కారణంగా నేటి భాషా దృష్టితో అలనాటి నన్నయ భాషను పరికిస్తే కొంత విలక్షణంగానే మనకు దర్శనమిస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు:


1. History of the Telugu Language — C. Narayana Rao
2. Telugu Verbal Bases — Bh. Krishna Murti
3. Historical Grammar of Telugu Language — K. Mahadeva Sastry
4. A Descriptive Analysis of Nannaya's usage (unpublished Thesis) — K. Nagabhushana Rao
5. A Study of the Language of Nannechodadeva's Kumarasambhavam (unpublished Thesis) — L.B. Shankara Rao
6. ఆంధ్ర వాఙ్మయారంభదశ - నన్నయ భారతము - దివాకర్ల వేంకటావధాని.
7. తెలుగు భాషా చరిత్ర - ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ ప్రచురణ.
8. నన్నయ పదప్రయోగ కోశము - ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ ప్రచురణ.
9. బాల వ్యాకరణము - చిన్నయసూరి.
10. ప్రౌఢ వ్యాకరణము - బహుజనపల్లి సీతారామాచార్యులు.


---

Tel. 1808

Office of the Curator
14 FEB 1995
Madras-600 005
Govt. Oriental Manuscripts Library